


www.andhrajyothy.com
అనంతపురం సిటీ
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 17
సంచిక (Issue) : 206




శనివారం | 26-10-2019 | పేజీలు: 14 + 16

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 3.47 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తర ఉ. 8.28 తదుపరి హస్త తె. 5.50; వర్జ్యం: మ. 3.56-5.22; దుర్ముహూర్తం: ఉ. 6.15-7.47; అమృతఘడియలు: రా. 12.29-1.54; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.44

Anantapur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

# ఉసురు తీసిన ఇసుక

## ఇద్దరు భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్య


నాగ బ్రహ్మాజీ


వెంకట్రావు


కన్నీటిపర్యంతమవుతున్న నాగ బ్రహ్మాజీ భార్య, అత్త

### ధైర్యం చెప్పినా...

"ఇసుక లేకపోవడంతో పనులు లేకుండా పోయాయి. అప్పుకోసం వెళితే ఇసుక వచ్చేదెప్పుడు, అప్పు తీర్చేదెప్పుడంటూ హేళనగా మాట్లాడారని బాధపడ్డాడు. మరో పనికి వెళ్లలేకపోతున్నానని.. భార్య, పిల్లలను చూసుకోలేని నేను బతికి ఏమి ప్రయోజనమని అనేవాడు. నేను పనికి వెళతానని ధైర్యం చెప్పాను. రెండు నెలల నుంచి స్పిన్నింగ్ మిల్లులో కూలికి వెళ్తున్నాను. పసిపిల్ల తల్లితో పనిచేయిస్తున్న కసాయివాడినంటూ ఆవేదన చెందాడు. ఇప్పుడు పసిపిల్లలను అనాథలను చేసి వెళ్లిపోయాడు"

- నాగ బ్రహ్మాజీ భార్య లక్ష్మీ తిరుపతమ్మ

### గుంటూరు జిల్లాలో వరుస విషాదాలు

- నాలుగైదు నెలలుగా అప్పులతో తిప్పలు
- రెండు నెలలుగా కూలికి వెళ్తున్న భార్య
- ఆవేదన తట్టుకోలేక ఒకరి ఆత్మహత్య
- పనుల్లేక, మద్యానికి బానిసై మరొకరు

గుంటూరు/తెనాలి రూరల్, అక్టోబరు 25: ఇసుక కొరత భవన నిర్మాణ కార్మికుల ఉసురు తీస్తోంది. గుంటూరు జిల్లాల్లో ఒకేరోజు ఇద్దరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పొన్నూరు మండలం మునిపల్లెకు చెందిన నాగ బ్రహ్మాజీ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు సంగం జాగర్లమూడికి చెందిన లక్ష్మీతిరుపతమ్మతో వివాహమైంది. ఏడేళ్లుగా అదే ఊరిలోనే ఉంటూ... భవన నిర్మాణ

మిగతా 12వ పేజీలో...

### సర్కారుదే ఈ పాపం

- ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలపైమాటే.. బాబు హయాంలో ఉచితం
- ఇప్పుడు పొరుగు రాష్ట్రాలకు అమ్మకం.. కార్మికులేమో విలవిల
- రాష్ట్రవ్యాప్తంగా ఆకలి కేకలు.. మీ విధానం ఇప్పటికైనా మార్చుకోండి
- ధ్వజమెత్తిన టీడీపీ.. ఇసుక మాఫియాపై కదంతొక్కిన తమ్ముళ్లు
- పలు జిల్లాల్లో నేతల ర్యాలీలు.. అడుగడుగునా నిర్బంధాలు
- కార్మికులనూ అనుమతించలేదు.. బుద్దా సహా పలువురు అరెస్టు


కర్నూలులో టీడీపీ నాయకుల ట్రాక్టర్ల ర్యాలీ

# ఐతే.. ఇచ్చేద్దాం

## బిల్లుల చెల్లింపులో ఇష్టారాజ్యం!

- ప్రాధాన్య కేటగిరీలో 'మంత్రాంగం'
- మంత్రి బంధువు, మరో మంత్రి స్నేహితుడి కంపెనీలకు చోటు
- రెండు డీడీవోలకు ప్రత్యేక ప్రాధాన్యం
- సీనియారిటీని కాదని చెల్లింపులు
- 'వెలిగొండ'లో 30సంస్థలకు గాను ఏడు కంపెనీలకే బిల్లులు క్లియర్




### సీఎం, మంత్రి ఇలాకాల్లోనే రోడ్లు!

జగన్, పెద్దిరెడ్డి, మంత్రి సోదరుడి నియోజకవర్గాలకు 412 కోట్ల పనులు

*డబ్బుల్లేవ్! ఆచితూచి నిధులు విడుదల చేయాలి!*

*అయితే... 'అస్మదీయులకు' మాత్రం చెల్లింపులు ఆగకూడదు! ఆర్థిక శాఖలో అదే జరుగుతోంది. 'వడ్డించేవాడు మనోడైతే' అన్నట్లుగా బిల్లుల చెల్లింపులో కొన్ని కంపెనీలకు కీలక ప్రాధాన్యం లభిస్తోంది.*

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నిధుల కొరత నేపథ్యంలో... ఖర్చులు, బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఆర్థిక శాఖ కొన్ని ప్రాధాన్యాలు నిర్ణయించుకుంది. ఇందులో వేతనాలు, పింఛన్లు, రీపేమెంట్లు, మరో ఏడు పద్దులను అత్యవసర చెల్లింపుల కింద చేర్చింది. మిగిలిన బిల్లులను తెలుపు, గ్రే, నలుపు రంగులుగా వర్గీకరించింది. తెలుపులో ఉన్నవి ప్రాధాన్య బిల్లులు. వీటికి చెల్లించగా డబ్బులు మిగిలితే 'గ్రే' కేటగిరీలో చెల్లింపులు జరుగుతాయి. ఇక... 'నలుపు' దాకా నిధులు వస్తే గొప్పే! తెలుపు కేటగిరీలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, సెంట్రల్ రోడ్ ఫండ్‌తోపాటు రెండు కంపెనీలు, రెండు డీడీవోలకు చోటిచ్చారు. ఈ రెండు కంపెనీల్లో ఒకటి చిత్తూరుకి చెందిన ఓ మంత్రి బంధువులదిగా, మరో కంపెనీ కర్నూలుకు చెందిన కీలక మంత్రి స్నేహితుడిదిగా

మిగతా 2వ పేజీలో...


సీఎం జగన్ నివాసం వద్ద మంత్రులు కొడాలి నాని, పేర్ని నానితో వంశీ

## నైపుణ్యాభివృద్ధిపై త్వరలో వర్సిటీ

- లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో కాలేజీల ఏర్పాటు
- విద్యార్థులకు ఏడాది శిక్షణ తర్వాతే పరీక్షల నిర్వహణ
- నెలలో కార్యాచరణ పూర్తి చేయాలి: సీఎం ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచం యావత్తూ రాష్ట్రంవైపు చూసేలా అత్యుత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయాలి. పరిశ్రమలకు అవసరమైన స్థాయిలో నైపుణ్యం కలిగిన 75శాతం స్థానిక మానవ వనరులను రూపొందించే అవకాశం దేవుడు మనకు ఇచ్చాడు' అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. పరిశ్రమల్లో స్థానికులకే 75శాతం

మిగతా 11వ పేజీలో...

## సీఎంతో వంశీ భేటీ

పార్టీ మారతారంటూ జోరుగా ప్రచారం

దీపావళి తర్వాత స్పష్టత: టీడీపీ ఎమ్మెల్యే

12

# సీఎస్ పవర్ కట్

## బిజినెస్ రూల్స్‌కు అర్ధరాత్రి సవరణలు

### జీవో జారీ చేసిన ప్రవీణ్ ప్రకాశ్

- సీఎం, నేను... మధ్యలో మరెవరూ లేరన్నట్లుగా ఉత్తర్వుల తీరు
- పైఅధికారులకూ షోకాజ్ ఇవ్వొచ్చు.. గవర్నర్ అధికారాలూ 'కబ్జా'
- ఆషామాషీగా బిజినెస్ రూల్స్‌లో మార్పులు
- నిబంధనలకు విరుద్ధమని విమర్శలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర అధికార యంత్రాంగం అంతటికీ బాస్... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి! ఏదైనా కారణంవల్ల ఐఏఎస్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలంటే... ఆయనే ఇవ్వాలి! కానీ... సీఎస్ అధికారాలను పక్కనపెడుతూ, ఇంకా చెప్పాలంటే, సీఎస్ స్థాయి అధికారులైన స్పెషల్ సీఎస్‌లకూ షోకాజ్ నోటీసులను ఇచ్చే అధికారాన్ని తనకు దఖలు పరుచుకుంటూ జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పేరిట

మిగతా 2వ పేజీలో...


ప్రవీణ్ ప్రకాశ్




## క్రమశిక్షణకు కట్టడి!

2

- వేకెన్సీ రిజర్వ్ మూడు నెలలే.. అంతకు మించొద్దన్న ప్రభుత్వం
- తక్షణం అమల్లోకి: డీజీపీ.. పోలీసులకు భారీ ఉపశమనం


విశాఖపట్నం జిల్లా దేవరాపల్లి సమీపాన కొట్టుకుపోయిన కాజ్‌వే

## రైతన్నకు వాన కష్టం

8

21వేల ఎకరాల్లో వరి మునక.. పత్తి, మొక్కజొన్నకూ నష్టం




## కేపీఐపీఎల్‌కు ఊరట!

కృష్ణపట్నం భూములపై వారంపాటు యథాతథ స్థితి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

8


ఇసుక లారీల యజమానులతో సమావేశమైన పవన్

# 151 సీట్లిచ్చిన ప్రజలే.. దెబ్బ కొడతారు!

- కొరతతో మేస్త్రీలూ పస్తులుంటున్నారు
- 35 లక్షల మంది కార్మికులు రోడ్డుపాలు
- ఇసుక లారీ యజమానులదీ అదే పరిస్థితి
- ఒత్తిడి తేవడానికే 3న విశాఖలో ధర్నా
- ఉన్న ఆరు వేల లారీలకే పని లేదు
- కొత్తగా మరో 6 వేల వాహనాలిస్తారా?
- ఎవరి లబ్ధి కోసం జీవో 486 తెచ్చారు?
- దీనిపై మోదీ, అమిత్ షాకు ఫిర్యాదు
- హైకోర్టు, రాజధానిపై స్పష్టత ఇవ్వాలి
- ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ డిమాండ్

### ఆ రోజు దగ్గర్లోనే ఉంది

ఇసుక మాఫియాకు వైసీపీ దన్ను: పవన్

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ క్రమేణా ప్రజల మద్దతు కోల్పోతోంది.. దాని అస్తవ్యస్త విధానాలపై ప్రజల నుంచి భారీ ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. 151 మంది ఎమ్మెల్యేలను ఇచ్చిన జనమే తిరిగి దెబ్బకొట్టే రోజు దగ్గర్లోనే ఉంది' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఏ ప్రభుత్వమైనా సవ్యంగా పరిపాలిస్తే మిగతా పార్టీలకు పని ఉండదని.. 100 రోజుల్లోనే ఇన్ని అవకతవకలకు పాల్పడితే రోడ్ల మీదకు వచ్చి తీరతామని హెచ్చరించారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఇసుక లారీల యజమానులు, మద్యం

మిగతా 8వ పేజీలో...



పరంజ్యోతి

# రామాయణం.. దీపావళి.. ఆధ్యాత్మిక విశిష్టత



ప్రతి క్షణమూ మన లోపల రామాయణం జరుగుతోంది. ఒక గొప్ప ఆధ్యాత్మిక విశిష్టతను, లోతైన సత్యాన్ని కలిగి ఉన్న అద్భుతమైన కావ్యం ఇది. భౌతిక శరీరం, మనసు కలగలసిన ఈ స్వరూపాన్నే మనం అయోధ్యగా అర్థం చేసుకోవచ్చు. దీనికి రాజు దశరథుడు. సీతాదేవి (మనసు) రాముని నుండి (ఆత్మ నుండి) వెళ్లినప్పుడు రావణుడు (అహంకారం) సీతను అపహరించాడు. అప్పుడు రాముడు (ఆత్మ), లక్ష్మణుడు(అవగాహన) కలసి హనుమంతుని (ప్రాణశక్తి) సహాయంతో సీతను మరలా ఆత్మ వద్దకు తీసుకువచ్చారు. స్వస్థలం చేరిన ఆ శుభదినం నాడు దీపాలను అలంకరించి దీపావళి పండుగను జరుపుకొంటారు. అలా ఈరోజు వెలిగించే ప్రతి దీపమూ మన లోపల వెలిగే జ్యోతిని సూచిస్తుంది.

దశరథుని ముగ్గురు భార్యల పేర్లు ఆసక్తికరంగా ఉంటాయి. మొదటి భార్య పేరు కౌసల్య అంటే నైపుణ్యం కలిగినది అని అర్థం. రెండవ భార్య పేరు సుమిత్ర.. అంటే మంచి స్నేహితురాలు, సరైన దిశలో నడిపించేది. మూడవ భార్య పేరు కైకేయి.. అంటే తనను తాను త్యాగం చేసుకొని, ప్రజలకు మంచిని కలిగించేది. కైకేయి పైకి భిన్నంగా కనిపించినప్పటికీ ఆమె లోపల దయాగుణం కలిగి ఉంటుంది. బయటి నుండి చూసినప్పుడు కైకేయి ప్రసన్నంగా కనిపించకపోవచ్చు. కానీ మనకేది మంచిదో అది మాత్రమే ఆమె చేస్తుంది. ఈ శరీరం దశరథ.. అంటే పది రథాలు. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాలు కళ్లు, చెవులు, ముక్కు, నాలుక, చర్మము. భౌతికమైన వస్తువులతో పనిచేసేందుకు ఉపయోగపడే కర్మేంద్రియాలు ఐదు. అవి చేతులు, కాళ్లు, గుదం, జననేంద్రియాలు, నోరు. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు కలసి బుద్ధిని పది దిక్కులకు లాక్కుపోతాయి. అందువల్లనే జీవితం అనేక దిశలలో వెడుతూ ఉంటుంది. 'రా' అంటే కాంతి. 'మ' అంటే నా లోపల అని అర్థం. రామ శబ్దం మనలోని కాంతిని సూచిస్తుంది.

రామ అంటే ఆత్మ. రామునికి ముగ్గురు తమ్ములు. లక్ష్మణుడు.. అప్రమత్తంగా మెలకువతో వుండే వాడు, శత్రుఘ్నుడు.. శత్రువులు లేని వాడు, భరతుడు.. తెలివితేటలు, సామర్థ్యం కలిగిన వాడు. కేవలం నూనె దీపాన్ని వెలిగించటం ద్వారానే మీరు దీపావళిని జరుపుకోవట్లేదు. ప్రతి ఒక్కరినీ సరైన మార్గంలో నడిపించే దీపంగా మీరు మారిపోవాలి. జ్ఞానం అనే జ్యోతి జీవితంలో వెలిగినపుడు అది మనల్ని ఒత్తిడి నుండి విముక్తులను చేస్తుంది. మనం ద్వేషం, అసూయ మొదలైన దుర్గుణాలు, భావాల నుండి స్వేచ్ఛను పొందుతాం. ఈ దీపావళికి మీరు జ్ఞానజ్యోతిని వెలిగించండి. పరమానందంతో ఉత్సాహంతో మీ ఆనందాన్ని పదిమందికి పంచండి. భేదాభిప్రాయాలను పక్కన పెట్టండి. ఇది సంతోషంగా ఉండాల్సిన సమయం. మిఠాయిలను అందరూ పంచుకోవాల్సిన సమయం. మీ అందరికీ శుభకరమైన దీపావళి శుభాకాంక్షలు. ఈ పండుగ మీ కోరికలన్నింటినీ నెరవేర్చాలని ఆశీస్సులు.

-శ్రీశ్రీ రవిశంకర్



వైఎస్ భారతితో చర్చిస్తున్న నమ్రత

## వైఎస్ భారతిని కలిసిన నమ్రత

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డితో సినీ హీరో మహేశ్ బాబు భార్య నమ్రత శిరోద్కర్ సమావేశమయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం భారతీరెడ్డిని ఆమె కలిశారు. ఈ సమావేశంలో హీరో మహేశ్ బాబు బుర్రిపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడంపై చర్చకు వచ్చిందని సమాచారం.

## బోటు ప్రమాద బాధితులకు రూ.1.20 కోట్లు

- సీఎంఆర్ఎఫ్ నుంచి 12 కుటుంబాలకు పరిహారం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై కచ్చులూరు వద్ద బోటు మునిగి మృతిచెందిన 12మంది బాధితుల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నుంచి పరిహారం చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణకు చెందిన 12మంది బాధితుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మొత్తం రూ.1.20కోట్లు విడుదల చేసింది. బోటు ప్రమాదంలో మరణించిన భాస్కి రాజేందర్, బాస్కి అవినాశ్, బాస్కి రాజేంద్రప్రసాద్, గోరె రాజేంద్రప్రసాద్, బాస్కి వెంకటయ్య, దోమల హేమంత్, భాస్కి ధర్మరాజు, కొమ్ముల రవి, కొండూరు రాజ్‌కుమార్, రేపాకుల విష్ణుకుమార్, గడ్డమీది సునీల్, ఎరాన్ సాయికుమార్‌ల కుటుంబీలకు పరిహారం చెక్కులు అందించనున్నారు. ఇందులో 9మంది వరంగల్ జిల్లా, ఖమ్మం, జనగాం, రంగారెడ్డి జిల్లాలకు చెందినవారు ఒక్కొక్కరున్నారు.

# క్రమశిక్షణకు కట్టడి!

- వేకన్సీ రిజర్వ్ మూడు నెలలే
- అంతకు మించొద్దన్న ప్రభుత్వం
- తక్షణం అమల్లోకి.. డీజీపీ



అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు సంబంధించి ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ఆ శాఖలో ఆనందం నింపింది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పోలీసులను వేకెన్సీ రిజర్వ్(వీఆర్)కు పంపించడం సాధారణ అంశం. అయితే, ఇలా పంపిన ఉద్యోగిని ఎప్పుడు పునర్నియమిస్తారనే అంశంపై ఇప్పటి వరకు స్పష్టతలేదు. వారాల నుంచి కొన్ని నెలల వరకు కూడా వీఆర్‌లో కొనసాగుతున్న వారున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వీరికి ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. ఏ స్థాయి అధికారికైనా వీఆర్ 3మాసాలకు మించరాదని ఆదేశించింది. ఈమేరకు డీజీపీ గౌతమ్ సవాంగ్ జిల్లాల ఎస్పీలకు వెంటనే ఆదేశాలు పంపారు.

### వీఆర్ విధం ఇదీ..!

కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు ఎవరైనా విధి నిర్వహణలో పొరపాటు చేస్తే జిల్లా ఎస్పీ వీఆర్‌కు పంపుతారు. అదే సీఐ స్థాయి అధికారిని డీఐజీ, డీఎస్పీని డీజీపీ వీఆర్‌కు పంపుతారు. ఎస్పీ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు వీఆర్‌కు ఆదేశించినవారిని ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయం లేదా జీఏడీకి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశిస్తుంది. వీఆర్‌లో వెయిటింగ్‌లో ఉన్నవారికి జీతం రాదు, అయినా ఎస్పీ, డీఐజీ, డీజీపీ కార్యాలయానికి రోజూ వచ్చి వెళ్లాల్సిందే. దీంతో వీఆర్ అంటే భారీ శిక్షగా భవిస్తారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వంలో పనిచేసిన పోలీసు అధికారులను వీఆర్‌కు పంపారు. అంతకుముందు ప్రభుత్వంలో పలువురిని ఏడాది, ఏడాదిన్నర పాటు వీఆర్‌లో ఉంచారు. ఇప్పుడు వాళ్లందరూ తమ పాతజీతాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించిన ఆర్థికశాఖ ఏడాది పైగా జీతాలు ఇవ్వకుండా ఇంతమందిని ఎందుకు ఖాళీగా ఉంచారని అడిగింది. దీంతో ఇకపై ఎవరినైనా మూడు నెలలకు మించి వీఆర్‌లో పెట్టొద్దని ప్రభుత్వం సూచించింది. రాష్ట్రంలో 5నెలల క్రితం ప్రభుత్వం మారడంతో వందల మంది పోలీసులను వీఆర్‌కు పంపారు. క్షేత్రస్థాయి పోలీసుల నుంచి, సబ్ డివిజనల్ అధికారులు, ఎస్పీ స్థాయి అధికారి కోయ ప్రవీణ్, డీఐజీ ర్యాంకులో ఉన్న ఘట్టమనేని శ్రీనివాస్, డీజీపీ ర్యాంకు అధికారి ఏబీ వేంకటేశ్వరరావు వరకూ పలువురు పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు.

## ఆర్థిక మోసాలను కట్టడి చేయండి

- పోలీసులకు సీఎస్ ఆదేశం

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆర్థిక సంస్థలు, చిట్ ఫండ్ కంపెనీల మోసాల కేసుల్లో శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని పోలీసుశాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. అమరావతిలోని ఏపీ సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక సేవలు, ఆకర్షణీయ పథకాల పేరిట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడేవారిపై సకాలంలో విచారణ జరిపి కోర్టుల్లో శిక్షలు పడేలా చూడాలన్నారు. ఆకర్షణీయ ప్రకటనలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న సంస్థలపై గట్టి నిఘా పెట్టాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శికి సూచించారు. రిజర్వ్ బ్యాంకు డైరెక్టర్ సుబ్రతా దాస్ మాట్లాడుతూ, ఆర్థిక సంస్థలు, చిట్ ఫండ్ కంపెనీల మోసాలను నివారించేందుకు రిజర్వ్ బ్యాంకుకు తోడ్పాటునందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రా బ్యాంకు డీజీఎం నాచారయ్య, అధికారులు పాల్గొన్నారు.




ఈ దున్నపోతు పేరు సర్ధార్. 1600 కిలోల బరువు, 15 అడుగుల పొడవుతో రాచఠీవిని ఒలకబోస్తున్న దీని విలువ రూ.27కోట్లు! హరియాణాకు చెందిన ఈ మహిషరాజాన్ని 29న జరిగే సదర్ వేడుకల కోసం హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు తీసుకొచ్చారు. - హైదరాబాద్, ఆంధ్రజ్యోతి



పాఠశాలలో ఉన్న విద్యార్థులు

## ● క్లాసుకొకరు... ముచ్చటగా ముగ్గురు!

నెంబర్ వన్.. మేకల రంగనాథ్... యస్ సార్.. టూ.. బండారి వీణ... యస్ సార్.. త్రీ.. బండారి నిర్మలా జ్యోతి... యస్ సార్... ఆ... అటెండెన్స్ అయిపోయింది. ఇక పుస్తకాలు తీయండి. అదేమిటీ అని ఆశ్చర్యపోకండి. ఆ స్కూల్‌లో అంతే. ఉన్నది ముగ్గురే విద్యార్థులు! అక్కడున్న టీచర్ ఆ ముగ్గురికే పాఠాలు చెబుతున్నారు. ఈ బడి కర్నూలు జిల్లా మద్దికెర మండలం కొత్తపల్లిలో ఉంది. ఇక్కడ మొత్తం ఐదు తరగతులున్నాయి. విద్యార్థులు మాత్రం ముగ్గురే. ఒక్కో క్లాసుకి ఒక్కొక్కరు అన్నమాట. గతంలో ఈ స్కూలు 30-40మంది పిల్లలతో కళకళలాడుతూ ఉండేది. ప్రైవేటు స్కూళ్ల తాకిడి ఎక్కువ కావడంతో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూ ఇలా ముగ్గురికి చేరిందన్నమాట. దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన విద్యాశాఖ మాత్రం ప్రతి 15రోజులకు ఒకసారి వంతులవారీగా డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుల్ని పంపి బడి నడిపేస్తోంది. - మద్దికెర

## జవాబు చెప్పలేదని... చెయ్యి విరగ్గొట్టాడు!

- ఎమ్మిగనూరు శ్రీచైతన్య స్కూల్లో ఘటన

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 25: ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేదని చేయి లాగి పారేయడంతో విద్యార్థి ముంజేయి విరిగింది. ఈ ఘటన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణం శ్రీచైతన్య స్కూల్‌లో చోటు చేసుకుంది. బాధిత విద్యార్థి తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయానికి చెందిన అబ్దుల్ కలాం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం అదే పాఠశాలలో పనిచేస్తున్న ఫిజిక్స్ ఉపాధ్యాయుడు జమీర్ అతడ్ని ప్రశ్నలు అడిగాడు. సరిగ్గా సమాధానం చెప్పకపోవడంతో కోపోద్రిక్తుడైన టీచర్ విద్యార్థి చేయి పట్టుకుని లాగేయడంతో ముంజేయి విరిగిపోయింది. విద్యార్థి తండ్రి కరీం శుక్రవారం పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ పాఠశాలలో ఇలాంటి ఘటన జరగడం మూడోసారని, స్కూల్‌ను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



అబ్దుల్ కలాం

# ఐతే.. ఇచ్చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. వీటితో పాటు చిత్తూరు జిల్లాలోని పీఐయూ డివిజన్ డీడీవోను, మదనపల్లి ఆర్అండ్ బీ డీడీవో నుంచి వచ్చే బిల్లులను తెలుపులో ఉంచారు.

### డీడీవోలో చెల్లింపులా?

సాధారణంగా బిల్లుల చెల్లింపులు పీడీ ఖాతాల్లో వేస్తారు. కానీ, ఇటీవల సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించిన రూ.33 కోట్ల బిల్లును విచిత్రంగా డీడీవో బ్యాంకు ఖాతాలో వేశారు. ఇలా చేయడంలో ఆంతర్యం ఏంటో ఆర్థిక శాఖకే తెలియాలి. సీనియారిటీ ప్రకారమే బిల్లులు చెల్లించేందుకు వీలుగా సీఎఫ్ఎంఎస్ రూపొందించారు. అయితే, ఇప్పుడు సీనియారిటీని పక్కనపెట్టి కొన్ని ఎంపిక చేసిన కంపెనీలకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 30 కంపెనీలు పనులు చేస్తే ఏడు కంపెనీలకే బిల్లులు ఇచ్చారు. అందులో కూడా సీనియారిటీ పాటించలేదు. అవంతిక పయనీర్ అనే కంపెనీ సీనియారిటీలో ఎక్కడో కిందిస్థానంలో ఉంది. కొన్ని వందల బిల్లులను పక్కకు జరిపి ఆఘమేఘాల మీద ఆ కంపెనీకి బిల్లులు చెల్లిస్తున్నారు. ఎస్‌డీఎఫ్, నీరు - చెట్టు, పురపాలక శాఖలోని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బిల్లులు రద్దు చేశారు. ఎక్స్‌గ్రేషియా, జెపీఎఫ్, జీపీఎఫ్ లాంటి అత్యవసర చెల్లింపులు పక్కనపెట్టి కొంత మంది ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. వర్కు బిల్లులకు సంబంధించి, కొంతమంది వెండర్లకే బిల్లులు తయారుచేసి సమర్పించే అవకాశాన్ని కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన చోట్ల వర్కు బిల్లులు సమర్పించే అవకాశం కూడా లేదు.

## సీఎస్ కారుకూ పెట్రోల్ నో..

ఐఏఎస్ అధికారుల కార్లకు పెట్రోల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు 10 నెలల నుంచి ఈ బిల్లులు పెండింగ్‌లోనే ఉండడంతో ఐఏఎస్‌లకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కారుకే పెట్రోల్ పోసేది లేదంటూ పెట్రోల్ బంక్ సిబ్బంది వెనక్కి పంపారు. దీంతో ఆ రోజు సాయంత్రానికి రూ.10 లక్షల బిల్లు చెల్లించారు. ఆ తర్వాత కొద్ది రోజులకి మరి కొందరు ఐఏఎస్‌లకు ఇదే పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం రూ.40,000 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గడచిన నెల కాలంలో రెండు విడతలుగా రూ.21,000 కోట్ల బిల్లులు వెనక్కి పంపారు. వీరంతా తిరిగి బిల్లులు సమర్పించుకోవాల్సి ఉంటుంది. వీటితో కలిపితే పెండింగ్ బిల్లులు మొత్తం రూ.61,000 కోట్ల వరకు ఉన్నాయి.

### పెండింగ్‌లో పాలు.. లిక్కర్‌కు బిల్లు

పాల బిల్లులు, నీటి సరఫరా బిల్లులు, కరెంటు బిల్లులను పక్కన పెట్టి మరీ మూడు నెలలుగా లిక్కర్ కంపెనీలకు బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. లిక్కర్ కంపెనీలకు జూలైలో రూ.590 కోట్లు, ఆగస్టులో 775 కోట్లు, సెప్టెంబరులో 390 కోట్లు చెల్లింపులు చేశారు. ఐసీడీఎస్ కింద అంగన్వాడీలకు సరఫరా చేస్తున్న పాల బిల్లులు కూడా చాలానెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి.

### ఈ ఏడే ఎమర్జెన్సీ

మధ్యాహ్న భోజన పథకం, రైతు భరోసా, విద్యార్థుల మెయింటెనెన్స్-ట్యూషన్ ఫీ, సంక్షేమ పెన్షన్లు, వలంటీర్లకు చెల్లింపులు, తాగునీటి చెల్లింపులు, నవరత్నాల్లోని వివిధ పథకాల్లో ఒకేసారి మాత్రమే చేసే చెల్లింపులు.

## సీఎం, మంత్రి ఇలాకాల్లోనే రోడ్లు!

- జగన్, పెద్దిరెడ్డి, మంత్రి సోదరుడి నియోజకవర్గాలకు 412 కోట్ల పనులు

రూ.412.51 కోట్ల విలువైన బీటీ రోడ్ల పనులను ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నియోజకవర్గాలకే ఆ శాఖ కేటాయించింది. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గం పులివెందుల, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గం పుంగనూరు, ఆయన సోదరుడు ద్వారకానాథ్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఏపీఆర్ఆర్‌పీ, ఈఏపీ/ఏఐబీ నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు. ఈ నిధుల్లోంచి పులివెందుల నియోజకవర్గానికి రూ.214.31 కోట్లు కేటాయించారు. ఇక్కడ 73 కొత్త రోడ్లను వేస్తారు. 29 రోడ్లను పునర్నిర్మాణం చేస్తారు. పుంగనూరు నియోజకవర్గంలో రూ.99.96 కోట్ల విలువైన 137 కొత్త రోడ్లు, తంబళ్లపల్లి నియోజవర్గంలో రూ.98.24 కోట్ల విలువైన 105 రోడ్ల పనులకు మంజూరు చేశారు.

# సీఎస్ 'పవర్ కట్'

(మొదటి పేజీ తరువాయి)

ఓ జీవో వెలువడింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్న ఆయన... "సీఎం, ఆ తర్వాత నేను! మధ్యలో ఇంకెవరూ లేరు' అన్నట్లుగా చీఫ్ సెక్రటరీ ఉనికినే ప్రశ్నార్థకం చేసే ఉత్తర్వులు వెలువరించారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బయటికొచ్చిన ఈ జీవో 128 ఇప్పుడు అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఎం సూచనల మేరకు తన పైఅధికారులకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేసే అధికారాన్ని కల్పించుకుంటూ ఆంధ్రప్రదేశ్ బిజినెస్ రూల్స్‌కు సవరణలు చేశారు. ఈ సవరణలు నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని... రాజ్యాంగాన్ని, మంత్రి వర్గాన్ని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, చివరికి గవర్నర్‌ను సైతం ఏకకాలంలో పక్కన పెట్టేలా జీవో ఉందనే విమర్శలు అధికార వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. ప్రభుత్వ బిజినెస్ రూల్స్ ఆషామాషీగా తయారుకావు. రాజ్యాంగంలోని 166వ అధికరణం కింద కేంద్రానికి, అన్ని రాష్ట్రాలకు విడివిడిగా బిజినెస్ రూల్స్ తయారవుతాయి. ఈ బిజినెస్ రూల్స్‌ను నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించి కేబినెట్ ఆమోదం తర్వాత గవర్నర్‌కు పంపించాలి. గవర్నర్ ఆమోదించిన తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ జీవో ఇస్తారు. బిజినెస్ రూల్స్‌కు సవరణలు చేయాలన్నా కేబినెట్ ద్వారా గవర్నర్‌కు వెళ్లాలి. చీఫ్ సెక్రటరీ మాత్రమే ఈ మేరకు జీవో ఇవ్వాల్సి ఉంటుందని సర్వీస్ వ్యవహారాల నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 166 (3) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు సజావుగా సాగడానికి గవర్నర్ బిజినెస్ రూల్స్‌ను నిర్దేశించాల్సి ఉంటుంది. అందువల్ల సవరణలు కూడా ఆయన ద్వారానే జరగాలి. 2018లో బిజినెస్ రూల్స్‌ను సవరించినప్పుడు ఈ నియమాలను పాటించారు. అప్పటి చీఫ్ సెక్రటరీ అనీల్ చంద్రపునేఠా పేరిట జీవో జారీ అయింది. కానీ... తాజాగా జారీ అయిన జీవో చీఫ్ సెక్రటరీ వద్దకు వెళ్లిన దాఖలాలు లేవు.

### అనుకున్నదే తడవుగా...

సీఎం ఆదేశించినా జీవోలు జారీ కాకపోవడంపై సీఎం ముఖ్యకార్యదర్శి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్ గురువారం కొందరు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎందుకు ఆలస్యమవుతోందని వారిని నిలదీశారు. అయితే... ఎక్కువ జీవోలు ఆర్థిక శాఖ క్లియరెన్స్ కోసమే ఆగిపోయాయని అధికారులు చెప్పిన వివరణ ఆయనకు సంతృప్తిని కలిగించలేదు. దీంతో అప్పటికప్పుడు సిబ్బందిని పిలిపించుకుని అర్ధరాత్రి సమయంలో బిజినెస్ రూల్స్ సవరించేశారు. క్లాజ్ 20 కింద ఈ సవరణ చేసినట్లు ప్రవీణ్ ప్రకాశ్ చెబుతున్నప్పటికీ... ఆ అన్వయం పూర్తిగా తప్పని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "బిజినెస్ రూల్స్‌కు ఏదైనా అనుబంధ వ్యాఖ్యాన్ని జోడించాల్సి వస్తే అది సీఎం ఆదేశాల మేరకు చేయవచ్చు" అని మాత్రమే ఆ క్లాజ్ చెబుతోంది. అంతేతప్ప నియమావళిని పూర్తిగా మార్చాలంటే... అది గవర్నర్ ద్వారానే జరగాల్సి ఉంటుందనేది నిపుణుల వాదన.

### సీఎస్ ఉనికినే ప్రశ్నించేలా...

బిజినెస్ రూల్స్‌కు చేసిన తాజా సవరణలు చీఫ్ సెక్రటరీ ఉనికినే ప్రశ్నించేలా ఉన్నాయని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఐఏఎస్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం వంటి క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం చీఫ్ సెక్రటరీకి మాత్రమే ఉంటుంది. ఇప్పుడు... ఒక ముఖ్యకార్యదర్శి స్థాయి అధికారి తనపై స్థాయిలో ఉండే ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి షోకాజ్ నోటీస్ ఇచ్చే అధికారాన్ని దఖలు పరుచుకోవడమేమిటన్న ప్రశ్న అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## ఇవీ సవరణలు...

'ఏపీ బిజినెస్ రూల్స్ 2018'లో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలు, హామీలపై ఉత్తర్వులు జారీ చేసేందుకు నిర్ణీత గడువును నిర్దేశించారు. దీని ప్రకారం ప్రకారం సీఎం తీసుకున్న నిర్ణయాలు, సర్క్యులేట్ అయిన ఫైల్ పై ఇమ్మీడియట్ అని ఉంటే 24 గంటల్లో, అర్జెంట్ అయితే 3 రోజుల్లో, ఆర్డినరీ అయితే 5 రోజుల్లో సంబంధిత కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు... ఇందులో కొన్ని సవరణలు చేశారు. అవేమిటంటే...

- సీఎం లేదా ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా స్పెషల్ చీఫ్ సెక్రటరీలు , ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీలకు వెళ్లే ఫైళ్లను 3 కేటాగిరీలుగా విభజించారు. 'అవుట్ టుడే' అని ఉంటే అదే రోజున ఉత్తర్వులు జారీ కావాలి. 'మోస్ట్ ఇమ్మీడియట్' అని ఉంటే 5 పనిదినాల్లో ఆదేశాలు రావాలి. 'ఇమ్మీడియట్' అయితే 15 రోజుల్లో పరిష్కరించాలి. నిర్దిష్ట వ్యవధి లోపల ఉత్తర్వులు జారీ కాకపోతే ముఖ్యమంత్రి ఆ ఫైల్‌ను వెనక్కి తెప్పించుకొని ఆలస్యానికి గల కారణాలను పరిశీలిస్తారు.
- ఏదైనా ఫైలు మీడియా దృష్టిని ఆకర్షిస్తుందని భావిస్తే... దానిని సీఎం దృష్టికి తీసుకురావొచ్చు. దీనిపై ఐదు పనిదినాల్లోపు సీఎం నుంచి ఎలాంటి స్పందన రాని పక్షంలో... దానిని ఆమోదించినట్లుగానే భావించి జీవో జారీ చేయవచ్చు.
- అవసరమైతే సంబంధిత స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి తగు చర్య తీసుకునేలా జీఏడీ పొలిటికల్ సెక్రటరీని (ప్రస్తుతం ప్రవీణ్ ప్రకాశ్) సీఎం ఆదేశించవచ్చు. జీఏడీ పొలిటికల్ సెక్రటరీ లేదా స్పెషల్ సీఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి... ఆ నిర్ణయంపై ఉత్తర్వులు జారీ చేసేలా సీఎం ఆదేశించవచ్చు.
- సీఎం ఇచ్చిన ఆదేశాలపై అధికారులు సరైన సమయంలో జీవోలు ఇవ్వడంలేదని... దీనివల్ల ప్రజా సంక్షేమానికి విఘాతం కలుగుతుందని, ఆ నిర్ణయం తీవ్రత కూడా తగ్గిపోతుందని ఈ జీవోలో పేర్కొన్నారు. అందుకే... ఏపీ బిజినెస్ రూల్స్ 2019 సెక్షన్ 4 లోని రూల్ 20 కింద ఈ సవరణలు చేస్తున్నట్లు ప్రవీణ్ ప్రకాశ్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## లోకం తీరు




## చలి కాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 22.1 | 30.6 |
| అనంతపురం | 22.0 | 31.4 |
| విజయనగరం | 23.0 | 30.0 |
| నెల్లూరు | 23.6 | 29.8 |
| ఒంగోలు | 23.6 | 31.0 |
| ఏలూరు | 24.0 | 30.0 |
| విశాఖపట్నం | 24.2 | 31.0 |
| శ్రీకాకుళం | 24.3 | 34.3 |
| గుంటూరు | 25.1 | 31.8 |
| విజయవాడ | 25.2 | 32.0 |



### మజ్లిస్ అంటే ఉద్యమం

మజ్లిస్ అంటే ఉద్యమం. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఇంత దూరం ప్రయాణించాం. ముంబై, యూపీతో పాటు మరిన్ని రాష్ట్రాల్లోనూ ఎదుగుతాం. మహారాష్ట్ర అసెంబ్లీ, బిహార్ ఉప ఎన్నికల్లో మజ్లిస్‌కు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

- అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ అధ్యక్షుడు



### మజ్లిస్ గెలుపుతో బిహార్‌కు ముప్పు

కిషన్‌గంజ్ అసెంబ్లీ స్థానంలో మజ్లిస్ గెలుపు బిహార్ సమగ్రతకు పెనుముప్పుగా మారనుంది. ఆ పార్టీ విజయంతో రాష్ట్రంలో సామాజిక సమతుల్యత దెబ్బతినేందుకు బీజాలు పడినట్లయింది. జిన్నా సిద్ధాంతాలు పుణికిపుచ్చుకున్న ఒవైసీ పార్టీ గెలుపు ఆందోళనకరం.

- కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్



## వృద్ధుల్లో అంధత్వానికి కారణం ఈ కణాలే!

న్యూయార్క్, అక్టోబరు 25: వృద్ధాప్యంలో చూపు తగ్గిపోవడానికి కారణమయ్యే కణాలను అమెరికా శాస్త్రవేత్తలు గుర్తించారు. గ్లియల్, కోన్, రెటీనా కింద ఉండే రక్తనాళాలు వృద్ధాప్యంలో చూపు మందగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. జన్యు శ్రేణి విశ్లేషణ ద్వారా ఈ విషయాన్ని కనుగొన్నారు. తాజా పరిశోధనలు అంధత్వానికి కొత్త మందును కనిపెట్టడానికి దోహదపడతాయని చెప్పారు. వృద్ధాప్యంలో సాధారణంగా రెటీనా దెబ్బతినడంవల్ల చూపు మందగిస్తుంది. దీనికి 36 రకాల జన్యువులు కారణమవుతాయ ని, వాటిని ఇంకా గుర్తించలేదని శాస్త్రవేత్తలు చెప్పారు.



## అన్ని ఫ్లూ వైరస్‌లకు ఒకే మందు!

వాషింగ్టన్, అక్టోబరు 25: అన్ని రకాల ఫ్లూ వైరస్‌లను నిరోధించేందుకు అమెరికా శాస్త్రవేత్తలు కొత్త యాంటీ బయాటిక్‌ను కనుగొన్నారు. దాని పేరు 1జీ01. 2017లో ఫ్లూ జ్వరంతో ఆస్పత్రిలో చేరిన ఒక రోగి శరీరంలో దీనిని గుర్తించారు. ఎలుకలపై పరిశోధనలు నిర్వహించగా ఈ యాంటీ బయాటిక్ మనుషుల్లో సోకే ఫ్లూ వైరస్‌లు సహా 12 రకాల వైరస్‌లను నిరోధించింది. మొదట ఎలుకలకు ఫ్లూ వైరస్‌లు ఎక్కించి 3 రోజుల తర్వాత యాంటీ బయాటిక్ ఇవ్వగా అది సమర్థంగా పనిచేసింది. తాజా పరిశోధనల దృష్ట్యా భవిష్యత్తులో అన్ని రకాల ఫ్లూ వైరస్‌లకు ఒకే మందు తయారు చేస్తామని శాస్త్రవేత్తలు వెల్లడించారు.



# ఎవరెస్ట్ ఎత్తు తగ్గిందా..?

**తాజా ఎత్తును నిర్ధారించే పనిలో నేపాల్ బృందం.. భూకంపం వలన తగ్గి ఉండొచ్చనే అనుమానాలు**

ఖాట్మండు, అక్టోబరు 25: ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తయిన శిఖరం ఏదంటే తక్కున చెప్పే పేరు ఎవరెస్ట్. దీని ఎత్తు 29,029 అడుగులు (8848 మీటర్లు) అని 1950లోనే నిర్ధారించారు. అయితే ఎవరెస్ట్ ఎత్తు ఇప్పటికీ అలాగే ఉందా..? ఈ ఏడు దశాబ్దాల కాలంలో దాని ఎత్తులో మార్పులేమైనా చోటు చేసుకున్నాయా..? అంటే కొందరు శాస్త్రవేత్తలు అవుననే అంటున్నారు. 2015లో నేపాల్‌లో సంభవించిన శక్తిమంతమైన భూకంపం ధాటికి ఎవరెస్ట్ శిఖరం ఎత్తు కొద్దిగా తగ్గి ఉంటుందని చెబుతున్నారు. అయితే.. ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చేలా నేపాల్ ప్రభుత్వం తాజాగా ఎవరెస్ట్ ఎత్తును కొలిచేందుకు ఒక బృందాన్ని పంపింది. ఈ బృందం సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేసి ఎవరెస్టు శిఖరం ఎత్తును నిర్ధారించనుంది. ఈ ప్రక్రియ కోసం 13 లక్షల డాలర్లు కేటాయించినట్టు తెలిసింది. దీనిపై కొలరాడో యూనివర్సిటీ భూవిజ్ఞాన శాస్త్రవేత్త రోజర్ బిలామ్ స్పందిస్తూ.. 'ఎవరెస్టు పర్వతం దక్షిణ పార్శ్వం నేపాల్‌కు చెందినదే అయినా చాలా ఏళ్ల నుంచి విదేశీ నిపుణులే దాని ఎత్తును కొలుస్తున్నారు. అయితే ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టు అత్యంత కచ్చితమైన కొలతను అందించవచ్చు. అది బహుశా వచ్చే ఏడాది ఆరంభంలో వెల్లడి కావచ్చు' అని అన్నారు. నేపాల్‌కు చెందిన చీఫ్ సర్వే ఆఫీసర్ సుశీల్ దంగోల్ ఎవరెస్ట్ ఎత్తును నిర్ధారించే వ్యవహారాలు చూసుకుంటున్నారు. 80 మంది సభ్యులతో కూడిన టీమ్ విస్తృతంగా పరిశోధించి ఎవరెస్టు ఎత్తును నిర్ధారించే పనిలోఉంది.

## ఎవరెస్ట్ వ్యర్థాలతో ఉపాధి

ఖాట్మండు, అక్టోబరు 25: 'వ్యర్థాలను వృథా చేయాల్సిన అవసరం లేదు' ఈ సూత్రాన్ని ఖాట్మండు వాసులు బాగా వంటబట్టించుకున్నారు. అందుకే వ్యర్థాలను వదిలేయకుండా వాటితో అనేక ఉత్పత్తులు తయారు చేసి వాడుకుంటున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు వివిధ దేశాల నుంచి అనేకమంది బృందాలు నేపాల్ రాజధాని ఖాట్మండుకు వస్తుంటాయి. ఈ క్రమంలో వారు వదిలేసి వెళ్లే ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాన్లు, కవర్లు, క్లైంబింగ్ గేర్లు, ఇతర వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా టన్నులకొద్దీ చెత్త పేరుకపోతోంది. దీంతో పర్యావరణానికి కూడా ప్రమాదమే. అందుకే వాటిని రీసైకిల్ చేసి పనికొచ్చే వస్తువులను తయారు చేస్తూ స్థానికులు ఉపాధి పొందుతున్నారు. 'వ్యర్థాలను వృథా చేయాల్సిన అవసరం లేదు. వాటిలో చాలా వస్తువుల్ని రీసైకిల్ చేయవచ్చు. తిరిగి వాడుకలోకి తీసుకురావచ్చు' అని స్థానిక రీసైక్లింగ్ సంస్థ బ్లూ వేస్ట్ టు వాల్యూ అధినేత నబిన్ బికాశ్ మహారాజన్ తెలిపారు. ఎవరెస్ట్ ప్రాంతంలో భారీగా చెత్త పేరుకుపోయి పర్యావరణానికి పెనుముప్పుగా పరిగణిస్తుందనే విమర్శలు ఎక్కువైన నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వంతోపాటు పర్వతారోహణ బృందాలు ఆరు వారాలపాటు శ్రమించి ఆ ప్రాంతాన్ని క్లీన్ చేశాయి. కొన్ని సంస్థలు ఇక్కడ సేకరించిన వ్యర్థాలను రీసైకిల్ చేసి అనేక రకాల వస్తువులుగా రూపొందించారు. ఆ ఉత్పత్తులు ఖాట్మండు పరిసరప్రాంతాల హోటళ్లు, రెస్టారెంట్లు, ఇళ్లల్లో విరివిగా వినియోగిస్తున్నారు.

### అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం

▸▸ **ఏపీ ఎడ్యుకేషన్ సెల్ చైర్మన్‌గా డా.శ్రీరాములు**

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ విద్యా విభాగం చైర్మన్‌గా డాక్టర్ పి.శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డేవిడ్ రాజ్ బెంగళూరులో శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. బెంగళూరులోని గీతం యూనివర్సిటీలో డాక్టర్ పి.శ్రీరాములు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి పంచాయతీ తోటనపల్లి. తనను గుర్తించి కీలక పదవిలో నియమించడం ద్వారా ప్రజలకు ప్రత్యేకించి విద్యార్థులకు సేవచేసే అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని శ్రీరాములు పేర్కొన్నారు.

### హాస్టల్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నార్పల, అక్టోబరు25 : మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎందుకు ఇన్నేళ్లుగా ఇంటిగ్రేడ్ హాస్టల్‌ను ప్రారంభించలేదని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని అడిగారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పూర్తిగా నిర్మించి మూడేళ్లవుతున్నా వృథాగా ఉండిపోయిందన్నారు. ఈ హాస్టల్‌కు సరైన దారి లేక దుమ్మూధూళితో పిచ్చిమొక్కలతో నిండిపోయిందన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వెంటనే కళాశాలకు కావాల్సిన రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే కూతలేరు బ్రిడ్జిని కూడా త్వరలోనే నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ దివాకర్ వైసీపీ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, పల్లె జయరామిరెడ్డి, మిద్దె కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రికి వెళ్లివస్తూ..
## తిరిగిరాని లోకాలకు

▸▸ **ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొన్న కారు**

▸▸ **ఐదుగురు దుర్మరణం, ఒకరికి తీవ్రగాయాలు**

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా అమృతూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో హొసకెరె వద్ద గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగిఉన్న ట్రాక్టర్‌ను వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొనడంతో కారులోని ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జుకాగా మృతదేహాలు ఇరుక్కుపోయాయి. ఎక్స్‌కవేటర్ల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మృతులను మృతులను కల్లహళ్లికి చెందిన కిరణ్ (24), మధు (24), మోహన్ (22), రాజణ్ణ (50), రంగస్వామి (50)లుగా గుర్తించారు. ఈ ఘటనలో వెంకటేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అనారోగ్యంతో బాధపడుతున్న రంగస్వామిని ఆదిచుంచనగిరి ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అమృతూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రమిదలపై ఉట్టిపడుతున్న కళాత్మకత



(అబ్దుల్ రజాక్, బెంగళూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

**కళలకు** కావేవీ అనర్హం అని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో సెలవిచ్చారు. ఈ స్ఫూర్తిని పుణికి పుచ్చుకున్న కళాకారులు బెంగళూరులో దీపావళి ప్రమిదలకు సరికొత్త రూపం ఇచ్చారు. ఉత్తరాది శైలిని కలబోసి ప్రమిదలను సైతం కళాఖండాలుగా మార్చేశారు. కళాత్మకత ఉట్టిపడే ఇలాంటి ప్రమిదలకు అనూహ్య ఆదరణ లభిస్తోంది. ధర కాస్త అధికంగా ఉన్నా చక్కటి డిజైన్లు, రంగులతో కూడిన ఇలాంటి ప్రమిదలకోసం జనం ఎగబడుతున్నారు. బెంగళూరులోని అనేక ప్రాంతాల్లో కళాత్మకత ఉట్టిపడే ప్రమిదలు హాటు కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రాజస్థాన్, గుజరాత్ సంప్రదాయ ప్రమిదలకు నగరానికి చెందిన కళాకారులే తుదిమెరుగులు దిద్దుతున్నారు. రంగురంగుల ప్రమిదల తయారీతో కళాకారులు చేతినిండా ఉపాధి పొందుతున్నారు. పర్యావరణ సంరక్షణ కోసం పాటుపడుతున్న నగరంలోని అనేక స్వచ్ఛంద సంస్థలు బాణాసంచా బదులు ఇలాంటి అందమైన రంగురంగుల ప్రమిదలతో ఇంటి ప్రాంగణాలను అలంకరించుకోవాలని పిలుపునివ్వడంతో దాని ప్రభావం కూడా బాగానే కనిపిస్తోంది. కాలుష్యం వెదజల్లే బాణాసంచాకు ఇక పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టేశామని, అందమైన రంగులరంగుల ప్రమిదలతోనే దీపావళి సంబరాలు జరుపుకుంటామని పలువురు పేర్కొంటుండటం విశేషం.

# నీళ్లున్నా... కన్నీళ్లే..!

**కడపకు అందని 'వరద' లాభం**

**శ్రీశైలంలో 1505 టీఎంసీల నీరు**

**అయినా నిండని జలాశయాలు**

**84.18టీఎంసీలదాకా సామర్థ్యం**

**నింపింది కేవలం 40 టీఎంసీలే**

**గండికోట ముంపు బాధితులకు**

**పరిహారమిస్తే కరువారా జలాలు**

**గాలేరు-నగరి విస్తరణ పనులు**

**సత్వరం చేపడితే సస్యశ్యామలం**


గండికోట ప్రాజెక్టు

కడప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం.. రాయలసీమ జిల్లాల జలజీవని. ఈ డ్యామ్ చరిత్రలోనే ప్రప్రథమంగా 90 రోజులకు పైగా ఫ్లడ్ డేస్ (వరద ప్రవాహ రోజులు) నమోదయ్యాయి. 1505.20 టీఎంసీల వరద చేరింది. కళ్ల ముందే అదంతా డ్యాం గేట్లు దాటి వెళ్లిపోతున్నా సీమ జలాశయాలను నింపుకోలేని పరిస్థితి! నీళ్ల కోసం దోసిలిపట్టి, కన్నీళ్లను వొడిచిపట్టుకొన్న దౌన్యం కడప జిల్లాది! ఈ జిల్లాలో గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులతోపాటు పెన్నానది పరిధిలో 14 రిజర్వాయర్లు ఉన్నాయి. 84.18 టీఎంసీల నీటిని నింపుకునే సామర్థ్యం వాటికి ఉంది. అయినా, ఈ వరద కాలంలో ఈ డ్యామ్‌లకు చేరింది కేవలం 39.97 టీఎంసీలే! కడప జిల్లా ప్రధాన జలాధారం గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టు, కేసీ కాలువ. వీటితో పాటు కుందూనది ఆధారంగా నిర్మించిన జలాశయాలున్నాయి. ఈ జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగు నీరివ్వాల్సి ఉండగా.. ఈ ఖరీఫ్‌లో కేవలం ఐదు లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేయగలిగారు. గాలేరు-నగరి ప్రాజెక్టు ఆధారంగా గండికోట, మైలవరం, వామికొండ సాగర్, సర్వరాయసాగర్, చిత్రావతి రిజర్వాయర్లున్నాయి. వీటి పూర్తి సామర్థ్యం 41.08 టీఎంసీలు. నీళ్లున్నా, వీటిలో కేవలం 24.52 టీఎంసీలు మాత్రమే నింపగలిగారు. 39.49 టీఎంసీలు నింపుకునే అవకాశం ఉన్నా.. వివిధ కారణాల వల్ల జలాశయాలు సగంతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, బ్రహ్మంసాగర్ (బీపీవీఆర్ రిజర్వాయర్స్) జలాశయాలున్నాయి. వీటి పూర్తి సామర్థ్యం 22.3 టీఎంసీలు. కాగా 7.85 టీఎంసీలు మాత్రమే నింపారు. 14.45 టీఎంసీలు నష్టపోవాల్సి వచ్చింది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ శ్రీశైలం జలాశయానికి 1505.20 టీఎంసీలు వరద చేరింది. గాలేరు, తెలుగుగంగ ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటిని నింపుకోవడానికి అవకాశాలున్నా వివిధ కారణాల వల్ల 47.94 టీఎంసీలు నింపుకోకుండా నష్టపోవాల్సి వచ్చింది.

### ఇలా చేస్తే...

గండికోట రిజర్వాయరు పూర్తి సామర్థ్యం 28.85 టీఎంసీలు. ఇప్పటివరకు 11.96 టీఎంసీలు మాత్రమే నింపగలిగారు. శ్రీశైలం జలాశయం ఎగువన గాలేరు-నగరి ఫ్లడ్‌ఫ్లో కెనాల్ నుంచి పూర్తి స్థాయిలో నీటిని తీసుకుని గండికోటను నింపేందుకు అవకాశమున్నా, అవసరమైన మేరకు నీళ్లు తీసుకోలేపోతున్నారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యానికి చేరితే, మండల కేంద్రం కొండాపురంతో పాటు 23 గ్రామాలు ముంపునకు గురవుతాయి. దీంతో 11.25 టీఎంసీలకు మించి నింపలేకపోతున్నారు. ముంపు గ్రామాల్లో బాధితులకు పరిహారం చెల్లించి ఆ గ్రామాలను ఖాళీ చేస్తే లక్ష్యం మేరకు నీటిని నింపుకోవడానికి అవకాశం ఉంది. ఇందుకోసం దాదాపు రూ.1,200 కోట్లు నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ముంపు గ్రామాలను ఖాళీ చేయిస్తే గండికోట జలాశయంతోపాటు అనుబంధంగా ఉన్న చిత్రావతి, వామికొండ, మైలవరం, సర్వరాయసాగర్ జలాశయాలను పూర్తి స్థాయిలో నింపేందుకు అవకాశం ఉంది. 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుకోవచ్చు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరుతో పాటు గాలేరు-నగరి ఫ్లడ్ కెనాల్ 30 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరణ, పది వేల క్యూసెక్కులతో అదనపు అవుకు టన్నెల్ నిర్మాణం పనులు తక్షణం చేపట్టాలన్న సీఎం ఆదేశాలను అమలు చేయాలని కూడా కోరుతున్నారు. సీఎం ఆదేశాలకుతోటు, రైతులు, సాగునీటి నిపుణుల సూచనలను పాటిస్తే కరువు తీరా కడపకు నీరు అందుతుంది. దానికోసం రూ.250 కోట్లతో తెలుగుగంగ మెయిన్ కెనాల్ సీసీ లైనింగ్ చేపట్టాలి. వీటితో పాటు కడపకు కీలకమైన కుందూ నదిపై 2.95 టీఎంసీలతో రాజోలి రిజర్వాయరు, 0.8 టీఎంసీలతో జొళదరాశి రిజర్వాయరు చేపట్టాలి. గాలేరు-నగరికి శ్రీశైలం జలాశయం 797 అడుగుల్లో కూడా కృష్ణాజలాలు మళ్లించేందుకు నూతనంగా చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ స్కీం పనులకు దాదాపు రూ.11,470 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. సీమ ప్రాజెక్టులకు ఇటీవల రూ.33 వేల కోట్లతో సాగునీటి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అందులో భాగంగానే కడప జిల్లాకు సాగు జలాలందించే ప్రాజెక్టుల పనులు కూడా ఉన్నాయి.


మైలవరం జలాశయం


తెలుగుగంగ ప్రాజెక్టు

# మహారాష్ట్రపై 'క్యార్' పంజా

**అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం**

**సింధుదుర్గ్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ**

**గోవాలో రోడ్లు ధ్వంసం.. రాకపోకలు బంద్**

ముంబై/పనజి, అక్టోబరు 25: క్యార్ తుఫాను మహారాష్ట్రపై విరుచుకుపడనుంది. రానున్న 12గంటల్లో ఈ తుఫాను ప్రభావంతో తీరప్రాంతంలోని రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ శుక్రవారం హెచ్చరించింది. ఈ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ ముంబై కేంద్రం పేర్కొంది. అరేబియా సముద్రంలో కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం వేకువజామున క్యార్ తుఫానుగా బలపడిందని తెలిపింది. వచ్చే 12గంటల్లో ఇది తీవ్ర తుఫానుగాను, 24గంటల్లో అతి తీవ్ర తుఫాను గాను మారుతుందని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం గంటకు 85-110కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. తీవ్ర తుఫానుగా బలపడిన తర్వాత ఇది ఒమన్ తీరంవైపుగా పయనించనుంది. భారీవర్షాల నేపథ్యంలో సింధుదుర్గ్ జిల్లాకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. క్యార్ ప్రభావంతో గోవాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు ప్రాంతాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. మాండవి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోండటంతో పనజి సమీపంలోని దీవుల నుంచి ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. పర్యాటకులు బయటకు రావొద్దని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది.

### ఒడిసాలో ముగ్గురి దుర్మరణం

భువనేశ్వర్: బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఒడిసాలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలకు ఎనిమిది జిల్లాల్లో 100మి.మీ. కంటే అధికంగా వర్షం పడగా, భువనేశ్వర్‌లో అత్యధికంగా 253మి.మీ. వర్షపాతం నమోదైంది. మూడు జిల్లాల్లో గోడ కూలిన ఘటనల్లో ముగ్గురు దుర్మరణం చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో 11 జిల్లాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు.

# బోరులో పసి ప్రాణం


బాలుడిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


బోరుబావిలో కనిపిస్తున్న బాలుడి చేతులు, తల

▸▸ **26 అడుగుల బావిలో పడిన రెండేళ్ల బాలుడు**

▸▸ **రక్షించే ప్రయత్నంలో ప్రభుత్వ యంత్రాంగం**

▸▸ **తిరుచ్చి సమీపంలో ఘటన**

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని రెండేళ్ల బాలుడు బోరుబావి పడిపోయాడు. తిరుచ్చి సమీప మనప్పారై పరిధిలోని నడుకాట్టుపట్టి గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. ఆరోగ్యరాజ్, కళారాణి దంపతుల కుమారుడు సుజిత్‌విన్సెంట్ ఇంటి ముందు ఆడుకుంటూ.. సమీపంలో తాగునీటి కోసం తవ్వి మూసివేయని బోరుబావిలో సాయంత్రం 5.15 గంటల సమయంలో జారిపడ్డాడు. ఉన్నట్టుంటి సుజిత్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెదుకుతుండగా బావిలో నుంచి అతడి ఏడుపు శబ్దం వినిపించింది. 26 అడుగుల లోతు కలిగిన బావిలో పడిన ఆ బాలుడు పడిపోవడంతో వారు హతాశులయ్యారు. బాలుడు చేతులు మాత్రం పైకి కనిపిస్తున్నాయి. దీంతో బోరున రోదిస్తూ స్థానికులకు తెలపడంతో.. వారు పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. వారు వచ్చి.. జేసీబీ యంత్రంతో బావి పక్కనే మరో పెద్ద గోతిని తవ్వి అతడిని వెలికితీసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మదురై ప్రభుత్వ చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యుడు సోమశేఖర్ బాలుడికి అవసరమైన ఆక్సిజన్‌ను బావిలోకి పంపిస్తున్నారు. కలెక్టర్ శివరాసు అందించిన సమాచారంతో రాష్ట్ర మంత్రులు డాక్టర్ విజయభాస్కర్, వెల్లమండి నటరాజన్ సంఘటన స్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాలుడిని క్షేమంగా వెలికితీస్తామని మంత్రులు భరోసా ఇచ్చారు. మరోవైపు బోరుబావిలో పడిన చిన్నారులను కాపాడేందుకు తాను ప్రత్యేకంగా రూపొందించిన పరికరంతో మదురైకి చెందిన మణికంఠన్, అదే విధంగా నామక్కల్ సేలం ప్రాంతాలకు చెందిన అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి వచ్చారు. తమవంతుగా ఆ బాలుడిని వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ప్రవాస కథనాలు కావాలి

పారులను గుర్తించి, 'ఇతరులను' వేరుచేసే కార్యక్రమం ఇప్పుడో రేపో దేశమంతటా మొదలయ్యేట్టే ఉన్నది. దాని మంచిచెడ్డల చర్చ జరగవలసిందే, ఆ చర్చ కూడా ఏమంత ప్రశాంతంగా, కలవరాలూ కల్లోలాలూ లేకుండా జరిగేది కాదు. ఒక అమాయకపు ప్రశ్న మాత్రం ముందు వేసుకోవలసిందే, మన దేశంలో ఏమి బావుకుందామని ఎవరైనా తరలి వస్తారు, ఇక్కడ ఏ సంపద, ఏ సౌభాగ్యం సులువుగా అందుబాటులో ఉన్నాయని ఎవరైనా వస్తారు? అమెరికా అంటే, అది ఒక అవకాశాల గమ్యం. ఆ దేశమే వలసదారుల దేశం. ప్రపంచపు కరెన్సీలన్నిటి విలువనూ నిర్ధారించగలిగే డబ్బు దానిది. అక్కడ సంపాదించేది స్వదేశంలో పదింతలో వందింతలో వేయింతలో... అందుకని ఆ దేశానికి ఎగబడతారు. నిజానికి లక్షల డాలర్లు సంపాదించుకునే అవకాశాలను అమెరికాయే ఏరి కోరి ఎంచుకున్న దేశాల వారికి కల్పిస్తోంది. ఇప్పుడాదేశంలో గోడలు కంచెలు కడుతున్నది, ఇళ్లలో పనిచేయడానికి, తోటపనులు, నిర్మాణపు పనులు చేయడానికి కూలిపనులు దొరుకుతాయేమోనని పొరుగుదేశం నుంచి తోసుకువచ్చే వారిని అడ్డుకోవడానికి. అమెరికా లాంటి దేశానికి మెక్సికో ఉంటే, మనకో బంగ్లాదేశో, బర్మాయో ఉండదా, అనుకుని, మనమూ పౌరుల లెక్కాజమా మొదలుపెడతామన్న మాట.

ఒకనాడు మనదేశం కోరుకోదగిన గమ్యమే. కొలంబస్ మనకోసం బయల్దేరి, అమెరికాను కనుక్కున్నాడు. వాస్కోడిగామా ఎందుకు అంతకష్టపడ్డాడు? మన దగ్గర బావుకోవడానికి చాలా ఉంది. దోచుకోవడానికీ ఉంది. బుడతకీచులు, డచ్చివారు, పరాసులు, ఇంగ్లీషులు– అందరూ ఈ దేశం మీద పడి తిన్నవారే. వాళ్లు వెళ్లాక కూడా, ప్రపంచపు రకరకాల కంపెనీలు మన దేశంలోని శ్రమనో, వనరులనో ఊడ్చేస్తూనే ఉన్నాయి. ఈ చరిత్ర అంతా చూసినప్పుడు మనకు కలిగే నిరుత్సాహం ఎక్కడంటే, అందరూ వచ్చి అప్పనంగా మన దేశంలో తిష్ఠ వేయడమే తప్ప, మనవాళ్లు దేశాలుపట్టి తిరగలేదెందుకు? ఎందుకు కొత్త నేలలు వెదకలేదు? ఓడలు వేసుకుని మహాసముద్రాలు ఎందుకు గాలించలేదు? దానికి మూలకారణాలు వెదికితే, కడుపు చించుకున్నట్టే అవుతుంది.

మొదటి విడత ప్రపంచీకరణ– ఐరోపా పారిశ్రామికీకరణకు ముందువెనుకల ప్రారంభమైందనుకుంటే, ఆ కాలంలో భారతదేశం తన గూట్లో తను ముడుచుకుని పడుకుందా? దేశంలో రాజకీయ మార్పులు పెద్దవి ఎన్ని జరుగుతున్నా, భారతీయ గ్రామం మాత్రం తన స్వయంసమృద్ధ చెరసాలలో అట్లా మగ్గిపోయిందని చరిత్రకారులు చెబుతారు. ఆఫ్రికా నుంచి మనుషులను ఎత్తుకుపోయినట్టు భారతీయులను ఎందుకు ఎత్తుకుపోలేదు? అప్పటికే ఇక్కడ రాజ్యాలూ వ్యవస్థలూ ఏర్పడి ఉండినందున కాబోలు. మరి బానిస వ్యాపారం రద్దు అయ్యాక, భారతీయులను కూడా మారిషస్‌కు, వెస్ట్ ఇండీస్‌కు, దక్షిణాఫ్రికాకూ.. బాగానే తరలించారు కదా? వెళ్లినవాళ్లు ఎట్లా వెళ్లారు?గ్రామీణ సాముదాయిక జీవనపు పట్టు నుంచి వారు ఎట్లా వెళ్ళారు? ఏ సంక్షోభం వారిని మహాసముద్రాలు దాటించింది?

ఎంతో ఆసక్తిని కలిగించే, చరిత్రలో ఖాళీలను పూరించే ప్రశ్నలు ఇవి. నవలా రచయిత అమితవ్ ఘోష్ భారతదేశపు అంతర్జాతీయతను, అందులో వలసలువెళ్లిన మనుషుల మూలాలను, ప్రేరణలను రాశారు, రాస్తున్నారు. బిహార్–బెంగాల్ నడుమ నేలల నుంచి 150 ఏళ్ల కిందట మారిషస్‌కు వలస వెళ్లడమేమిటి, ఇప్పుడాదేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష భోజ్‌పురీ కావడమేమిటి? తెలుగువారు మారిషస్‌లో, దక్షిణాఫ్రికాలో, ట్రినిడాడ్‌లో, మలేషియాలో ఎందుకున్నారు, ఎట్లా వెళ్లారు? బ్రిటిష్ వలసవాదం వారిని ఏ మూలనుంచి ఏ మూలకు విసిరేసింది? దురదృష్టవశాత్తూ, తెలుగు సాహిత్యంలో ఈ ప్రవాస కథనాలు పెద్దగా లేవు. అమెరికాకు వెళ్లి స్థిరపడినవారు ప్రవాససాహిత్యం రాస్తున్నారు కానీ, గల్ఫ్ దేశాలలో వలసకార్మికుల అక్కడి జీవితాలు మనకు తెలియదు. మరి వంద రెండువందలేళ్లకు ముందు వెళ్లిన తెలుగువారు ఎట్లా వెళ్లారో ఎందుకు వెళ్లారో, మనకు తెలియదు. అమితవ్ ఘోష్ లాగా తెలుగువారు కూడా పరిశోధనను, కాల్పనిక రచనను మేళవించగలగాలి.

'నవ్య' వారపత్రిక తాజా సంచిక (30 అక్టోబర్ 2019)లో సుప్రసిద్ధ చిత్రకారుడు 'బాలి' రాసిన కథ– "మాతృదేశం– ఆ మట్టి పరిమళం" చాలా కాలం కిందట సుదూర ప్రవాసులు కావలసి వచ్చిన తెలుగువారి ఉదంతాలను చెప్పింది. కథనం చేసిన ఉదంతాల కాలం రీత్యా, వాటిలోని విభిన్నత రీత్యా– కథకుడు వేర్వేరు పాత్రల ద్వారా, అది కూడా వారు విన్న కథనాలుగా చెప్పించారు. అమెరికాలో తారసపడిన పోర్చుగీస్ – భారత మిశ్రమ వ్యక్తి, ట్రినిడాడ్‌లో తెలుగు–మలయాళీ మిశ్రమ వ్యక్తి కథలోని పాత్రలకు వేరు వేరు స్థలాల్లో కాలాల్లో తారసపడతారు విన్నవారు కలుసుకున్నప్పుడు ఆ ఉదంతాలను పరస్పరం చెప్పుకుంటారు. పోర్చుగీస్ – భారత మిశ్రమ వ్యక్తి తల్లి తెలుగు వ్యక్తి. అప్పలనరుసు. ఆమెకు పోర్చుగీసు వ్యక్తితో ఇండియాలోనే పెళ్లి జరిగింది. తరువాత భర్తతో అమెరికా వెళ్లింది. తెలుగు–మలయాళీ మిశ్రమ వ్యక్తి తల్లి కూడా నర్సమ్మ. ఇద్దరూ ఉత్తరాంధ్రులే. ఇద్దరి వలసలూ బహుశా 19 వ శతాబ్దం చివరలో జరిగి ఉండాలి. ట్రినిడాడ్ స్త్రీ అయితే, ఇండెంచర్ లేబర్‌గానే వెళ్లింది. దక్షిణాఫ్రికా, మారిషస్‌లోని తెలుగువారిలో అధికులు కట్టుకూలీలుగానే వెళ్లారు. ప్రవాసులలో ఉత్తరాంధ్రులే ఎక్కువ. అట్లా వెళ్లినవాళ్లలో బ్రాహ్మలు కూడా ఉన్నారని బాలి కథ చెబుతుంది. ఇటువంటి కథలు మన చరిత్రను, సామాజిక చరిత్రను కూడా సంపన్నం చేస్తాయి. ఇక ప్రయత్నించి, ఆయా దేశాలకు అదే పని మీద వెళ్లి ఆ మహా యానాన్ని నవలల్లో చిత్రించ గలిగితే, తెలుగు సాహిత్యపు ఎల్లలు మరింత విశాలం అవుతాయి.

# నిర్మాణాత్మకంగా వివక్షా నిర్మూలన

■ రామచంద్ర గుహ



గతానుగతం

అడుగడుగునా అననుకూలతలను ఎదుర్కొంటున్న రెండు సామాజిక సమూహాలను భారత రాజ్యాంగం గుర్తించింది. అవి: షెడ్యూల్డు కులాలు (నిత్యవ్యవహారంలో దళితులుగా సుపరిచితులు); షెడ్యూల్డు తెగలు (ఆదివాసీలుగా పరిగణన పొందుతున్నవారు). భాష, కులం, మతం, జీవనాధారాల పరంగా ఈ రెండు సామాజిక వర్గాల లోనూ అపార వైవిధ్యమున్నది ఆంధ్రప్రదేశ్ లోని ఒక మాదిగ సామాజికుడికి, ఉత్తరప్రదేశ్ లోని ఒక జాతవ్ కులస్థుడికి మధ్య ఉమ్మడి అంశం ఏమీలేదు ప్రభుత్వోద్యోగానికి 'ఎస్‌సి' కోటా కింద దరఖాస్తు చేసుకోవడం మినహా. అలాగే, నీలగిరి కొండ ప్రాంతాల(తమిళనాడు)లోని ఒక ఇరులా కు, మహదేవ్ పర్వత ప్రాంతాల(మధ్యప్రదేశ్)లోని ఒక గోండ్ కు మధ్య, సర్కార్ కొలువుకు 'ఎస్‌టి' కోటా కింద దరఖాస్తు చేసుకోవడం మినహా, మరెలాంటి సంబంధం లేదు.

అయితే, కేరళ లేదా కర్ణాటక కానివ్వండి, పంజాబ్ లేదా బెంగాల్ కానివ్వండి దేశ వ్యాప్తంగా సమస్త దళితులూ ఒక అద్భుత బంధంతో సమైక్యమై ఉన్నారు. అదే, వారి జీవితాలకు వెలుగు బాటలు పరిచిన డాక్టర్ అంబేడ్కర్ మహోన్నత మార్గదర్శకత్వం. అద్వితీయ మేధోసంపత్తికి పేరు పొంది, అత్యున్నత పదవులను నిర్వహించిన ఆయన తన జీవితకాలంలో తన సొంత ఉపకులం అయిన మహర్లలో మాత్రమే పేరు పొందారు. మరణానంతరమే భారతీయ దళిత శ్రేణులకు ఆయన ఆదర్శ పురుషుడు, ఆరాధనీయుడు అయ్యారు. ఆదివాసీలకు అంబేడ్కర్‌తో పోల్చదగ్గ నాయకుడు ఒక్కరు కూడా లేరని చెప్పక తప్పదు. ప్రాంతీయ, భాషా పరమైన అంతరాలు, వ్యత్యాసాలకు అతీతుడై, సకల ఆదివాసీలకు మార్గదర్శకుడయిన నాయకుడు ఒక్కరూ లేరు!

దళితుల జీవితాలలో అంబేడ్కర్‌కు ఉన్న ప్రాధాన్యం, వారి ఆలోచనలకు అంబేడ్కర్ ఇస్తున్న మార్గదర్శకత్వం గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ఇది నన్ను ఎంతో ప్రభావితం చేస్తున్న అంశం. ఏక్‌నాథ్ అవాడ్ (1956 – 2013) ఆత్మకథను చదువుతున్నప్పుడు ఆ ప్రాధాన్య, ప్రభావాలు సరికొత్తగా నా ఆలోచనలను ఆవహించాయి. ఏక్‌నాథ్ అవాడ్ తన మాతృభాష మరాఠీలో రాసిన ఆత్మకథను జెర్రీ పింట్ అద్భుతంగా ఆంగ్లంలోకి అనువదించారు. అవాడ్ ఒక మాంగ్ దళితుడు. మహారాష్ట్రలోని మరఠ్వాడా ప్రాంతానికి చెందిన అవాడ్ తన బాల్యం నుంచీ అమిత విద్యాసక్తుడు. నవ యవ్వనంలోకి ప్రవేశించిన నాటికే ఆయన తన విద్యావ్యాసంగాలకు పేరు పొందారు. కనుకనే బంధుమిత్రులు యువ అవాడ్‌ను 'మహర్చా ఔలాద్' (మహర్ కుమారుడు) అని ప్రస్తావించేవారు. మహర్ కులస్థుడుగా జన్మించిన అద్వితీయ ధీమంతుడు అంబేడ్కర్ మాటలను గుర్తు చేసుకుంటే ఆ ప్రస్తావనలోని ఔచిత్యం అర్థమవుతుంది. 'పులి పాలు వంటిది విద్య. మీరు ఒక సారి ఆ పాలను తాగితే గర్జించకుండా ఉండలేరు' అని అంబేడ్కర్ వచించారు. ఇవి నిజంగా మరవరాని మాటలు.

ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే అంబేడ్కర్ రచనలను అవాడ్ చాలా శ్రద్ధగా చదివారు. సోషలిస్ట్ ఎంపి నాథ్ పేయి (ఇప్పుడు విస్మృతుడైన ఒక స్ఫూర్తిదాయక నేత) ప్రసంగాలను ఆకళింపు చేసుకునే వారు. 1970వ దశకంలో ఇంకా యవ్వన దశలో ఉన్నప్పుడే దళిత్ పాంథర్స్‌తోను, మరఠ్వాడా విశ్వవిద్యాలయానికి అంబేడ్కర్ పేరిట పునఃనామకరణం చేయాలనే డిమాండ్‌తో ప్రజ్వరిల్లిన ఉద్యమంతోనూ యువ అవాడ్ ప్రభావితుడయ్యారు. 'మరఠ్వాడా' ఉద్యమం గురించి ఆయన ఇలా రాశారు: 'మరఠ్వాడా విశ్వవిద్యాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టాలనే డిమాండ్‌ను సమర్థిస్తున్న వారు ఇవాళ ఒక మోర్చా నిర్వహిస్తే, మరుసటి రోజు ఆ డిమాండ్‌ను వ్యతిరేకించేవారు మరో మోర్చాను నిర్వహించేవారు. రోజుల తరబడి ఆ మోర్చాల పరంపర సాగిపోతుండేది. అంబేడ్కర్ పేరును మరఠ్వాడా వర్శిటీకి పెట్టాలన్న డిమాండ్ ను శివసేన తీవ్రంగా వ్యతిరేకించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, డాక్టర్లు, గ్రామీణ ప్రజలు ప్రతి ఒక్కరూ ఆ డిమాండ్‌కు సానుకూల లేదా వ్యతిరేక వైఖరి వహించారు'.

పునఃనామకరణ ఉద్యమకారులపై అగ్రకులాల వారు పాశవిక దాడులకు పాల్పడ్డారు. అవాడ్ ఇలా రాశారు: 'మహర్లు లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు ఒక పథకం ప్రకారం జరిగాయి. మరఠ్వాడా ప్రాంతంలోని 180 గ్రామాలలో ఈ హింసాకాండ చోటుచేసుకున్నది. పది రోజుల పాటు ఈ హింసాగ్నులు చెలరేగాయి. పద్దెనిమిది చోట్ల పోలీసు కాల్పులు జరిగాయి. వెయ్యికి పైగా దళిత గృహాలను దగ్ధం చేశారు'. కళాశాల విద్యార్థిగా ఉన్న అవాడ్‌పై ఈ ఘర్షణలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆలోచనామగ్నుడిని చేశాయి. ఆయనిలా రాశారు: 'దళితులపై హింసాకాండ ఉదంతాలు తెలుస్తున్న కొద్దీ నా మనస్సు అశాంతితో నిండిపోయింది. ఆగ్రహంతో రగిలిపోయింది. ఆ అమానుష ఘటనలకు వ్యతిరేకంగా ఉద్యమించాను. నా కార్యకలాపాలు గ్రామంలో పలువురికి కోప కారణమవడంతో మా అమ్మ చాలా కలవరపడింది'. పేదరికం, కుల వివక్షపై తన తొలి పోరాటాల గురించి అవాడ్ ఇలా మననం చేసుకున్నారు: అవమానాలు, అగౌరవాలను జీవిత పర్యంతం దిగమింగినా ఆనందప్రదమైన జీవితం లభించదు. జీవితపు దుస్తర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడడానికి ఒక మనిషి పూనుకున్నప్పుడు, అన్యాయానికి వ్యతిరేకంగా ఆయుధాలను చేపట్టినప్పుడు జీవితం మరో విధమైన ఆనందాన్ని ప్రసాదిస్తుంది. పోరాటమే ఆగ్రహావేశాలను ఉపశమింపచేస్తుందనేది నా అనుభవం. కనుకనే పోరాడటమనేది నాకు ఒక విధమైన అలవాటుగా పరిణమించింది'.

సోషల్ వర్క్‌లో ఎమ్.ఏ. పూర్తిచేసిన తరువాత ఆదర్శవాదులు, సోషలిస్టు భావజాల ప్రేరితులైన ఒక అగ్రకుల దంపతులతో కలిసి ఆదివాసీల (అప్పటికీ ఇప్పటికీ మన సమాజంలో అమానుష అన్యాయాలకు గురవుతున్న సామాజిక సమూహాలు) సంక్షేమ కృషిలో అవాడ్ పాల్గొన్నారు. సొంత అనుభవాల ఆధారంగా ఆదివాసీలు, దళితుల మధ్య ఒక తారతమ్యాన్ని ఆయన గుర్తించారు. ఆ వ్యత్యాసం గురించి అవాడ్ ఇలా రాశారు: 'ఏ సామాజిక ఉద్యమం లేదా విప్లవంలోనైనా ఆదివాసీలు మరొక సామాజిక సమూహానికి లేదా నాయకుడికి అనుయాయులుగా మాత్రమే చేరడం కద్దు. వారికి సొంత నాయకుడు అంటూ లేడు. ఇప్పటికీ ఆదివాసీలకు చాలా కొద్దిమంది నాయకులు మాత్రమే వున్నారు'. ఏక్‌నాథ్ అవాడ్ ఆత్మకథ 'స్ట్రైక్ ఏ బ్లో టు చేంజ్ ది వరల్డ్' శీర్షికతో ఆంగ్లంలోకి అనువాదమయింది. సాహిత్యార్థత, సామాజిక అంతర్దృష్టి నిండుగా ఉన్న ఉద్గ్రంథమది. వివిధ పోరాటాలలో సహచరులు, కుటుంబ సభ్యుల (ముఖ్యంగా సతీమణి) గురించి హృద్యమైన పద చిత్రణలే కాకుండా సామాజిక న్యాయ పురోగతిని అడ్డుకున్న లేదా ఆసరా ఇచ్చిన శక్తుల గురించి నిశిత విశ్లేషణలు కూడా అవాడ్ ఆత్మకథలో వున్నాయి. ఆయన ఇలా రాశారు: 'దళితులకు ఆహారం, సిమెంట్‌తో నిర్మించిన గృహాలను సమకూర్చడం ద్వారా అంటరానితనం సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదు. వారిలో ఆత్మగౌరవ భావాన్ని మేలుకొల్పడం చాలా ముఖ్యం'.




**అమానుష అసమానతల సమాజాన్ని నాలుగు దెబ్బలు కొట్టగల శక్తిని తెచ్చుకోవడానికి, నిర్మాణాత్మకంగా మార్చివేయడానికి దళిత భారతీయులకు ఒక మహాస్ఫూర్తి అంబేడ్కర్. బాబాసాహెబ్ ఆదర్శ బాటలో ముందుకు సాగిన సమున్నత క్రియాశీలుడు ఏక్‌నాథ్ అవాడ్ (1956–2015). ఆయన ఆత్మకథ ' స్ట్రైక్ ఏ బ్లో టు చేంజ్ ది వరల్డ్ ' సాహిత్యార్థత, సామాజిక అంతర్దృష్టి నిండుగా ఉన్న ఒక ఉద్గ్రంథం.**

1970 దశకంలో అవాడ్ యువకుడుగా ఉన్నప్పుడు మరఠ్వాడా విశ్వ విద్యాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని అగ్రకులాల వారు తీవ్రంగా వ్యతిరేకించారు. పాశవిక హింసాకాండకు పాల్పడ్డారు. చాలా సంవత్సరాల అనంతరం అంబేడ్కర్ సతీమణి రమాబాయి పేరిట అవాడ్ ఒక సహకార సంఘాన్ని నెలకొలిపి, విజయవంతంగా నిర్వహించారు. వివిధ కులాలకు చెందిన స్త్రీలు ఈ సహకార సంఘంలో భాగస్వాములుగా ఉండేవారు. మత్స్యకారులు, పశువుల కాపర్లు, గాజులు తయారు చేసే వారు మొదలైనవారు దోపిడీదారులైన దళారీల ప్రమేయం లేకుండా తమ ఉత్పత్తులను ఈ సహకార సంఘం ద్వారా విక్రయించుకునే వారు. 2010 సంవత్సరం నాటికి ఇరవై లక్షల కుటుంబాలు ఈ సహకార సంఘం ద్వారా లబ్ధి పొందాయి. ఈ సాఫల్యానికి అవాడ్ సహేతుకంగానే గర్వించారు. ఆయన ఇలా రాశారు: 'మరాఠ్వాడా విశ్వ విద్యాలయానికి బాబాసాహెబ్ పేరిట పునః నామకరణం చేయాలని ఉద్యమించిన కారణంగా నన్ను తీవ్రంగా వ్యతిరేకించిన పలు గ్రామాలు ఇప్పుడు ఆ మహనీయుడి భార్య పేరిట ఏర్పాటు చేసిన ఒక సూక్ష్మ రుణాల సంఘంలో భాగస్వాములయ్యాయి. నేను ఇంతకంటే ఏమి కోరుకోగలను? సామాజికంగా చాలా వెనుకబడిన ఒక జిల్లాలో అగ్రకులాల వారు ఇప్పుడు ఏటా బాబాసాహెబ్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి శుభ కార్యాలు సాధ్యమవుతాయని అప్పట్లో ఎవరైనా కలలోనైనా ఊహించారా?'

డాక్టర్ బి.ఆర్ .అంబేడ్కర్ కీర్తికాయుడై ఆరు దశాబ్దాలకు పైగా గడచిపోయాయి. అయినా ఇప్పటికీ దేశ వ్యాప్తంగా దళితులకు ఆయన ఒక మహాస్ఫూర్తిగా వున్నారు. విద్యావంతులు కావడానికి, సంఘటితమవ్వడానికి, ఆందోళనలు నిర్వహించేందుకు వారికి ఆయన ఒక ప్రేరణగా ఉన్నారు. తాము ఎదుర్కొంటున్న వివక్షలను ఎదుర్కొని, అధిగమించేందుకు దళితులకు ఆయన స్మృతి మార్గదర్శకత్వం వహిస్తోంది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే అంబేడ్కర్ ఇప్పుడు అగ్రకులాల వారి నుంచి కూడా అమిత గౌరవాదరాలను పొందుతున్నారు. ఆదర్శ ప్రాయుడైన నేతగా ఆయన్ని అగ్రకులాలవారు గుర్తించి గౌరవిస్తున్నారు. ఎవరైనా ఎప్పుడైనా ఇందుకు వ్యతిరేకించినప్పటికీ అటువంటి గౌరవాదరాలను వారు ఆయనకు ఇవ్వకుండా ఉండడమనేది ఇంకెంత మాత్రం సాధ్యంకాదు. మరణించిన చాలా కాలం తరువాత కూడా అంబేడ్కర్ నుంచి దళితులు నైతిక, రాజకీయ, మేధో స్ఫూర్తి పొందుతున్నారు. వారి పోరాటాలకు ఆయనొక ప్రధాన ఆలంబనగా వున్నారు. జీవిత హుందా, ఆత్మ గౌరవం కోసం భారతీయ ఆదివాసీలు జరుపుతున్న పోరాటాలలో వారికి, దళితులకు అంబేడ్కర్ వలే, స్ఫూర్తి నిచ్చే నాయకుడు ఎవరూ లేక పోవడం ఎంతైనా విషాదకరం.

*(వ్యాసకర్త చరిత్రకారుడు)*

## జనవాక్యం

### బీజేపీకి తడిచిన మతాబీ, కాంగ్రెస్‌కు పువ్వొత్తి

మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు, కాంగ్రెస్‌కి నిలబడేందుకు కాస్తా చోటు దక్కాయి. ఈ రెండు రాష్ట్రాల్లో నిన్నటి వరకూ బీజేపీ అధికారంలో ఉంది. అఖండ మెజారిటీతో గెలిచి కేంద్రంలో రెండోసారి అధికారం చేపట్టి మంచి ఊపులో ఉంది. పైగా ప్రతిపక్షాలు, కాంగ్రెస్ పార్టీ అయోమయంలో ఉన్నాయి. అన్ని హంగులూ, బలమైన నేతలూ, ఆర్థిక, అంగ బలాలు తోడుగా బరిలోకి దిగిన భాజపా ఇక వార్ వన్ సైడే అన్న ఆత్మవిశ్వాసంతో ఉంది. పైగా జాతీయ భావాన్ని, మెరుపు దాడుల్ని, కశ్మీర్ అంశాన్ని ప్రచారంలో కేంద్రకంగా చేసి, ప్రతిపక్షాలను గట్టిగా మాట్లాడనీయని స్థితికి నెట్టానని భావించింది. గెలుపు నల్లేరు మీద నడకేనని నమ్మి, నమ్మించింది. అయితే ప్రజలు వేరేలా అనుకున్నారు. మహారాష్ట్రలో మెజారిటి తగ్గించి, మిత్ర శివసేనకి టానిక్ ఇచ్చారు. ఇక వారిరువురు సమ స్థాయిలో అధికారం పంచుకునే పరిస్థితి కల్పించారు. కాంగ్రెస్‌కి, శరద్ పవార్ ఎన్‌సీపీకి ప్రతిపక్షంగా బలం పెంచారు. హర్యానాలో అయితే హంగు పరిస్థితి ఏర్పడింది. బీజేపీ అధికారానికి దూరంలో ఆగిపోయింది. కాంగ్రెస్ బలం బాగా పుంజుకుంది. చౌతాలా కుటుంబానికి చెందిన యువనేత కీలకంగా తయారయ్యాడు. వెరసి ఈరెండు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భాజపాయేతర పక్షాలదే హవా. ఆర్థిక మందగమనం, ఇతర స్థానిక సమస్యల్ని జాతీయ సెంటిమెంట్‌ల సాయంతో మరిపించగలమని భావించిన భాజపా వాస్తవం ఎరిగే తీర్పిది. మోదీని చూసి బేజారిపోయి కాడి వదిలిన కాంగ్రెస్‌కి ఊరట నిచ్చే తీర్పు. రెండు రాష్ట్రాల్లో ఆ పార్టీ అధ్యక్షులు సోనియా ఒక్కటంటే ఒక్క ఎన్నికల ప్రచార సభలో కూడా పాల్గొనలేదంటే వారి ఆత్మ విశ్వాస లేమి ఎలా ఉందో తెలుస్తోంది. మళ్ళీ బలం కూడగట్టుకొని పోరాడవచ్చని తీర్పు చెప్పారు ప్రజలు. మిగతా ప్రతిపక్షాలు కూడా నేర్చుకోవాల్సిన పాఠాలు చెప్పారు. ముఖ్యంగా దీపావళి కానుకగా భాజపాకు వెలిగీ వెలగని మతాబులు, ఈసురోమన్న కాంగ్రెస్‌కు కొంచెం హుషారునిచ్చే చిచ్చు బుడ్లు ఇచ్చారన్న మాట.

**– డా.డి.వి.జి.శంకరరావు,**
మాజీ ఎంపీ, పార్వతీపురం

### అందరికీ సాయమందాలి

రాష్ట్రంలో ఇప్పటికే ఆత్మహత్యలు, విష సర్పాల కాట్లు, విద్యుదాఘాతాలు, పిడుగుపాట్లు వంటి ప్రమాదాల్లో మరణించిన రైతులు 500కు పైగా ఉన్నారు. ఇలా మరణించిన రైతు కుటుంబాలకు ఏడు లక్షల రూపాయల చొప్పున సాయం అందిస్తామని ముఖ్యమంత్రి పలు సందర్భాలలో చెప్పారు. ఇది కాకుండా గత ప్రభుత్వ హయాంలో కూడా ప్రాణాలు కోల్పోయి సహాయం అందని కుటుంబాలకు కూడా సాయం అందిస్తామని నర్మగర్భంగా చెప్పారు. ఈ దామాషాన ప్రభుత్వం రూ. 50కోట్ల వరకూ చెల్లించవలసి ఉంటుంది. అవసరమైన నిధులను ఆయా జిల్లా కలెక్టర్లకు వెంటనే బదలాయించి మృతుల కుటుంబాలను ఆదుకోవాలి.

**– గరిమెళ్ళ రామకృష్ణ**
ఏలూరు

### పర్యావరణ హితంగా దీపావళి

భూమిపై సమస్త జీవరాశికి ఊపిరి పోస్తున్న గాలి నేడు కలుషితమై జీవ జాతి మనుగడకు పెను శాపంగా మారుతోంది. వాయు కాలుష్యం పెరిగి స్వచ్ఛమైన గాలి అనేదే కరువయింది. ప్రజల వ్యక్తిగత, ఆర్థిక, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. విభిన్న సంస్కృతులకు చెందిన ప్రజలతో కూడిన భారత దేశంలో పండుగలు, పబ్బాలు కూడా ఎక్కువగానే జరుగుతుంటాయి. వీటి వల్ల కూడా వాయు కాలుష్యం పెరుగుతోంది. మరీ ముఖ్యంగా దీపావళి వంటి పండుగలలో టపాసులు కాల్చడం వల్ల గాలి విషపూరితంగా మారుతోంది. పటాకుల వల్ల సూక్ష్మాతి సూక్ష్మ పదార్థాలు గాలిలోకి విడుదలవుతూంటాయి. ఇవి ఊపిరితిత్తుల ద్వారా రక్తంలో కలిసిపోయి ఉబ్బసం, ఊపిరితిత్తుల క్యాన్సర్, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు కలుగజేస్తాయి. గర్భిణీ స్త్రీలు, గర్భస్థ శిశువులపై ప్రభావం చూపుతాయి. గుండె జబ్బులు సంభవిస్తాయి. వాయు కాలుష్యం వల్లనే భారత్‌లో ఏటా దాదాపు 12.4 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివిధ సంస్థల నివేదికలు వెల్లడిస్తున్నాయి. బాణాసంచా కాల్పుల వలన 190 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం జరిగిందని, అది దాదాపు భారత స్థూల దేశీయ ఉత్పత్తిలో 1.7% గా ఉంటుందని ఒక అంతర్జాతీయ సంస్థ అంచనా వేసింది. గాలి నాణ్యత, వాతావరణ సూచన పరిశోధన వ్యవస్థ (SAFAR) నివేదిక ప్రకారం 2018 దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చడం వలన ఢిల్లీలో గాలి నాణ్యత సూచి 574 శాతానికి చేరుకుంటే, హైదరాబాదులో 267 శాతానికి చేరుకుంది. గాలి నాణ్యత సూచీ(AQI) 0 నుండి 100 వరకు ఉంటేనే ఆరోగ్యకరమైన గాలిగా పరిగణిస్తారు. దీన్ని బట్టి దీపావళి నాడు టపాసుల కాల్పుల వల్ల గాలి నాణ్యత ఎంత ప్రమాదకరమైన స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీపావళి తర్వాత సాధారణ పరిస్థితి రావడానికి ఢిల్లీలో 25 రోజులు, హైదరాబాదులో 16 రోజుల సమయం పట్టిందని ఆ నివేదిక పేర్కొన్నది. ఈ ప్రమాదాల నుంచి మనను మనం రక్షించుకోవాలంటే టపాసులు కాల్చడం మానాలి. ఒక వేళ కాల్చినా, పర్యావరణహిత బాణాసంచాను వాడాలి. దీపావళి రోజున సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాత్రి 8 –10 గంటల వరకు మాత్రమే కాల్చాలి.

**– సంపతి రమేష్ మహారాజ్**
రాజన్న సిరిసిల్ల జిల్లా

### స్వేరోస్ 4వ రాష్ట్ర మహాసభలు

అట్టడుగు సమూహాల్లో వెలుగులు నింపుతూ, జ్ఞాన సమాజమే లక్ష్యంగా శ్రమిస్తోంది స్వేరోస్ నెట్‌వర్క్. గ్రామగ్రామాన చదువు ప్రాముఖ్యతను తెలుపుతూ విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆత్మగౌరవంతో జీవించడానికి మహనీయులు చూపిన మార్గంలో వ్యక్తిగత క్రమశిక్షణతో నడవాలని పిలుపునిస్తోంది. పలు సంఘాలుగా ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో స్వేరోస్ 4వ రాష్ట్ర మహాసభ ఈ నెల 27న మేడ్చల్ లోని వీఎన్‌ఆర్ గార్డెన్స్‌లో జరుగుతుంది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్, నాదం ఫౌండేషన్ ఛైర్మన్ డా. పగిడి పాటి దేవయ్య, గురుకులాల కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ హాజరవుతారు. గౌరవ అతిథులుగా ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్. సుకుమార్, డిక్కి సౌత్ ఇండియా ప్రెసిడెంట్ రాజా నాయక్, డా.ఎం.ఎ.మాలిక్, గొల్లూరి అంజయ్య, కవితా పులి పాల్గొంటారు.

**– స్వేరోస్ సెంట్రల్ కమిటీ**

# రైతుకు భరోసా ఏదీ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రైతు భరోసా అమలులో చతికిల పడిందనే చెప్పుకోవాలి. మా మేనిఫెస్టో బైబిల్...ఖురాన్...భగవద్గీత.. అని గొప్పలు చెప్పుకొంటున్నారు. కానీ, అందులో చెప్పిన దానికి అమలుకు పొంతనే లేదు. ప్రతి రైతుకీ రూ. 12,500 రైతు భరోసాగా ప్రకటించినప్పుడు పీఎం కిసాన్ యోజన రూ. 6,000 లేదు. అంటే తామే రూ. 12,500 ఇస్తామని ప్రకటించారు. ఇప్పుడు రూ. 1000 కలిపారు. అందుకని, రాష్ట్ర ప్రభుత్వమే రూ. 13,500 చెల్లించాల్సి వుంది. దానికి కేంద్రం ఇస్తానన్న రూ. 6000 కలిపితే రూ. 19,500 రైతుకు ఇవ్వాలి. కానీ కేంద్రం ఇచ్చే రూ. 6000 లకు రాష్ట్రం రూ. 7,500 కలిపి రూ. 13,500 ఇస్తున్నారు. ఇలా రైతుకు చెల్లించాల్సిన దాంట్లో రూ. 6,000 మిగుల్చుకున్నది ప్రభుత్వం. ఇది రైతుకి మేలు చేయడమా? మోసం చేయడమా? అంతే కాదు, భరోసా పథకం ప్రకటించినప్పుడు మూడు విడతల్లో అమలు చేస్తామని చెప్పలేదు.

రాష్ట్రంలో కోటి మంది రైతులు ఉన్నారు, కౌలు రైతులతో సహా ప్రతి రైతు కుటుంబానికీ భరోసా ద్వారా లబ్ధి చేకూరుస్తాం అని పాదయాత్ర సమయంలో జగన్ అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో 64 లక్షల మంది రైతులున్నారని చెప్పారు. కానీ నేడు 50 లక్షల మంది రైతులనే అర్హులుగా గుర్తించారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు దారులున్నట్లు రాధాకృష్ణ కమిషన్ అంచనా వేసింది. ఆర్థిక సర్వేలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు చెప్పారు. తరువాత ప్రభుత్వం ఆసంఖ్యను 6 లక్షలకు కుదించింది. ఇప్పుడు దాన్ని 3 లక్షలకు తగ్గించారు. ఆచరణకి వచ్చేసరికి ఇంకెంతమదిని తగ్గిస్తారో చూడాలి. కౌలు రైతుల్లో 90 శాతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉన్నారు. ఇంతవరకు ఏ గ్రామంలోనూ కౌలుదార్లను గుర్తించలేదు. మోదీ ప్రకటించిన పథకం కౌలు రైతుకు వర్తించక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే కౌలు రైతుల భారాన్ని భరిస్తుందని సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు లబ్ధిదారుల సంఖ్య కుదించడం వల్ల నష్టపోతున్నవారిలో కౌలు రైతులే అధికం.

ఇచ్చే ఈ కొద్దిపాటి భరోసా కూడా మూడు విడతల్లో అమలు చేస్తానని చెప్పడం దారుణం. ప్రభుత్వం, వీలైనంత వరకు తనపై భారం తగ్గించుకొనే ప్రయత్నం చేసింది. గత ప్రభుత్వం లక్షా యాభై వేల రుణ మాఫీని 5 విడతల్లో మాఫీ చేస్తానంటే విడతల వారీ ఏమిటంటూ విమర్శించిన వారు ఈ రోజు రూ. 37 వేలే 3 విడతలుగా ఇస్తామనడం ఏమిటో సమాధానం చెప్పాలి. ఆ రోజు, 2014 లో రాష్ట్ర బడ్జెట్ లక్షా పన్నెండు వేల కోట్లు, ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్ రెండు లక్షల 27 వేల కోట్లు.

ఇదే కాదు, గత ప్రభుత్వం చెల్లించాల్సిన 4, 5 విడతల రుణ మాఫీ బకాయిలను నిలిపి వేసి తన రైతు వ్యతిరేక వైఖరిని ప్రదర్శించింది వైకాపా ప్రభుత్వం. అంటే రైతులు, వ్యవసాయం పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయం కలిసిరాక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతుల మృత్యు ఘోష పాలకులకు వినిపించడం లేదా ? రివర్స్ కాంట్రాక్టులపై ఉన్న ప్రేమ కర్షకులపై లేదా ? టీడీపీ అధికారంలోకి వచ్చే నాటికి ఆంధ్రప్రదేశ్‌లో రూ. 16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ ప్రతి రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ. 1.50లక్షలు, మొత్తంగా సుమారు రూ. 24,500 కోట్లు రుణమాఫీ చేయాలని నిర్ణయించినప్పుడు రిజర్వ్ బ్యాంకు సహకరించకపోయినా చంద్రబాబు నాయుడు రుణమాఫీ అమలు చేశారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం తనకు తానుగా రైతులకు రుణాలు మాఫీ చేయడం దేశంలోనే అది మొదటి సారి. రాష్ట్ర విభజన తర్వాత ధనిక రాష్ట్రమైన తెలంగాణలో రుణమాఫీని రూ.లక్షకు పరిమితం చేయగా, లోటు బడ్జెట్‌తో ఉన్న ఏపీలో మాత్రం రూ. 1.50లక్షల వరకు మాఫీ చేసింది ప్రభుత్వం. రూ.50వేలు లోపు ఉన్న సుమారు 23.76 లక్షల ఖాతాలకు సంబంధించి వన్ టైమ్ సెటిల్మెంట్ కింద సుమారు రూ.4493కోట్లు ఒకేసారి మాఫీ చేసింది. మూడు విడతల్లో 10శాతం వడ్డీతో సుమారు రూ.15,400కోట్లు చెల్లించింది. రుణమాఫీకి సంబంధించి నిర్వహించిన గ్రీవెన్స్ ద్వారా అర్హత గల 6551 ఖాతాలను గుర్తించి రూ.155.95కోట్లు విడుదల చేసింది. హార్టికల్చర్ రైతులకు రూ.384కోట్లు రుణమాఫీ చేసారు. మిగిలిన 4, 5 విడతలకు సంబంధించి రూ.7,959 కోట్లు చెల్లించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంతోపాటు జీఓ 38 కూడా జారీ చేశాం. నాలుగో విడతకు సంబంధించిన మొత్తాన్ని పీడీ అకౌంట్లలో జమ చేయడంతోపాటు కొంత అనగా రూ.376 కోట్లు రైతుల ఖాతాలకు చెల్లించింది ప్రభుత్వం. అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతుల ఖాతాలో రుణమాఫీ నగదు జమ చేయకుండా అడ్డుపడిన వైకాపా నాయకులే ఇప్పుడు 4,5 విడతల రుణమాఫీ నిధుల విడుదలను రద్దు చేస్తూ 99 జీఓ తెచ్చారు. మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకొనేవారు ఎవరైనా ఇంత దారుణంగా వ్యవహరిస్తారా? చంద్రబాబుపై ఉన్న కోపంతో రైతు ప్రయోజనాలు దెబ్బతీయడం సమంజసమా? రైతు సంక్షేమమే ధ్యేయం అని ఓట్లు దండుకున్న వైకాపా నాయకుల అసలు రంగు దీనితో బయట పడింది. రైతుల గురించి చెప్పింది కొండంత చేస్తున్నది గోరంత. అసెంబ్లీ సాక్షిగా రైతు రుణమాఫీ పథకాన్ని కొనసాగింపును పరిశీలిస్తామన్న ప్రభుత్వం నేడు పథకాన్ని రద్దు చేసి లక్షల మంది రైతుల గొంతు కోశారు. రుణ మాఫీ పేరుతో రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చారని మాపై ప్రచారం చేసిన మీరు రైతు భరోసా హామీతో అధికారం చేజిక్కించుకున్నాక హామీని పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడం కాదా?




**■ తొండపు దశరథ జనార్దన్**
శాసనమండలి సభ్యులు

# పటిష్ఠ గ్రామ సచివాలయాలు అవశ్యం

బల్వంతరాయ్ కమిటీ నివేదిక ఆధారంగా 1959లో మూడంచెల పంచాయతీ వ్యవస్థ ఏర్పాటైంది. ఈ అంచెలే.. గ్రామ పంచాయతీ, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్. తరువాతి కాలంలో గ్రామ పంచాయతీ, మండలపరిషత్తు, జిల్లా పరిషత్‌గా వ్యవస్థీకృతమైనాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 29 శాఖలకు సంబంధించిన నిధులు, విధులు, అధికారాలు స్థానిక సంస్థలకు బదలాయింపు జరగవలసింది.

కొన్ని అంశాలకు సంబంధించిన కొంత మేరకు మాత్రమే అధికారాల బదలాయింపు జరిగింది. దానితో గ్రామీణ ప్రజలు ఆశించిన స్థాయిలో పలు సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలు అందడం లేదు. 2001లో గ్రామ సచివాలయం ప్రవేశ పెట్టినా గ్రామ ప్రజలకు సేవలు అందించకుండానే ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఇంతేగాక సమాంతర వ్యవస్థలను ప్రవేశపెట్టి పంచాయతీరాజ్ సంస్థలను నిర్వీర్య పరిచారు.

ఈ పరిస్థితిలో నేటి ప్రభుత్వం గ్రామీణులకు పలు సేవలు, సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో నవరత్నాలులో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి కంకణం కట్టుకోవడం ముదావహం. ఈ ఉద్దేశంతోనే గ్రామ వాలంటీర్లతోపాటు, గ్రామ సచివాలయాల్లో అవసరమైన సిబ్బందిని కలిపి సుమారు మూడు లక్షల పైగా పోస్టులను మంజూరు చేసింది. ఇప్పటికే గ్రామ వాలంటీర్ల నియామకం జరిగింది. సచివాలయ ఉద్యోగాలకు కూడా రాత పరీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలకు పలు సేవలు అందించే ఉద్దేశంతో ప్రతి యాభై కుటుంబాలకు ఒక గ్రామ వాలంటీర్‌ను నియమించారు. వీరి ద్వారా గ్రామీణ ప్రజలు ప్రభుత్వపరంగా లభించే సర్టిఫికేట్లు, సేవలు, సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఏర్పడుతుంది. అలాగే ప్రభుత్వం గ్రామ సచివాలయంలో పంచాయతీ సంక్షేమ కార్యదర్శి, పోలీసు అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ ఆఫీసర్, గ్రామ సర్వేయర్, హార్టికల్చర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేసింది. గ్రామ సచివాలయాల ద్వారా అవసరమైన ధ్రువపత్రాల జారీ, మంచి నీటి, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ నిధుల విడుదల వినియోగం.. తదితర వివరాలు అందుబాటులో ఉంచాలి. రైతులకు మేలైన విత్తనాలు సరఫరా చేయడం, అవసరమైన క్రిమిసంహారక మందులు సరఫరా చేయడం, మేలైన పశు వైద్యం, పింఛన్ల పంపిణీ, కుటీర పరిశ్రమలకు ఆర్థిక సహాయం, మార్కెటింగ్ కల్పన, భూములకు సంబంధించిన రికార్డులు త్వరితగతిన అందజేయడం వంటివీ జరగాలి. వీటితో పాటు గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీ నిధులు విడుదల– వినియోగంపై సమాచారం కూడా అందజేయవలసిన అవసరం ఉంది. ఇదంతా గ్రామ వాలంటీర్ల బాధ్యతే. అందుకని, గ్రామ వాలంటీర్లు గ్రామ ప్రజలకు, సచివాలయలకు అందుబాటులో ఉండి శ్రద్ధగా, సమర్థవంతంగా పని చేయాల్సి ఉంది.



**గ్రామ సచివాలయం పటిష్ఠతకు ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పంచాయతీలకు నిధులు సకాలంలో సమకూర్చడం, పంచాయతీ సొంత నిధుల వినియోగంపై సీఎఫ్‌ఎంఎస్ తొలగించడం, సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను రాబట్టుకోవాలి.**

ఈ దశలో గ్రామ సచివాలయం పటిష్ఠతకు ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పంచాయతీలకు నిధులు సకాలంలో సమకూర్చడం, పంచాయతీ సొంత నిధుల వినియోగంపై సీఎఫ్‌ఎంఎస్ తొలగించడం, సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను రాబట్టుకోవాలి. అలాగే సిబ్బందికి ఎప్పటికప్పుడు తాజా సాంకేతిక నైపుణ్యం అందజేయడం, నిధుల వినియోగంపై ఆన్‌లైన్ ద్వారా తనిఖీ చేసే అధికారం పంచాయతీ విస్తరణాధికారికి కల్పించడం వంటివీ చేయాల్సి ఉంది. కార్యక్రమాల అమలుకు మండల స్థాయిలో మరొక పంచాయతీ విస్తరణ అధికారిని నియమించాలి. నిర్ణీత తేదీల్లో గ్రామ సభలు కచ్చితంగా జరిగేలా చూడాలి. సచివాలయ నిర్ణయాలను మండల స్థాయిలో నెలకొకసారి సమీక్షించడం తప్పనిసరిగా జరగాలి.

వీటన్నిటితో పాటు పంచాయతీ ఉద్యోగుల సమస్య కూడా ప్రభుత్వం పరిష్కరించాలి. ముఖ్యంగా పంచాయతీల తాత్కాలిక సిబ్బంది సేవలను క్రమబద్ధీకరించాలి. పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్లను (6 )నుండి (3)కుదించాలి. పదోన్నతుల సమస్యలూ పరిష్కరించాలి. అన్ని స్థాయిల్లో గల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, డివిజనల్ పంచాయతీ అధికారులకు మెజిస్ట్రీరియల్ అధికారాలు కల్పించడం ద్వారా ఆర్థిక అక్రమాలను అరికట్టే అవకాశముంటుంది.

పెరిగిన పని భారం, అవసరాల నేపథ్యంలో నలుగురు అదనపు కమిషనర్లు, 8 మంది ఉప కమిషనర్లు, 16 సహాయ కమిషనర్లు, తదనుగుణంగా సెక్షన్లు మంజూరు అవసరం ఎంతైనా ఉంది. సుమారు 4 లక్షలకు పైబడి ఉద్యోగస్తులు, వేల కోట్ల రూపాయలు నిధుల వినియోగ పర్యవేక్షణ కోసం కమిషనర్ కార్యాలయాన్ని కూడా పటిష్ఠపరచడం ఎంతైనా ఉంది. గణాంక, ఆడిట్ విభాగాల ఏర్పాటు తప్పనిసరి. ఇలా గ్రామ సచివాలయాలను బలోపేతం చేయాలి.

**■ టీఎంబి బుచ్చిరాజు**
ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

దీపావళి అనగానే దివ్వెల కాంతులు, టపాసుల మోతతో పాటు స్వీట్స్ ఉండాల్సిందే. ఒకవైపు ఇల్లంతా దీపాల వెలుగులు విరజిమ్ముతుంటే, బంధు మిత్రులు ఒకరికొకరు నోరు తీపి చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొంటారు. ఈ దీపావళికి మిఠాయి దుకాణాల్లో కొన్నవి కాకుండా, రేపటి కోసం ఈ రోజు ఇంట్లోనే ఇష్టమైన తీపి టపాసులు సిద్ధం చేయండి. డ్రైఫ్రూట్ లడ్డూ, కాజూ ఫ్లవర్, బర్ఫీ, హల్వా, ఖీర్, రసగుల్ల... అన్నీ తీపి టపాసులే. 'హ్యాపీ అండ్ స్వీట్ దీపావళి'!

# తీపి టపాసులు!

వంటిల్లు



## కోకోనట్ బర్ఫీ

**కావలసినవి**

నెయ్యి - ఒక టేబుల్‌స్పూన్, కొబ్బరితురుము - రెండు కప్పులు, కోవా - ఒక కప్పు, పాలు - రెండు కప్పులు, పంచదార - ఒక కప్పు, యాలకుల పొడి - ఒక టీస్పూన్, రోజ్‌వాటర్ - ఒక టీస్పూన్, కుంకుమ పువ్వు - కొద్దిగా, ఫుడ్ కలర్ - చిటికెడు.

**తయారీ**

- పాన్‌లో నెయ్యి వేసి కాస్త వేడి అయ్యాక కొబ్బరి తురుము వేసి వేగించాలి.
- కాసేపు వేగిన తరువాత పాలు, పంచదార వేసి కలియబెట్టాలి.
- మిశ్రమం చిక్కబడే వరకు చిన్నమంటపై ఉంచాలి.
- తరువాత కుంకుమపువ్వు, యాలకుల పొడి, రోజ్‌వాటర్ వేసి కలపాలి.
- మిశ్రమం చిక్కబడిన తరువాత కోవా వేసి నెమ్మదిగా కలియబెట్టాలి.
- ఇప్పుడు మిశ్రమాన్ని రెండు వేర్వేరు వెడల్పాటి పాత్రల్లోకి మార్చి నచ్చిన ఫుడ్‌కలర్ కలపాలి.
- వేడిగా ఉండగానే ఒక పాన్‌లోని మిశ్రమాన్ని మరో పాన్‌లో మిశ్రమంపై పోయాలి. పాన్ అంతటా సమంగా వచ్చేలా చూసుకోవాలి.
- చల్లారిన తరువాత ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.
- డైమండ్ ఆకారంలో కట్ చేసి సర్వ్ చేసుకోవాలి.



## డ్రై ఫ్రూట్ పంచమేవ లడ్డూ

**కావలసినవి**

జీడిపప్పు - ఒక కేజీ, బాదం - 300 గ్రాములు, గుల్కంద్ - 200గ్రాములు, ఎండుద్రాక్ష - 200గ్రాములు, వాల్‌నట్స్ - 300గ్రాములు, పిస్తా - 200 గ్రాములు, కుంకుమపువ్వు - 5గ్రా, పంచదార - అరకేజీ.

**తయారీ**

- ముందుగా జీడిపప్పును రెండు గంటలపాటు నానబెట్టాలి. తరువాత చిన్నచిన్న ముక్కలుగా కట్ చేయాలి.
- ఇప్పుడు ఒక పాత్రలో పంచదార వేసి ఐదు నిమిషాల పాటు వేడి చేయాలి. పంచదారను వేడి చేయడం వల్ల మెత్తటి మిశ్రమంలా మారుతుంది.
- మరొక పాత్రలో జీడిపప్పు, బాదం, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష, పిస్తా, గుల్కంద్ వేసి, వేడి చేసిన పంచదార, కుంకుమపువ్వు వేసి అన్నీ బాగా కలిసేలా కలపాలి.
- ఇప్పుడు మిశ్రమాన్ని చిన్న చిన్న లడ్డూలుగా చేసుకోవాలి.
- రుచిగా ఉండే ఈ డ్రై ఫ్రూట్ లడ్డూలు తింటే పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.



## రసగుల్ల

**కావలసినవి**

పాలు - రెండు లీటర్లు, నిమ్మరసం - పావు కప్పు, మైదా - ఒక టీస్పూన్, పంచదార - రెండు కప్పులు, యాలకులపొడి - అర టీస్పూన్.

**తయారీ**

- ఒక పాత్రలో పాలు తీసుకొని మరిగించాలి.
- మరుగుతున్న పాలలో నిమ్మరసం వేసి కలపాలి. పాలు పగిలి గడ్డలు గడ్డలుగా తయారవుతుంది. తరువాత స్టవ్ ఆర్పేసి పాత్ర పక్కన పెట్టాలి. చల్లారిన తరువాత ఒక పలుచని వస్త్రం సహాయంతో పాల మిశ్రమాన్ని వడబోయాలి.
- వస్త్రాన్ని దగ్గరకు కట్టి నీళ్లు పూర్తిగా పోయేలా చేయాలి.
- తరువాత మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి.
- ఇప్పుడు ఒక పాత్రలో నీళ్లు తీసుకుని పంచదార వేసి మరిగించాలి. పంచదార పానకం మరుగుతున్న సమయంలోనే చేసి పెట్టుకున్న ఉండలను వేసి మూత పెట్టాలి.
- పది నిమిషాల తరువాత స్టవ్ ఆర్పేయాలి. ఆవిరి పూర్తిగా పోయే వరకు మూత తీయకూడదు. పంచదార పానకాన్ని గ్రహించి రసగుల్లల సైజు రెట్టింపు అవుతుంది.
- చల్లారిన తరువాత యాలకుల పొడి వేసుకొని తింటే ఈ రసగుల్లలు భలే రుచిగా ఉంటాయి.





## ఖీర్

**కావలసినవి**

పాలు - నాలుగు కప్పులు, నీళ్లు - పావు కప్పు, బియ్యం - పావు కప్పు, పంచదార - 8 టేబుల్‌స్పూన్లు, యాలకులపొడి - అర టీస్పూన్, జీడిపప్పు - పది పలుకులు, ఎండు ద్రాక్ష - కొన్ని, కుంకుమపువ్వు - చిటికెడు.

**తయారీ**

- ముందుగా బియ్యం శుభ్రంగా కడిగి నానబెట్టాలి.
- వెడల్పాటి పాత్రలో పావు కప్పు నీళ్లు పోసి కాస్త వేడి అయ్యాక పాలు పోసి మరిగించాలి. తరువాత బియ్యంలో నీళ్లు వంచేసి, మరుగుతున్న పాలల్లో వేయాలి.
- చిన్నమంటపై ఉడికించాలి. అన్నం కాస్త ఉడికిన తరువాత పంచదార వేసి కలియబెట్టాలి.
- కాసేపు ఉడికిన తరువాత యాలకుల పొడి, నట్స్ వేసి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించాలి.
- మిశ్రమం చిక్కగా అయిన తరువాత కుంకుమ పవ్వు వేయాలి.
- చివరగా నట్స్‌తో గార్నిష్ చేసుకొని సర్వ్ చేసుకోవాలి.



## లౌకీ హల్వా

**కావలసినవి**

సొరకాయ - చిన్నది, బాదం - నాలుగైదు పలుకులు, జీడిపప్పు - నాలుగైదు పలుకులు, నెయ్యి - ఒకటిన్నర టేబుల్ స్పూన్, కోవా - యాభై గ్రాములు, పంచదార - మూడు టేబుల్‌స్పూన్లు, క్రీమ్ పాలు - 100ఎంఎల్, కుంకుమపువ్వు - కొద్దిగా, యాలకుల పొడి - ఒక టీస్పూన్, ఫుడ్ కలర్ - చిటికెడు, నట్స్ - గార్నిష్ కోసం కొద్దిగా.

**తయారీ**

- ముందుగా సొరకాయ పొట్టు తీసేసి గుజ్జుగా చేసుకోవాలి. విత్తనాలు ఉంటే తీసివేయాలి.
- ఒక పాన్‌లో నెయ్యి వేసి కాస్త వేడి అయ్యాక సొరకాయ గుజ్జు వేసి చిన్నమంటపై వేగనివ్వాలి. కాసేపు వేగిన తరువాత బాదం పలుకులు, జీడిపప్పు వేయాలి. తర్వాత కోవా వేసి కలపాలి. పంచదార, ఉప్పు వేసి మరి కాసేపు వేగించాలి.
- ఇప్పుడు పాలు పోసి కలియబెట్టాలి. కుంకుమ పువ్వు వేయాలి.
- మిశ్రమం చిక్కగా అవుతున్న సమయంలో కావాలనుకుంటే ఫుడ్ కలర్ వేసుకోవచ్చు. చివరగా యాలకుల పొడి వేసి, మరికాసేపు ఉంచి దింపుకోవాలి.
- డ్రై ఫ్రూట్స్‌తో గార్నిష్ చేసి, వేడి వేడిగా తినొచ్చు.



## కాజూ ఫ్లవర్

**కావలసినవి**

జీడిపప్పు - అరకప్పు, ఫుడ్ కలర్(ఎరుపు, ఆకుపచ్చ) - చిటికెడు, నెయ్యి - ఒక టీస్పూన్, పాలు - ఒక టేబుల్‌స్పూన్, పంచదార - పావుకప్పు.

**తయారీ**

- జీడిపప్పును మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఒక వెడల్పాటి పాన్ తీసుకుని నెయ్యి రాసి పక్కన పెట్టాలి.
- ఒక పాత్రలో నీళ్లు తీసుకుని పంచదార వేసి పానకం తయారు చేయాలి.
- పానకం తయారయ్యాక జీడిపప్పు పొడి వేసి కలపాలి. చిన్నమంటపై కలుపుతూ ఉండాలి. మిశ్రమం చిక్కబడుతున్న సమయంలో స్టవ్‌పై నుంచి దింపి నెయ్యి రాసిన ప్లేట్‌లోకి మార్చాలి.
- మిశ్రమాన్ని ప్లేట్‌లో రెండు సమభాగాలుగా చేసి, ఒకదాంట్లో ఎరుపు, మరొక దాంట్లో ఆకుపచ్చ ఫుడ్ కలర్ వేసి కలపాలి.
- ఈ సమయంలో అర టేబుల్‌స్పూన్ పాలు పోసి కలపాలి. లేదంటే మిశ్రమం చపాతీ పిండిలా అవుతుంది.
- తరువాత చేతికి నెయ్యి రాసుకుని మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేయాలి. ఇప్పుడు ఒక ఉండను కాస్త వెడల్పు చేసి మరో ఉండను మధ్యలో పెట్టి చుట్టూ కలపాలి. తరువాత కత్తితో ఫ్లవర్ ఆకృతిలో కట్ చేయాలి.
- దీపావళి రోజున ఈ కలర్‌ఫుల్ స్వీట్స్ కను'విందు' చేస్తాయి.



## స్వీట్ శంకర్‌పాలీ

**కావలసినవి**

మైదా - అరకేజీ, రవ్వ - పావుకేజీ, పాలు - అరకప్పు, నెయ్యి లేక డాల్డా - ఒక కప్పు, పంచదార - 300గ్రాములు, ఉప్పు - చిటికెడు, నూనె - డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ**

- పాన్‌లో నెయ్యి వేసి కాస్త వేడయ్యాక పాన్‌ను స్టవ్ పైనుంచి దింపాలి.
- ఒక పాత్రలో మైదా తీసుకుని అందులో రవ్వ, పంచదార, చిటికెడు ఉప్పు వేసి, వేడి చేసి పెట్టుకున్న నెయ్యి వేసి కలపాలి. పాలు పోస్తూ మెత్తటి మిశ్రమంగా వచ్చేంత వరకూ కలపాలి.
- దానిపై ఒక మెత్తటి వస్త్రం కప్పి పావు గంటపాటు పక్కన పెట్టాలి.
- తరువాత ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకుంటూ చిన్న గారెల్లా చేసుకోవాలి. తరువాత డైమండ్ ఆకారంలో కట్ చేసుకోవాలి.
- ఒక పాన్‌లో నూనె పోసి కాస్త వేడయ్యాక వాటిని వేసి గోధుమరంగులోకి మారే వరకు వేగించుకుంటే స్వీట్ శంకర్‌పాలీ రెడీ.
- ఈ మహారాష్ట్ర స్వీట్ పది రోజుల వరకు నిల్వ ఉంటుంది. వీటిని పిల్లలు, పెద్దలు ఇష్టంగా తింటారు.

# పండగ శోభ..!

ఇలా చేయండి!



దీపావళి పండగ రోజు కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడపడం, బాణాసంచా కాల్చడాన్ని మించిన ఆనందం మరొకటి లేదు. అయితే కొద్దిపాటి బడ్జెట్‌లోనే దీపావళి శోభ వెలిగించడానికి ఎన్నో మార్గాలున్నాయి. అవి ఇవే!

**క్యాండిల్స్ బదులుగా దివ్వెలు!**

బల్బులు, క్యాండిల్స్‌తో దీపావళి వెలుగులు విరజిమ్మాలంటే ఖర్చు తడిచి మోపెడవుతుంది. పైగా ప్రమిదల వెలుగుల ముందు క్యాండిల్స్, బల్బుల వెలుగులు ఏ పాటి? అందుకే ఈ దీపావళినాడు మట్టితో తయారైన ప్రమిదలు సేకరించి, వాటి మీద ఆక్రిలిక్ కలర్స్‌తో డిజైన్లు గీయండి. వీటిలో నూనె లేదా మైనం నింపి వెలిగించండి. మట్టి ప్రమిదలు కొనడం వల్ల అవి ఎక్కువ సమయంపాటు వెలగడమే కాదు, ఆ ప్రమిదలు తయారుచేసిన వారిని ప్రోత్సహించిన వాళ్లమవుతాం!

**పువ్వుల రంగోలి!**

రసాయనాలతో తయారైన కృత్రిమ రంగులకు బదులు పువ్వుల రేకులు, పసుపు, బియ్యప్పిండితో రంగోలి తయారుచేయండి. వీటి ఖరీదు తక్కువ. పైగా అలంకరించడం కూడా తేలికే.

**బడ్జెట్‌లో వెలుగులు!**

వాడకుండా వదిలేసిన గాజు సీసాలు ఉంటాయి. ఆ సీసాలను సేకరించి రంగులేయండి. వాటి లోపల ఫెర్రీ లైట్లను నింపి, కిటికీల దగ్గర ఉంచి ఆన్ చేయండి. ఈ సీసాల్లో చిన్న చిన్న మెసేజ్‌లు ఉంచి, వాటిని స్నేహితులకు పండగ సందర్భంగా బహుమతిగా ఇవ్వవచ్చు.

**దుపట్టాతో డెకరేషన్!**

గది సీలింగ్ నుంచి మూలలకు రంగురంగుల దుపట్టా లేదా చీరలతో అలంకరించుకోవచ్చు. కిటికీలకు, తలుపుల దగ్గర కర్టెన్లుగానూ వాడవచ్చు. బెడ్ వెనకాల గోడకు డిజైన్‌లా దుపట్టాలను అలంకరించి, వాటి మీద అక్కడక్కడా పువ్వులను గుచ్చండి. గదికి పండగ శోభ వస్తుంది.

**దాండియా!**

వినసొంపైన గుజరాతీ లేదా బాలీవుడ్ ప్లేలిస్ట్ తయారుచేసుకుని దీపావళి రాత్రి దాండియాతో హంగామా చేయవచ్చు. ఇందుకోసం దాండియా స్టిక్స్, మెరిసే దాండియా దుస్తులు ఉంటే చాలు. ఈ డాన్స్‌లో ఫ్రెండ్స్‌ను పాల్గొనేలా చేయండి.

హార్ట్ ఎటాక్ రాకుండా ఉండాలంటే
# ఏ నూనె మంచిది?

ఆహారం-ఆరోగ్యం

వెజిటబుల్ ఆయిల్స్‌లో కొలెస్ట్రాల్ ఉండదు కదా! సో... ఎంత తిన్నా గుండెకు పర్వాలేదా? ఏ ఆయిల్ హార్ట్ ఎటాక్ రాకుండా చేస్తుందో చెప్పండి. మా ఇంట్లో గత ఐదు తరాల నుంచి హార్ట్ ఎటాక్ చరిత్ర ఉంది.

**-కిరణ్,** విజయవాడ

వెజిటబుల్ ఆయిల్స్‌లో కొలెస్ట్రాల్ ఉండదనేది కరెక్టే కానీ అతిగా ఆయిల్స్ (కొవ్వు పదార్థం) తీసుకుంటే శరీరంలో ఎక్కువ కొవ్వు పేరుకుపోతుంది. ముఖ్యంగా పొట్ట భాగంలో. దీనివల్ల ఉదర భాగంలో ఉన్న ఆర్గాన్స్‌కి ప్రమాదమే. ప్రత్యేకంగా ఒక ఆయిల్ తీసుకుంటే హార్ట్ ఎటాక్ రాదనేది ఏమీ లేదు. హార్ట్ ఎటాక్ రాకుండా ఉండాలంటే చాలా పద్ధతులు పాటించాలి. అవి ఏమిటంటే...

- ఆయిల్స్ రెండు మూడు రకాలు వాడాలి. ఉదాహరణకు పప్పులో ఒక ఆయిల్, కర్రీ కోసం ఒక ఆయిల్... ఇలా వాడితే మంచిది. ఏ ఆయిల్ వాడినా రోజుకు 30 గ్రాములకు మించకుండా ఉండాలి. రిఫైండ్ ఆయిల్స్ తక్కువగా వాడితే మంచిది. బేకరీ ఫుడ్, బిస్కట్లలో హైడ్రోజినేటేడ్ ఆయిల్ (వనస్పతి, మర్గరిన్ వంటివి) వాడతారు కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. వారానికి రెండు లేదా మూడుసార్లు వైట్ ఫ్యాటీ ఫిష్ తినాలి. శాకాహారులు బాదం, అవిసెలు క్రమం తప్పకుండా తినొచ్చు. ఏదైనా సరే మోతాదు మించకూడదు.
- ఉప్పు ఒక టీ స్పూను కన్నా ఎక్కువ వాడకూడదు. నిల్వ ఉన్న ఆహారపదార్థాల్లో ఉప్పు ఎక్కువ ఉంటుంది కాబట్టి వీటిని తగ్గించాలి.
- చక్కెర రెండు స్పూన్ల కన్నా ఎక్కువ తీసుకోకూడదు. అధిక చక్కెర ఉన్న పదార్థాలు క్యాలరీలను పెంచుతాయి. అందుకే స్వీట్స్, చక్కెర ఉన్న పదార్థాలను బాగా తగ్గించాలి.
- రోజుకు 500 గ్రాములకు మించి పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- ప్రతీరోజూ కనీసం 30 నిమిషాలు వాకింగ్ చేయాలి.
- కంటినిండా నిద్ర పోవాలి.
- ప్రతి చిన్న దానికి బీపీ పెంచుకుని, లేనిపోని తగాదాలు, చర్చల అవసరం లేదని గుర్తించాలి. ప్రశాంతమైన మనసుతో ఆలోచిస్తే ప్రతి కష్టానికి విరుగుడు దొరుకుతుంది. రోజుకు 10 నిమిషాలు ధ్యానం చేయాలి.
- మీ శరీరంలో జరిగే మార్పులు గమనిస్తూ ఉండాలి. వాటికి తగిన విధంగా జీవనవిధానం మార్చుకోవాలి.
- తగిన బరువును మెయింటెయిన్ చేయాలి.



• **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com



# ద్రౌపదిగా...

వెండితెరపై మహారాణిగా కనిపించడం దీపికా పదుకోన్‌కి కొత్తేమీ కాదు. 'బాజీరావ్ మస్తానీ'లో ముస్లిమ్ యువరాణి, బాజీరావ్ సతీమణి మస్తానీగా, 'పద్మావత్'లో రాణీ పద్మావతిగా నటించారు. ఈసారి అంతకు మించి బరువైన పాత్ర పోషించడానికి ఆమె సిద్ధమయ్యారు. మహాభారతంలో ద్రౌపదిగా దీపికా పదుకోన్ నటించనున్నారు. "ద్రౌపదిగా నటించే అవకాశం రావడం నాకు దక్కిన అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నా. జీవిత కాలం గుర్తుండిపోయే పాత్ర ఇది. మహాభారతం నుండి మనం ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకోవచ్చు. భారతం నేర్పిస్తుంది కూడా. అయితే, అవన్నీ అందులో పురుషుల నుండే! ద్రౌపది దృష్టికోణం నుండి కథను చెప్పడం వల్ల మహాభారతం కొత్తగా, ఆసక్తికరంగా ఉండటమే కాదు... అర్థవంతంగా ఉంటుంది" అని దీపికా పదుకోన్ పేర్కొన్నారు. మధు మంతెనతో కలిసి స్వయంగా ఆమె సినిమా నిర్మించనున్నారు. 'చపాక్', '83' తర్వాత నిర్మాతగా దీపికకు మూడో చిత్రమిది. మహాభారతాన్ని రెండు లేదా అంతకంటే ఎక్కువ భాగాలుగా తెరకెక్కించనున్నారు. తొలి భాగం 2021 దీపావళికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


దీపికా పదుకోన్



# రైతు పాత్రలో వెంకటేశ్

వైవిధ్యమైన పాత్రలను ఎన్నుకోవడంలో మిగిలిన హీరోల కంటే వెంకటేశ్ ఎప్పుడూ ముందుంటారు. పాత్ర నచ్చితే చాలు ఆయన రీమేక్‌లో నటించడానికైనా వెనుకాడరు. ఆయన నటించిన రీమేక్ చిత్రాలన్నీ హిట్ కావడం గమనార్హం. తాజాగా ఇప్పుడు మరో రీమేక్ చిత్రంలో నటించడానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దసరా సందర్భంగా తమిళ నాట విడుదలై విజయం సాధించిన 'అసురన్' చిత్రాన్ని సురేశ్‌బాబు, కలైపులి ఎస్ థాను సంయుక్తంగా తెలుగులో రీమేక్ చేస్తున్నారు. ధనుష్, మంజు వారియర్ జంటగా నటించిన యాక్షన్ డ్రామా ఇది. ఈ చిత్రంలో రైతు పాత్రలో వెంకటేశ్ కనిపిస్తారు. అతి త్వరలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తారు.

"మనం ఫ్లాట్స్‌లో, డూప్లెక్స్ హౌసెస్‌లో, బంగ్లాల్లో నివసించడం లేదు. మనం మన మనసుల్లో నివసిస్తున్నాం. అవును... మన శాశ్వత నివాసమదే. ప్రశాంతమైన జీవితం కోసం ముందుగా మనసులో ఎటువంటి గజిబిజి గందరగోళాలు పెట్టుకోకుండా శుభ్రం చేసుకోవాలి" అని కాజల్ అగర్వాల్ అంటున్నారు. దీపావళి సందర్భంగా ప్రేక్షకులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మనసుల్ని శుభ్రం చేసుకోమని చెప్పారు. ఇంకా కాజల్ మాట్లాడుతూ "స్క్వేర్ ఫీట్స్‌లో కొలతలు వేసుకోవడానికి మనసుల్లో ఎటువంటి అడ్డంకులు, పరిమితులు లేవు. మనసు చాలా పెద్దది. మనకు కావాల్సినంత ఏరియా ఉంటుంది. మీకు ఓ విషయం తెలుసా? మన ఇంట్లో గదులు, బాల్కనీలు, గ్యారేజ్‌లు ఎంత చక్కగా ఉన్నాయి? పరిశుభ్రంగా ఉన్నాయి? అనేది అనవసరం. మన మనస్సుల్లో విషయాలను చక్కదిద్దుకున్నప్పుడే జీవితం బావుంటుంది. మనం ఏమో అన్నిటినీ తీసుకువెళ్లి మనసులో ఓ మూలకు తోసేసి చిందరవందర చేసేస్తాం. మనసు లోపల... అంచనాలను ఓ గదిలో బంధిస్తాం. సీక్రెట్స్‌ను కార్పెట్ కింద పెడతాం. పోలికల్ని ఒక టేబుల్ మీద ఊసేస్తాం. పగలు పెట్టుకుని ఒక బాక్సులో ఉంచుతాం. ప్రతి చోటా ఆందోళనలే. జాగ్రత్తగా ఉండండి. నిజమైన ఇంటికి (మనసుకు) హౌస్ కీపింగ్‌ని పెట్టుకోలేం. ఎవరికో ఔట్ సోర్సింగ్ ఇవ్వలేం. మనకు మనమే శుభ్రం చేసుకోవాలి. హ్యాపీ 'దీపావళి క్లీనింగ్'. చీర్స్" అన్నారు.


కాజల్ అగర్వాల్

# దీపావళి... మనసుల్ని శుభ్రం చేసుకోవాలి!

# నాని సమర్పణలో 'హిట్'


రుహానీ శర్మ, విశ్వక్‌సేన్, నాని

వాల్ పోస్టర్ సినిమా నిర్మాణ సంస్థను స్థాపించిన హీరో నాని, తొలి ప్రయత్నంగా 'ఆ!' చిత్రాన్ని నిర్మించారు. విలక్షణ చిత్రాన్ని ప్రేక్షకులకు అందించారు. మలి ప్రయత్నంగా 'హిట్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'ఫలక్‌నుమా దాస్' ఫేమ్ విశ్వక్‌సేన్, 'చిలసౌ' ఫేమ్ రుహానీ శర్మ జంటగా నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి త్రిపురనేని నిర్మిస్తున్న చిత్రమిది. శైలేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా కార్యక్రమాలతో గురువారం ప్రారంభమైంది చిత్రం. "ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తాం" అని చిత్రబృందం తెలిపింది. వివేక్‌సాగర్ సంగీతమందిస్తున్న ఈ చిత్రానికి ఎస్.మణికందన్ ఛాయాగ్రాహకుడు.


రాహుల్ రామకృష్ణ, నవీన్ పోలిశెట్టి, ప్రియదర్శి

# ఖైదీ రత్నాలు!

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' ఫేమ్ నవీన్ పోలిశెట్టి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన తారాగణంగా స్వప్న సినిమాస్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'జాతి రత్నాలు'. అనుదీప్ కేవీ దర్శకుడు. 'మహానటి' దర్శకుడు నాగఅశ్విన్ ఈ చిత్రంతో నిర్మాతగా మారారు. చిత్రీకరణ 75 శాతం పూర్తయింది. వచ్చే ఏడాది సినిమా విడుదల కానుంది. 'సత్ప్రవర్తన వల్ల త్వరగా విడుదలవుతున్న మావాళ్లు' అంటూ ఖైదీ దుస్తుల్లో ఉన్న ప్రధాన తారాగణం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ గురువారం విడుదల చేశారు. ముగ్గురు యువకులు జైలుకు ఎందుకు వెళ్లారు? అక్కణ్ణుంచి ఎలా తప్పించుకున్నారు? అనే అంశాలను వినోదాత్మకంగా చూపిస్తూ చిత్రాన్ని తెరకెక్కించారట! ఫరియా అబ్దుల్లా, మురళీ శర్మ, వీకే నరేశ్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, 'శుభలేఖ' సుధాకర్, 'వెన్నెల' కిశోర్ తదితరులు నటిస్తున్నారు.

# నువ్వే హీరో!

తరుణ్ భాస్కర్ హీరోగా షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నిర్మించిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. అనసూయ భరద్వాజ్, అభినవ్ గోమటం, పావనీ గంగిరెడ్డి, వాణీ భోజన్ అవంతికా మిశ్రా ప్రధాన తారాగణం. శివకుమార్ సంగీత దర్శకుడు. సినిమా ప్రమోషనల్ సాంగ్ 'నువ్వే హీరో'ను విజయ్ దేవరకొండ అభిమానుల సమక్షంలో విడుదల చేశారు. "ఈ పాటలో నాతో పాటు తరుణ్, అభినవ్ స్టెప్పులు వేయాలి. కొన్ని సమస్యల వల్ల కుదరలేదు.


విజయ్ దేవరకొండ, ఉమేశ్ గుప్తా

కొత్తవారితో నేను చేస్తున్న ఈ ప్రయత్నానికి ఆదిత్య మ్యూజిక్ ఉమేశ్ గుప్తాగారు అందిస్తున్న సహకారం మరువలేను. నవంబర్ 1న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని విజయ్ దేవరకొండ అన్నారు. "గీతా గోవిందం, ట్యాక్సీవాలా ఆడియోలు మా ఆదిత్య సంస్థ ద్వారా విడుదల చేశాం. మాపై నమ్మకంతో ఈ సినిమా ఆడియో రైట్స్ ఇచ్చిన విజయ్ దేవరకొండకు థ్యాంక్స్" అని ఉమేశ్ గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం తదితరులు పాల్గొన్నారు.

# ఫినామినల్ లవ్ స్టోరీ..


సాయిజ, తరుణీసింగ్

కల్వకోట సాయిజ, తరుణీసింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'శివన్'. 'ది ఫినామినల్ లవ్ స్టోరీ' అన్నది ట్యాగ్ లైన్. ఎస్.ఆర్ సినీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సంతోష్ రెడ్డి లింగాల నిర్మిస్తున్నారు. శివన్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. శుక్రవారం ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "చక్కని ప్రేమకథా చిత్రమిది. టీజర్‌లో కొంత బోల్డ్ కంటెంట్ ఉంది. కానీ ట్రైలర్ అలా ఉండదు. కుటుంబ సమేతంగా చూసేలా సినిమా ఉంటుంది" అని చెప్పారు. సినిమా బాగా వచ్చింది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి సినిమా విడుదల చేస్తాం" అని నిర్మాత అన్నారు.


బిత్తిరి సత్తి

# సినిమాకు ప్రాంతీయ భాషా భేదాలుండవు

- 'రసమయి' బాలకిషన్

"నా దృష్టిలో సినిమాకు ప్రాంతం, భాషా భేదాలు ఉండవు. అలాగే సినిమాల్లో చిన్న, పెద్ద అనే తేడా కూడా ఉండదు. ప్రేక్షకులు ఆదరించిన ప్రతి సినిమా పెద్దదే! 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆయన కథను ప్రాంతాలతో సంబంధం లేకుండా అందరూ ఆదరించారు" అని 'రసమయి' బాలకిషన్ అన్నారు. ఆయన కథ అందించి నిర్మించిన చిత్రం 'తుపాకి రాముడు'. ప్రభాకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. సినిమాకు వస్తున్న స్పందన గురించి నిర్మాత 'రసమయి' బాలకిషన్ మాట్లాడుతూ "ఎదుటివాడి ఆనందంలోనే తన ఆనందం వెతుక్కునే 'తుపాకి రాముడి' కథ ఇది. ఒకరు ఏడిస్తే ఇతనికి ఆకలవుతుంది. అదే వ్యక్తి నవ్వితే అతని కడుపు నిండుతుంది. అటువంటి మంచి మనసున్న వ్యక్తి జీవితాన్ని చక్కని ప్రేమకథగా మలిచాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చక్కగా చూపించాం. మనం ఓ ప్రాంతంలో నివసిస్తుంటే అక్కడ అనేక రకాల మనుషులు, పండుగలు, వారి మధ్య ప్రేమ ఆప్యాయతలు, అసూయలు, కులాలు ఉంటాయి. వాటన్నింటినీ బేరీజు వేసుకుని రూపొందించాం. విడుదలయ్యాక ప్రేక్షకులకు సినిమాలో ఉన్న అన్ని అంశాలూ నచ్చాయి. పాటలు కూడా చక్కని ఆదరణ పొందాయి. రెండేళ్ల క్రితం నేను రాసిన కథ ఇది. గతంలో 'యమలోకంలో జై తెలంగాణ' సినిమాకు దర్శకత్వం వహించా. ఇది కూడా నేనే చేద్దాం అనుకున్నా కానీ పని ఒత్తిడి, ఎలక్షన్ల కారణంగా పక్కనపెట్టా. కాస్త ఫ్రీ అయ్యాక పూర్తి కథను ప్రభాకర్ చేతిలో పెట్టి సినిమా తీయమన్నా. అతను నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి సినిమా తీశాడు. బిత్తిరి సత్తి 'తుపాకి రాముడు' పాత్రకు యాప్ట్ అవుతాడనిపించింది అతన్ని హీరోగా పెట్టాం.











విజయగాథ

రసాయనాలు ఉపయోగించి పండించిన ఆకుకూరలు, పండ్లు అనారోగ్యానికి కారణం అవుతున్నాయి. ఫలితంగా సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలకు మంచి డిమాండ్ ఏర్పడుతున్నది. దశపత్ర మిశ్రమంతో ఆకుకూరలు పండిస్తూ, ఆ పంటను హైదరాబాద్‌లోని ఆర్గానిక్ స్టోర్‌లకు విక్రయించి మంచి లాభాలు గడిస్తున్నారు తెనాలికి చెందిన కౌలు రైతు రమేష్.

# దశపత్రతో పచ్చని సేద్యం

● సేంద్రియ పద్ధతిలో ఆకుకూరల సాగు ● నిత్యం ఆదాయం ఆర్జిస్తున్న తెనాలి రైతు

ఈ రైతు పేరు రమేష్. గుంటూరు జిల్లా తెనాలి స్వస్థలం. 15 ఏళ్ల నుంచి తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని దమ్మాయిగూడ గ్రామంలో నివాసం ఉంటున్నారు. కొంతకాలం ఎలక్ట్రిషియన్‌గా పనిచేశారు. అందులో సంతృప్తి లభించలేదు. మహబూబ్‌నగర్‌లో సేంద్రియ వ్యవసాయం చేసే 60 ఏళ్ల రైతు మనోహర్‌చారి పరిచయం అయ్యారు. చారి వ్యవసాయం చేసే విధానాన్ని దగ్గరుండి పరిశీలించారు... మెళకువలు నేర్చుకున్నారు. ఎలక్ట్రిషియన్ పని వదిలేసి, సేంద్రియ వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఏడాది క్రితం కీసర మండలం గోధుమకుంట గ్రామంలో కొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. ఏమాత్రం రసాయనాలు ఉపయోగించకుండా, పూర్తి సేంద్రియ పద్ధతిలో ఆకుకూరల సాగు చేయాలని సంకల్పించారు. దశపర్ణిమ ద్రావణంతో పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనాతో పాటు పలు రకాల ఆకుకూరలు పండించడం మొదలుపెట్టారు. మొదట్లో పంటను మార్కెటింగ్ చేయడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎరువులు, రసాయనాలు వాడకుండా పండిస్తున్న పంటలను ప్రజలు బాగా ఆదరించడం మొదలుపెట్టారు. దీంతో ఈ రైతు సాగు చేసిన ఆకుకూరలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆర్గానిక్ సంస్థలు నేరుగా రమేష్ పొలం దగ్గరకే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నాయి. సేంద్రియ ఎరువు తయారీ మొదలుకుని పండిన పంటను మార్కెటింగ్ చేసే వరకు భార్య మల్లీశ్వరి సహకారంతో అన్ని పనులు రమేష్ స్వయంగా చూసుకుంటున్నారు. కూలీల కొరత తీవ్రంగా ఉందని, కూలీలు దొరికితే మరింత విస్తీర్ణంలో ఆకుకూరలు సాగు చేసే అవకాశం ఉందంటారు రమేష్.



### దశపత్ర అంటే... ?

దశపర్ణిమ లేదా దశపత్ర అంటే పది ఆకులతో కలిసిన మిశ్రమం. ఈ మిశ్రమాన్ని 200 లీటర్ల నీళ్లలో జీవామృతం, ఆవుపేడతో 40 రోజులు నిల్వ చేయాలి. అనంతరం కేజీ వెల్లుల్లి, కేజీ అల్లం, కేజీ కారాన్ని దశపర్ణిమ, జీవామృతం మిశ్రమంలో కలిపి తైవాన్ స్ప్రే ద్వారా వారానికి రెండుసార్లు పంటలకు పిచికారీ చేయాలి. దీనివల్ల మొక్కలు ఏపుగా ఎదిగి, చీడపీడలు రాకుండా ఉంటాయి. దశపత్ర మిశ్రమం అంటే... వేప, కానుగ, ఉమ్మెత్త, అత్తాకోడళ్లు, జిల్లేడు, వావిలాకు, రబ్బరాకు, ఇక్లేన్, జామ, బొప్పాయి.. ఈ పది ఆకులను 20 కేజీల వరకు తీసుకొని మొదట మిశ్రమంగా చెయ్యాలి. దీనిని డ్రమ్ముల్లో 200 లీటర్ల నీళ్లలో జీవామృతం, పేడ వేసి బాగా కలపాలి. దాన్ని 40 రోజులు నిల్వ ఉంచాలి. అనంతరం డ్రమ్ములో తెల్లటి రంగులో మిశ్రమం పేరుకుంటుంది. అలా పేరుకుపోయిన దానిని తొలగించాలి. ఆ మిశ్రమంలో అల్లం, వెల్లుల్లి, కారం కిలో చొప్పున కలిపితే దశపర్ణిమ తయారవుతుంది. దీనిని వారానికి రెండుసార్లు పంటలకు తైవాన్ స్ప్రే ద్వారా పిచికారీ చేయాలి. దీంతో చీడపీడలు నివారణవుతాయి. విత్తనాలు నాటే ముందు యూరియా బదులు ఆముదం పిండి చల్లితే మొక్కలకు బలం చేకూరుతుందన్నారు రైతు రమేష్.

### ఎల్.ఏ.బీతో చేనుకు చేవ

పంట ఆరోగ్యంగా ఎదిగేందుకు ల్యాబిక్ ఆసిడ్ బాక్టీరియా (ఎల్.ఏ.బీ) వాడుతున్నారు రమేష్. ఒకసారి కడిగిన బియ్యం నీరు లీటరు తీసుకొని 20 లీటర్ల సామర్థ్యం గల ప్లాస్టిక్ డబ్బాలో 4 రోజుల పాటు నిల్వ చేసుకోవాలి. 5వ రోజు లీటరు ఆవుపాలు తీసుకొని నిల్వ చేసిన నీటిలో కలపాలి. దానిపై తెల్లటిగుడ్డ కడితే 8వ రోజుకు ఎల్.ఏ.బీ తయారవుతుంది. అలా తయారైన ఎల్.ఏ.బీని పంటలకు పట్టిస్తే తెగుళ్ల నివారణ అవడంతో పాటు దిగుబడి అధికంగా వస్తుంది. ఇలా తయారు చేసిన ఎల్.ఏ.బీ నాలుగు రోజుల తరువాత ఉపయోగించే అవకాశం ఉండదు. అలాకాకుండా ఇంతకుముందు తయారుచేసుకున్న మిశ్రమంలో బెల్లం కలిపితే 6 నెలల పాటు ల్యాబిక్ బ్యాక్టీరియా నిల్వ ఉంటుందన్నారు రైతు.

- ఆంధ్రజ్యోతి, కీసర



### నెలకు రూ.40వేల ఆదాయం

మన చుట్టూ రోజూ కనబడే ఆకులతో ఎన్నో లాభాలు ఉన్నాయి. మనోహర్‌చారి వద్ద ఏ ఆకులతో ఎలాంటి ప్రయోజనం ఉంటుందో తెలుసుకున్నాను. ఆకుల కషాయాలతో, ఎటువంటి పురుగు మందులు ఉపయోగించకుండా ఆకుకూరలు పండిస్తున్నాను. హైదరాబాద్‌కు చేరువలో ఉండటంతో సేంద్రియ ఉత్పత్తులు విక్రయించే సంస్థలు ప్రతి మంగళవారం, శనివారం పొలం దగ్గరకే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నాయి. ఖర్చులు పోను నెలకు 40 వేల రూపాయల ఆదాయం సమకూరుతున్నది.

- రమేష్, కౌలు రైతు

నిపుణుల మాట



రాష్ట్ర వ్యాప్తంగా 2 - 3 వారాల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మిరప మొక్కలు ఉరకేస్తున్నాయి. అధిక వర్షాల తరువాత మిరప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానవన శాఖ గుంటూరు జిల్లా డీడీ ఎన్.సుజాత వివరించారు.

- పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలి.
- ఉరకెత్తిన పొలాలు వెంటనే తేరుకోడానికి లీటరు నీటికి పది గ్రాముల యూరియా, పది గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల్లో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- మొక్కలు వడబడి తలలు వాలిపోతే లీటరు నీటికి ఐదుగ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఉన్నందున పది లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని చల్లాలి. వేరు కుళ్లు ఆశించిన చేలలో సీవోసి 30 గ్రా., లేదా కార్బన్‌డిజం 10 గ్రా., చొప్పున పది లీటర్ల నీటిలో కలిపి ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.
- కానోఫోరా కొమ్మ ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కానోఫోరా కొమ్మ కుళ్లు ముసురు వాతావరణంలో ఎక్కువగా వ్యాపిస్తుంది. 30 గ్రా., బ్లైటాక్స్ లేదా 20

# మిర్చి తోట ఉరకెత్తిందా?



గ్రా., కాపర్ హైడ్రాక్సైడ్‌ను ఒక గ్రాము ప్లాంటామైసిన్‌ను 10 లీటర్ల నీటికి కలిపి మొక్కలు బాగా తడిచేలా చల్లాలి.

పైన తెలిపిన జాగ్రత్తలు తీసుకుంటే మిరప పంటను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చని ఉద్యానవన శాఖ డీడీ ఎన్. సుజాత సూచించారు. వివరాలు కావాల్సిన మిరప రైతులు 79950 86774, 79950 86776, 79950 86775కు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆమె తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు

స్వాతి కార్తె
నవంబర్ 5 వరకు

# మిద్దెతోటను రక్షించే వల!



**పొలాల్లో పండిన పంటల్ని కోతుల నుంచి రక్షించుకోవడం పెద్ద సమస్యగా మారింది. ఆ సమస్యకు పరిష్కారాలేమిటో సూచిస్తున్నారు ప్రముఖ మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి.**



మిద్దెతోట

అక్టోబరు చివరిలోకి ప్రవేశించినా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత పదేళ్ల మిద్దెతోట అనుభవంలో ఇదే మొదటిసారి. ఇలా నిరంతరం వర్షాలు కురవడం. అయితే అనావృష్టి లేదా అతివృష్టి. అటు రైతులకు, ఇటు మిద్దెతోట రైతులకు కొంత ఇబ్బంది కలుగుతోంది. శీతాకాలం కూరగాయలు పంటలు పండించడానికి ఇది సరైన సమయం. కానీ వర్షాలు తగ్గుముఖం పట్టడం లేదు. అయినా ఏదోవిధంగా మడులు లేదా బెడ్స్ సిద్ధం చేసుకుని అవసరమైన అన్ని విత్తనాలు నాటుకోవాలి. ఎదిగి సిద్ధంగా ఉన్న నార్లను పెరికి నాటుకోవాలి. అశ్రద్ధ చెయ్యకూడదు. చలికాలం ప్రారంభమై, చలి ముదిరే లోగా మొక్కలు కాస్త ఎదిగివుండాలి. ఈ వారం ఒక ముఖ్య సమస్య, దాని పరిష్కారం గురించి తెలుసుకుందాం. గ్రామాలు, పట్టణాలలో కోతుల బెడద ఎక్కువ ఉంది. కోతులు అటు రైతుల పంటలను, ఇటు మిద్దెతోట, పెరటితోటల పంటలను తింటున్నాయి. అవి తినేది తక్కువ, పాడుచేసేది ఎక్కువ. అడవులను మనుషులు నాశనం చెయ్యడం వల్ల అవి ఆహారం, నీరు కోసం జనావాసాలకు వస్తున్నాయి. కోతుల సమస్య వల్ల చాలా గ్రామాల్లో కొన్ని రకాల పంటలను పండించడం లేదు. కూరగాయలు, మొక్కజొన్న, వేరుశనగ, పండ్లు వగైరా ఉత్పత్తి చెయ్యడం మానుకున్నారు. కోతులు తినని ఇతర పంటలు వేస్తున్నారు. దీనివల్ల ఆహార సమతూకం దెబ్బతింటుంది. చాలామంది మిద్దెతోటల, పెరటితోటల రైతులకు కూడా కోతుల సమస్య అధికంగానే ఉంది. ముందుగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం గురించి మాట్లాడుకుందాం. ప్రతి సంవత్సరం ప్రభుత్వం వర్షాకాలం ఆరంభంలో మొక్కల్లో ఎక్కువ భాగం పండ్ల మొక్కలను నాటించాలి. అటు అడవుల్లోను, ఇటు రోడ్ల పక్కన మూడు కాలాల్లో ఎప్పుడూ ఏదో రకం పండ్లను కాపు ఇచ్చే అనేక మొక్కలను నాటించాలి. దానివల్ల నిత్యం ఏదో కాయో, పండో కోతులకు దొరికి అవి జనావాసాల వైపు రాకుండా ఉంటాయి. ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించాలి. ఇక కోతుల సమస్యకు తాత్కాలిక పరిష్కారం గురించి తెలుసుకుందాం. మా గ్రామంలో ఒక రైతు ఈ సమస్యకు వలను పరిష్కారంగా ఎంచుకున్నాడు. మొక్కజొన్న పెరడు చుట్టూ ఈ వలను కట్టాడు. వలలో చిక్కుకుంటామన్న భయంతో కోతులు అటువైపు రాలేదు. పైరు రక్షించబడింది. మా మిద్దెతోటకు కూడా అరుదుగా ఒక కోతి వస్తుంది. నేను కూడా నైలాన్ వల ఒకటి కొన్నాను. అది పెద్ద చేపల వల. వెంట్రుకల వంటి సన్నని దారాలతో తయారుచేయబడింది. కిలో వల ధర రూ.750 నుంచి 800 వరకు అమ్ముతున్నారు. ఒక మామూలు మిద్దెతోట చుట్టూ కట్టడానికి కిలో వల సరిపోతుంది. మిద్దెమీద నాలుగువైపులా పిట్టగోడ చుట్టూ దీనిని వేలాడదీయాలి. అలా వేలాడదీయడానికి ఏదైనా నిలువుగా సపోర్టును బిగించాలి. మిద్దెతోటల్లో ఎలాగూ పిట్టగోడ చుట్టూ నిలువు పందిరి ఉంటుంది కనుక దానికి బయటివైపు కట్టాలి. నాలుగువైపులా కోతులు దూరకుండా కట్టాలి. వల కట్టిన వైపు తీగజాతులు పాకకుండా చూడాలి. మిద్దెమీద చెట్టుకొమ్మలుంటే కోతులు దూకే అవకాశం ఉంది. అందువల్ల అటువంటివి లేకుండా చూడాలి. వలలు నైలాన్ తాళ్లు అమ్మే షాపుల్లో లభిస్తాయి. లేకుంటే తెప్పించమని అడగాలి. నేను జమ్మికుంటలో కొనుక్కొచ్చాను. అందరికీ పరిచయం చెయ్యడం కోసం కూడా. కోతుల సమస్య ఉన్నవారు ప్రయత్నించదగింది ఈ 'వల' పరిష్కారం.

సలహా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చేస్తున్న వాతావరణాధారమైన వ్యవసాయ సలహాలు.

- ఆలస్యంగా నాట్లు వేసిన వరి పొలాల్లో ఉల్లికోడు ఆశించడానికి అవకాశం ఉంది. దీని నివారణకు ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు వేసుకోవాలి లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ముందుగా సాగు చేసిన వరిలో పాముపొడ తెగులు ఆశిస్తున్నది కావున సిఫారసు చేసిన మందులు

## వరికి ఉల్లికోడు ముప్పు



హెక్సాకొనజోల్ 5% ఇసి 2 మి.లీ., లేదా వాలిడామైసిన్ 3% ఎల్ 2 మి.లీ., లేదా అజాక్సిస్ట్రోబిన్ 23% ఎస్ ఒక మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- అక్టోబరు మాసంలో ప్రధానంగా దోమ ఆశించడానికి అవకాశం ఉన్నది. ముఖ్యంగా దోమపోటును తట్టుకోలేని రకాలకు సాగు చేసిన రైతులు దోమపోటు నివారణకు లీటరు నీటికి పైమెట్రోజిన్ 0.6 గ్రా. లేదా డైనోటేఫ్యూరాన్ 0.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ + ఇథిప్రోల్ 0.25 గ్రా. లేదా ఎసిఫెట్ 1.5 గ్రా. కలిపి పిచికారీ చేసుకోవాలి. దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే ఇథోఫెన్‌ప్రాక్స్ 2 మి.లీ., లేదా ఫెనుబ్యూకార్బ్ 2 మి.లీ., లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దోమ ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే పైన తెలిపిన పురుగు మందులలో ఒక మి.లీ., డైక్లోరోవాస్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పొడి వాతావరణం ఉన్నట్లయితే కంకినల్లి పెరిగే అవకాశముంది. నివారణకు ప్రొఫినోఫాస్ 2 మి.లీ., లేదా డైకోఫాల్ 5 మి.లీ., లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ఎండాకు తెగులు నివారణకు నీటి యాజమాన్యం తప్పనిసరి. వీలైనన్నిసార్లు నీటిని తీసివేసి కొత్త నీరు పెట్టుకోవాలి. అంకురం దశలో పొటాష్ 20 నుండి 25 కిలోలు ఎకరానికి వేసుకోవాలి.

## 3న సూపర్ నేపియర్ సాగుపై శిక్షణ

సమాచారం

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట సమీపంలోని కొర్నెపాడులో పశుగ్రాసం సాగు, ప్రధానంగా సూపర్ నేపియర్ గడ్డి సాగుపై నవంబర్ 3న శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో గన్నవరం పశువైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సి.హెచ్. వెంకట శేషయ్య, గుంటూరు జిల్లా పాడి రైతు విజయ్ శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా సూపర్ నేపియర్ కణుపులు ఉచితంగా పంపిణీ చేస్తామని రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వేంకటేశ్వర రావు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 97053 83666, 0863-2286255 నెంబర్లలో సంప్రదించవచ్చు.

సేంద్రియ పద్ధతిలో వంగ పంట సాగు చేసి అధిక లాభాలు గడించిన శ్రీకాకుళం రైతు సూరిబాబు ఇప్పుడు తాజాగా రసాయనాలు, ఎరువులు ఉపయోగించకుండా వరి సాగు చేస్తున్నారు. పంటలకు మంచి ధర వస్తే మరింత మంది రైతుల సేంద్రియం బాట పడతారంటున్నారాయన.



### మార్కెటింగ్ వసతి ఉంటే మేలు

ప్రకృతి వ్యవసాయంలో దిగుబడి ఖర్చు తక్కువ. నాణ్యమైన పంటలు ప్రజలకు అందిస్తున్నామనే ఆనందం వున్నా మేం పండించిన పంటలకు సరైన ధర రావడం లేదు. సేంద్రియ పంటలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి వాటిని ప్రజలకు విక్రయించాలి. పంటకు మంచి ధర పలికితే మరింత మంది సేంద్రియ సేద్యం చేస్తారు.

- బి. సూరిబాబు, రైతు

ఆంధ్రప్రదేశ్‌లో సేంద్రియ సేద్యం విస్తరిస్తోంది. నేలతల్లికి, ప్రజల ఆరోగ్యానికి కీడు చేసే క్రిమిసంహారకాలు, ఎరువులు ఉపయోగించి పండించే పంటల కంటే ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలను ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. దీంతో రైతులు సేంద్రియ సేద్యం బాట పడుతున్నారు. ఇదే క్రమంలో శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండం కొత్తవలస, నిమ్మతోర్లివాడ, కొరపాం, జి.కెవలస, సేపానుపేట గ్రామాల్లో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కొత్తవలస గ్రామానికి

# సేంద్రియ వంగ సాగు సూపర్

వైవిధ్యం

చెందిన యువరైతు బొడ్డేపల్లి సూరిబాబు ప్రకృతి విధానంలో వంగ సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. తనకున్న 40 సెంట్ల పొలంలో వంగ సాగు చేశారు ఆ రైతు. రెండెకరాల పొలంలో సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేసి మంచి దిగుబడులు సాధించారాయన. మొదట బీజామృతంతో విత్తన శుద్ధి చేశారు. వంగ సాగులో పురుగుల నివారణకు అగ్నిఅస్త్రం ప్రయోగించారు. భూసారం పెంపొందించేందుకు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వినియోగించారు. వంగ పంట సాగులో రైతులను అడుగడుగునా తెగుళ్లు ఇబ్బంది పెడతాయి. వాటిని అరికట్టేందుకు రైతులు విచక్షణారహితంగా రసాయనాలు కుమ్మరిస్తారు. ఈ రైతు మాత్రం ఒక్కసారి కూడా రసాయనాలు ఉపయోగించకుండా వంగలో చీడపీడలను అరికట్టడంతో పాటు అధిక దిగుబడులు సాధించారు. ఆరు నెలల పంట కాలంలో 40 సెంట్ల భూమిలో 40 వేల రూపాయలకు పైగా ఆదాయం ఆర్జించానని ఆయన వివరించారు. వంగతో పాటు సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేపట్టారు సూరిబాబు. వరి సాగులో తెల్ల దోమ నివారణకు తూటికాడ కషాయం ఉపయోగించినట్లు ఆ రైతు తెలిపారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంట బాగుందని, మంచి దిగుబడులు సాధిస్తానని ఆ రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పలు మండలాల్లో సేంద్రియ పద్ధతిలో సేద్యం చేస్తున్న రైతుల స్ఫూర్తితో మరింత మంది ప్రకృతి సేద్యం దిశగా అడుగులు వేయడం విశేషం.

### చీడపీడలపై అగ్నిఅస్త్రం

ఆవు మూత్రం 10 లీటర్లు, వెల్లుల్లి రసం అరకిలో, పచ్చిమిర్చి అరకేజి, పొగాకు కాడలు అరకిలో కలిపి నీటిలో నానపెట్టాలి. ఆ ద్రావణాన్ని పిచికారీ చేస్తే కాండం తొలుచు పురుగుల నివారణ అవుతుంది. అలాగే 4 వందల కిలోల ఆవుపేడ, 4 కిలోల బెల్లం, 4 కిలోల పప్పుపిండి, 40 లీటర్ల ఆవుమూత్రం కలిపి ఘన జీవామృతం తయారుచేసి పొలానికి అందిస్తే భూసారం గణనీయంగా పెరుగుతుంది. ఇక 200 లీటర్ల నీరు, 2 కిలోల బెల్లం, 2 కిలోల పిండి, 20 లీటర్ల ఆవుమూత్రం, పుట్టమట్టి 2 కిలోలు, ఆవుపేడ 10 కిలోలు కలిపి ద్రవ జీవామృతాన్ని తయారుచేసుకోవాలి. ఈ జీవామృతంతో భూసారం పెరుగుతుంది. 10 కిలోల తూటికాడ (గాలివాన ఆకు) ముద్ద, ఆవుపేడ 5 కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లు కలిపి 24 గంటలు ఊరబెట్టాలి. దాన్ని బాగా మరిగించి చల్లార్చిన తరువాత 12 లీటర్ల నీటిలో లీటరు కషాయ ద్రావణం కలిపి ఎకరాకు 10 ట్యాంకులు ద్రావణాన్ని పిచికారీ చేస్తే చీడపీడలు నివారణ కావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ఆ రైతు తెలిపారు.



## కేపీఐపీఎల్‌కు
# ఊరట!

- కృష్ణపట్నం భూములపై వారంపాటు యథాతథ స్థితి
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భూముల స్వాధీనం వివాదంలో కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (కేపీఐపీఎల్)కు హైకోర్టులో తక్షణ ఊరట లభించింది. కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల అభివృద్ధి కోసం నెల్లూరు జిల్లా కోట, చిల్లకూరు మండలాల్లో ఏపీఐఐసీ గతంలో కేటాయించిన భూముల వ్యవహారంలో వారం రోజులు యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పరిశ్రమల అభివృద్ధి కోసం గతంలో తమకు కేటాయించిన భూముల్ని వెనక్కి తీసుకుంటూ ఏపీఐఐసీ రాసిన లేఖను రద్దు చేయాలని, ఆ భూముల విషయంలో జోక్యం చేసుకోకుండా అడ్డుకోవాలని అభ్యర్థిస్తూ కేపీఐపీఎల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కె.గౌరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ టి.రజనీ ముందు విచారణ జరిగింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. "ఏపీఐఐసీతో జరిగిన ఒప్పందం మేరకు మూడు విక్రయ దస్తావేజుల ద్వారా 4731.15 ఎకరాల భూమిని రూ.65,07,97,000కు కేపీఐపీఎల్ కొనుగోలు చేసింది. ముందస్తు ఒప్పందం మేరకు మరికొంత భూమి పిటిషనర్‌కు అప్పగించాల్సి ఉంది. మొత్తం భూముల్ని పొందిన తర్వాతే పారిశ్రామికవాడకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని పలుమార్లు ఏపీఐఐసీని అభ్యర్థించినా ఫలితం లేకపోయింది" అని తెలిపారు. పైగా... గత సెప్టెంబరు 9వ తేదీన ఏపీఐఐసీ షోకాజ్ నోటీసు జారీ చేసిందన్నారు. మరికొంత గడువు కావాలని అభ్యర్థిస్తూ తాము లేఖ రాశామని... దీనిని పట్టించుకోకుండా ఏపీఐఐసీ ఈ నెల 11వ తేదీన తుది స్పందన కోరుతూ మరో లేఖ రాసిందని వివరించారు. "తగిన వివరణ ఇచ్చేందుకు మరో పది రోజులు గడువు కావాలని కోరినా పట్టించుకోకుండా భూముల కేటాయింపులను రద్దు చేస్తున్నట్లు ఈ నెల 19వ తేదీన లేఖ పంపింది. ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకే మాస్టర్ ప్లాన్ ఆమోదానికి అవసరమైన భూముల కేటాయింపు కోసం పిటిషనర్ వేచివున్న తరుణంలో ఆ కేటాయింపులను రద్దు చేస్తూ ఏపీఐఐసీ లేఖ రాయడం పూర్తి చట్టవిరుద్ధం" అని వివరించారు. ఈ వ్యవహారంపై తగిన వివరణతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ అభ్యర్థించారు. సంబంధిత భూముల్ని స్వాధీనం చేసుకున్నారా అని న్యాయమూర్తి అడుగగా, అడ్వొకేట్ జనరల్ అవునని సమాధానమిచ్చారు. దమ్మాలపాటి స్పందిస్తూ... ఆ భూములు తమ స్వాధీనంలోనే ఉన్నాయని తెలిపారు. దీంతో భూముల వ్యవహారంపై వారంపాటు యథాతథస్థితి కొనసాగించాలని న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను నవంబరు 1వ తేదీకి వాయిదా వేశారు.

### రవిప్రకాశ్‌కు బెయిలివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీవీ-9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. నకిలీ ఈమెయిల్ అడ్రస్ సృష్టించారనే అభియోగాలపై నమోదైన కేసులో బెయిలు మంజూరు చేయాలని కూకట్‌పల్లి తొమ్మిదో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌ను హైకోర్టు ఆదేశించింది.

# బీజేపీలోనే పురందేశ్వరి!

**రాజకీయాలకు దగ్గుబాటి దూరం!?**



ఒంగోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సీనియర్ రాజకీయ నాయకుడు, వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయంగా సైలెంట్ కానున్నారు. ఆయన సతీమణి, ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి బీజేపీలోనే కొనసాగనున్నారు. సీఎం జగన్ షరతు నేపథ్యంలో కుమారుడి రాజకీయ భవితవ్యంపై మల్లగుల్లాలు పడిన దగ్గుబాటి చివరికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అమెరికా నుంచి పురందేశ్వరి గురువారం హైదరాబాద్ చేరారు. కుటుంబ సభ్యుల సమావేశం అనంతరం పై నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. భవిష్యత్ కార్యాచరణపై నియోజకవర్గంలోని దగ్గుబాటి అనుచరులు శనివారం పర్చూరులో సమావేశం కాబోతున్నారు. కుమారుడు హితేష్ రాజకీయ భవితవ్యం కోసమే తాను ఆలోచించానని, అయితే తన కోసం మీరు ఆత్మాభిమానాన్ని చంపుకోవద్దని హితేశ్ కన్నీటి పర్యంతమయ్యాడని తన ముఖ్య అనుచరులతో చెప్పినట్లు తెలిసింది. పరిస్థితులన్నింటినీ పరిశీలించిన తర్వాత తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండటమే సమంజసమన్న నిర్ణయానికి వచ్చినట్లుగా దగ్గుబాటి చెప్పారని తెలిసింది. అలాగే ఈ పరిణామాలన్నింటినీ వివరిస్తూ ప్రజలకు లేఖ రాయాలని దగ్గుబాటి భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# అధ్వానంగా జగన్ పాలన

- రాష్ట్రం నివేదిక అందాకే పోలవరంపై స్పష్టత
- కార్మికులకు రూ.10 వేలు పింఛనివ్వాలి
- రాజధానిపై గందరగోళానికి సీఎం తెర దించాలి
- ఆంధ్ర, తెలంగాణలో పొత్తులుండవు
- దోచుకోవడంలో టీడీపీ, వైసీపీ క్విడ్ ప్రో కో
- కన్నా, సుజనా, విష్ణువర్దన్‌రెడ్డి విమర్శ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): వైసీపీ, టీడీపీపై విమర్శలు.. రాష్ట్రాభివృద్ధికి బీజేపీనే గత్యంతరమంటూ వివరణ.. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కమలానిదే అన్న ప్రకటన.. అడపాదడపా కాంగ్రె‌స్‌ను దుమ్మెత్తిపోయడం.. ఇదీ బీజేపీ నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ సంకల్ప యాత్రలో ఆ పార్టీ నేతల ప్రసంగాలు తీరు. శుక్రవారం నెల్లూరు జిల్లా ముత్తుకూరులో జరిగిన యాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఒంగోలులో రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి పాల్గొన్నారు. 'టీడీపీని విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలన అధ్వానంగా ఉంది. ఈ రెండూ పార్టీలూ ఎవరు ఎక్కువ.. ఎవరు తక్కువ అనుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలను, సంక్షేమాన్ని వదిలేశాయి' అని కన్నా విమర్శించారు. సాంకేతికంగా హోదా ఇవ్వడం సాధ్య పడదని స్పష్టం చేశారు. ఈ విషయం రాజకీయ పార్టీలకు తెలిసినా ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. పోలవరంపై కేంద్రం నివేదిక ఇవ్వాలని కోరిందన్నారు. అది వచ్చిన వెంటనే పోలవరాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్మించాలా!? రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలా!? అన్నది స్పష్టమవుతుందని తెలిపారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న జగన్.. కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించడం ఏమిటని ప్రశ్నించారని గుర్తుచేశారు. మరి దానిపై ఇప్పుడేమంటారో చెప్పాలన్నారు. రాష్ట్రప్రభుత్వ తీరువల్లే ఇసుక కొరత ఏర్పడిందని విమర్శించారు. ఇసుక కొరతతో నష్టపోయిన కార్మికులందరికీ రూ.10వేలు పింఛను ఇవ్వాలని కన్నా డిమాండ్ చేశారు. గుంటూరు, ఒంగోలులో సుజనా మాట్లాడారు. రాజధానిపై గందరగోళం ఏర్పడిన మాట నిజమేనని, దానికి తెర దించడానికి సీఎం జగన్ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. దేశంలో అవసరార్థం మాత్రమే ప్రాంతీయ పార్టీలతో చేతులు కలుపుతున్నామని అన్న సుజనా.. ఆంధ్ర, తెలంగాణలో మాత్రం ఎవరితోనూ పొత్తులు ఉండవన్నారు. రాష్ట్రంలో 1995 నుంచీ మాజీ సీఎం చంద్రబాబు, దివంగత వైఎస్సార్ కుటుంబాలదే అధికారం నడిచిందన్నారు. వారిరువురి మధ్యా అవినీతి, అధికారంలో తేడా లేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీ తన కార్యకర్తలకు లక్ష ఉద్యోగాలను ఇచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ విఫలం కావడం వల్లనే ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయని చెప్పారు. ప్రస్తుతం వాటికి కాలం చెల్లిందని తేల్చి చెప్పారు. రాజమహేంద్రవరం మీడియా సమావేశంలో విష్ణువర్ధన్ రెడ్డి.. పోలవరాన్ని పూర్తిచేసే బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీదేనని, దీనిలో అనుమానాలకు తావేలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీడీపీ బాటలోనే వైసీపీ నడుస్తోందని అన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసేలా హామీలు ఇచ్చుకుంటూ వెళ్తున్నారని విమర్శించారు. టీడీపీని బతికించుకోవడానికి మాజీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ పలు విన్యాసాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ, టీడీపీ రెండూ క్విడ్ ప్రో కో లాంటివని... ఐదేళ్లు వారు దోచుకుంటే ఇప్పుడు మా వంతు అన్నట్లుగా వీరు వ్యవహరిస్తున్నారని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు.

## పారదర్శకత ఉంటేనే ఆ పోస్టుల భర్తీ

- అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై విచారణ కమిటీ వేస్తాం: మంత్రి సురేశ్

తాడేపల్లిగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 1100 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల నియామకం పారదర్శకంగా జరినట్లు తేలితేనే వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రకటించారు. ఆ నియామక ప్రక్రియపై విచారణకు కమిటీ వేస్తామని చెప్పారు. తాడేపల్లిగూడెంలో ఆదికవి నన్నయ పీజీ క్యాంపస్‌లో బీ ఫార్మసీ భవనానికి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో భోదనకు ఇబ్బంది లేకుండా పార్ట్‌టైమ్ సిబ్బందితో భర్తీ చేస్తామని తెలిపారు.

**ఏపీ నిట్‌కు అండగా...:** ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి సురేశ్ స్పష్టం చేశారు. ఏపీ నిట్‌లో శుక్రవారం ల్యాబ్ 2 కాంప్లెక్స్‌కి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించారు. దేశంలోనే ఇతర నిట్‌లు, ఐఐటీలతో ఏపీ నిట్ విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. ప్రతీ విద్యార్థి ఏపీ నిట్ నుంచి 20 లక్షల వేతనాలతో బయటకు వెళ్లాలని ఆకాంక్షించారు. నిట్‌లో చేరితే ఉద్యోగం గ్యారేంటి అన్న భరోసా ఉంటుందని ఆయన తెలిపారు. మంత్రులు చెరుకువాడ రంగరాజు, తానేటి వనిత, నిట్ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశరావు, ఎంపీ రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## సుజనాపై ఫిర్యాదు చేస్తాం: బాలశౌరి

విజయవాడ, అక్టోబరు 25: రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి వ్యవహార శైలిపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేస్తామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు అండగా ఉండేందుకే ఆయన బీజేపీలో చేరారని, రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసిన సుజనా.. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భేటీ వివరాలను అధికారికంగా కేంద్ర ప్రభుత్వం లేదా బీజేపీ ప్రకటిస్తుందని అన్నారు. సీఎం జగన్, అమిత్‌షా భేటీ వివరాలను జీవీఎల్ నరసింహారావు అదేరోజు వివరించారని, చంద్రబాబు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న సుజనాచౌదరి వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్నారు. వైసీపీ ఎంపీలంతా కలిసి.. సుజనా చౌదరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. బ్యాంకులను మోసం చేసి వేలాది కోట్లు ఎగనామం పెట్టిన సుజన వంటి వ్యక్తులు చట్టసభల్లోకి రాకుండా ఉండేలా ప్రైవేట్ బిల్లును పార్లమెంట్‌లో పెడతామన్నారు.

# రైతన్నకు వాన కష్టం

- 21వేల ఎకరాల్లో వరి పంట మునక
- పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం
- బొమ్మిక జలాశయానికి గండి
- వరద నీటిలో సంగమేశ్వర ఆలయం
- విజయనగరంలో పంటనష్టం 25కోట్లు
- విశాఖలో విరిగిపడుతున్న కొండచరియలు



బందరువానిపేటలో నీటిలోనే భోజనం ప్లేట్లను పట్టుకెళ్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం/విజయనగరం/విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలు రైతును నిలువునా ముంచాయి. వేలాది ఎకరాల్లో పంట వాన నీటిలో నానుతుండటంతో అన్నదాతలు భోరుమంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వర్షాలు శుక్రవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. వీటి ప్రభావంతో వేలాది ఎకరాలు నీటమునిగియాయి. పొట్ట దశలో ఉన్న వరి పంట నీటిలో నానిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 13వేల ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా. బూర్జ మండలానికి ప్రధాన ఆయకట్టుగా ఉన్న బొమ్మిక జలాశయానికి గండి పడటంతో సమీప పంటపొలాలన్నీ నీటమునిగాయి. వంగర మండలం సంగంలోని సంగమేశ్వరాలయం వరదనీటిలో మునిగిపోయింది. పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు వర్షపు నీటితో నిండిపోయాయి. గార మండలం బందరువానిపేట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నీరు నిలిచిపోవడంతో భోజనం పేట్లను చేత్తో పట్టుకొని విద్యార్థులు వర్షపు నీటిలో తరగతి గదులకు చేరుకోవాల్సి వచ్చింది. విజయనగరం జిల్లాలో భారీ వర్షాలకు రూ.25కోట్ల విలువైన పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. 8వేల ఎకరాల్లో వరి, 1260 ఎకరాల్లో మొక్కజొన్న, 2750 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నాయి. భారీవర్షాలకు విశాఖ జిల్లాలో పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. నగర పరిధిలోని తెన్నేటి పార్కు వద్ద, యారాడ, సింహాచలం మైక్రోవేవ్ స్టేషన్ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. భారీవర్షాల కారణంగా వస్తున్న వరదకు విశాఖపట్నం జిల్లా దేవరాపల్లి సమీపంలో శారదా నదిపై నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే కొట్టుకుపోయింది. రైవాడ జలాశయం గేట్లు ఎత్తివేయడంతో ఒక్కసారిగా ప్రవాహం పెరగడంతో అనంతగిరి, దేవరాపల్లి, హుకుంపేట మండలాల్లో 200 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

### ముంచెత్తిన ఏలేరు

గొల్లప్రోలు/పిఠాపురం: ఏలేరు వరద ముంచెత్తింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, దిగువ ప్రాంతాలను అప్రమత్తం చేయకుండా 19వేల క్యూసెక్కులకు పైగా వరద నీటిని రిజర్వాయర్ నుంచి విడుదల చేయడంతో ఏలేరు, పీబీసీ పరిధిలో సుమారు 15వేల ఎకరాల్లోని వరి, చెరకు, పత్తి, కాయగూరల పంటలు ముంపులో చిక్కుకున్నాయి. గొల్లప్రోలు-పిఠాపురం పట్టణాల మధ్య గల జాతీయరహదారిపై మూడు ప్రాంతాల్లో, గోకివాడ రహదారిపై ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. పిఠాపురం శివారులో జాతీయరహదారి, పొలాలు ఏకమై జలాశయాన్ని తలపిస్తున్నాయి. వరద ఉధృతికి ఏలేరుతో పాటు పీబీసీ కాలువలకు పదికి పైగా ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. పంటలన్నీ నీట మునిగాయి. గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల చుట్టూ వరద నీరు చేరింది. గొల్లప్రోలులోని 3,500కు పైగా గృహాలు ముంపులోకి చిక్కుకున్నాయి.

### కోస్తాకు వర్షసూచన

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడింది. దానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో కోస్తాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## శ్రీశైలానికి తగ్గిన వరద

**డ్యాంకు 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. ప్రకాశం బ్యారేజీ 70గేట్లు ఎత్తివేత**

శ్రీశైలం/ఆదోని/విజయవాడ, అక్టోబరు 25: శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. గురువారం జలాశయానికి 6.63లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అది శుక్రవారం 3.11లక్షల క్యూసెక్కులకు తగ్గింది. శుక్రవారం సాయంత్రం 6గంటలకు డ్యాం నీటిమట్టం 884.30 అడుగులు, జలాశయ నీటినిల్వ సామర్థ్యం 211.4759 టీఎంసీలుగా నమోదయ్యాయి. డ్యాం 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను 20 అడుగుల మేర ఎత్తి 4,73,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం జలాశయం నుంచి ఔట్‌ఫ్లో 5,41,012 క్యూసెక్కులు ఉంది. తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. డ్యాం 12గేట్లు ఎత్తి 40వేల క్యూసెక్కులు నదికి వదులుతున్నారు. కాగా, పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి శుక్రవారం 6,03,380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. బ్యారేజీ 70 గేట్లు పూర్తిస్థాయిలో ఎత్తి 5,98,793 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల

### శ్రీశైలం డ్యాం ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు

శ్రీశైలం డ్యాం వద్ద ఘాట్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం కొండచరియలు విరిగిపడ్డాయి. శ్రీశైలానికి భారీ వరద కొనసాగుతుండడంతో డ్యాం 10 క్రస్ట్‌గేట్లను 20 అడుగుల మేర ఎత్తు ఎత్తి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం క్రస్ట్‌గేట్ల నుంచి జాలువారే కృష్ణమ్మ పరవళ్లతో డ్యాం వద్ద భారీ వర్షం పడుతున్నట్లు జల్లు కురుస్తోంది. ఈ నేపథ్యంలో డ్యాం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. కొండచరియలు రోడ్డుపై పడడంతో తెలంగాణ నుంచి శ్రీశైలానికి వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం అధికారులు రాళ్లను రోడ్డుపక్కకు తీసివేయడంతో వాహనాల రాకపోకలు సాగించాయి.

## 151 సీట్లిచ్చిన ప్రజలే..
# దెబ్బ కొడతారు!

(మొదటి పేజీ తరువాయి)

దుకాణాల కార్మికుల సంఘం నేతలు, జనసేన లీగల్ సెల్ సభ్యులతో విడివిడిగా సమావేశమైన ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ హయాంలో ఇసుక మాఫియా రాజ్యమేలిందని.. వైసీపీ ప్రభుత్వం కూడా మాఫియాను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. అస్తవ్యస్త విధానాల మూలంగా లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, వాహన యజమానులు రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 లక్షల మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కనీసం బియ్యం తెచ్చుకోవడానికి డబ్బులేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పది మందికి పని కల్పించాల్సిన మేస్త్రీలు కూడా పస్తులుంటున్నారని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే 3వ తేదీన విశాఖలో లాంగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. '15 రోజుల్లో ప్రకటిస్తామన్న ఇసుక పాలసీ 45 రోజులైనా, మూడు నెలలైనా, 100 రోజులు దాటేసినా అతీగతీలేదు. ఈ రోజుకీ ఇసుక విధానంపై ప్రభుత్వానికి స్పష్టత లేదు. మన ఇసుక మనకు దొరకడం లేదు. కానీ బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో దర్శనమిస్తోంది. ఆన్‌లైన్ సిస్టమ్‌లో కూడా చాలా అవకతవకలు జరుగుతున్నాయి. దొంగల్లా అర్ధరాత్రి 12 గంటలకు తెరుస్తున్నారు' అని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇసుక రవాణాపై ఆధారపడి ఉన్న ఆరు వేల లారీలకే పనుల్లేకుంటే మరో ఆరు వేల లారీలను రంగంలోకి దించుతూ జీవో 486 విడుదల చేయడాన్ని తప్పుబట్టారు. ఎవరి లబ్ధి కోసం ఈ ప్రయత్నమని నిలదీశారు. 'ఆ లారీలపై జీఎస్టీ తగ్గించాలనడం సరికాదు. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. రేపు మిగతా రాష్ట్రాలూ ఇదే అనుసరిస్తే కేంద్రం నిధుల్లో కోతపడుతుంది. కేంద్రానికి కూడా ఆదాయం తగ్గుతుంది. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి, జీఎస్టీ కౌన్సిల్, అమిత్ షా దృష్టికి తీసుకెళ్తాం' అని స్పష్టం చేశారు. 10 మందికి ఉద్యోగం కల్పించడం కోసం పది వేల మందిని తీసేస్తున్నారని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

### రాజధానిపై వెటకారమా?

'రాష్ట్రానికి రాజధాని ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి. రాజధానిపై మంత్రి బొత్స సత్యనారాయణ వెటకారంగా మాట్లాడుతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు కోట్లాది మంది ప్రజలు ప్రభావితులవుతారన్న విషయం మరచిపోతున్నారు. టీడీపీపై కోపతాపాలుంటే వేరేలా చూపించుకోవాలి. హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయడానికి మద్దతివ్వాలంటూ రాయలసీమకు చెందిన లాయర్లు వచ్చి నన్ను కలిశారు. ఇప్పటి వరకూ సీమ నుంచే ఎక్కువ మంది ముఖ్యమంత్రులు వచ్చారు.. అయినా ఆ ప్రాంత సమస్యలు తీరలేదు. ప్రస్తుత హైకోర్టు పరిసరాల్లో టీ కూడా దొరికే పరిస్థితి లేదు. రాజధాని కడతారా లేదా..? రాయలసీమకు హైకోర్టు తరలిస్తారా.. అన్న విషయాలపై స్పష్టంగా చెప్పాలి. అంబటి రాంబాబు కామెంట్స్ కూడా నా దృష్టికి వచ్చాయి. ఆయనంటే నాకు గౌరవం ఉంది. కానీ మాట్లాడేటప్పుడు పద్ధతిగా మాట్లాడాలి. ఎన్నికలు ఐదేళ్లు ఉన్నాయనుకుంటున్నారేమో.. కానీ ముందే రావచ్చు. అవన్నీ దృష్టిలో పెట్టుకుని మాట్లాడండి. భవన నిర్మాణ కార్మికులను సంక్షోభం నుంచి రక్షించడానికి ఏం చేస్తారో చెప్పండి. మీ ప్రభుత్వ విధానాల వల్ల వచ్చే ఏడాదంతా మేమంతా ప్రజల్లో ఉండి రోడ్లపై ఉద్యమాలు చేసే పరిస్థితి కనిపిస్తోంది.'

### పంట నష్టంపై అంచనాలేవీ?

'భారీ వర్షాలతో కోస్తా ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోయి కష్టాల్లో ఉన్నారు. ఇప్పటి వరకూ వ్యవసాయ, రెవెన్యూ శాఖలు నష్టంపై ప్రాథమిక అంచనాలకు కూడా రాలేకపోయాయంటే రైతులపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. వయసు ఎక్కువనే కారణంతో గతంలో పనిచేసిన 30 వేల మందిని కొత్త మద్యం షాపుల్లో ఉద్యోగాలకు అనర్హులను చేయడం భావ్యం కాదు. వారికి అండగా ఉంటాం. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వంలో జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం ఎక్కువైంది. కేసుల విషయంలో పార్టీ లీగల్ సెల్ కార్యకర్తలకు సహాయ సహకారాలు అందించాలి. ఆరు వారాల్లో ఒక్కొక్క పార్లమెంటు స్థానం పరిధి నుంచి 15 మంది న్యాయవాదులతో సమావేశమవుతా. అనంతరం కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపడతా. న్యాయవాదులకు ఇతర విభాగాల్లో కూడా స్థానం కల్పిస్తా.'

# లిటిల్స్

**చేసేయండి!**



## నూనె తాగిన చేప

**కావలసినవి**

● పొడవాటి తొట్టి ● నీళ్లు ● కత్తెర ● నూనె ● కాగితం

కాగితం మీద చేప బొమ్మ గీసి కత్తెరతో కత్తిరించండి. ఆకర్షణీయంగా కనిపించడం కోసం దానికి రంగు వేయండి. బొమ్మలో చూపిన విధంగా పొట్ట భాగంలో గుండ్రంగా కత్తిరించండి. ఆ భాగం నుంచి తోక వరకు కలుపుతూ కత్తిరించి ఆ ముక్క తీసేయండి. ఇప్పుడు చేప కింది భాగం నీళ్లలో, పై భాగం పొడిగా పై వైపునకు ఉండేలా పెట్టి చేప ఈదేలా చేయవచ్చు. ఎలాగంటే చేపకు ఆహారం పెట్టాలి. చేప పొట్ట భాగంలో నూనె చుక్కను వేయండి. ఇప్పుడు తమాషా చూడండి. నూనె చేప పొట్టలోకి చేరగానే నీళ్ల ఉపరితలంపై కదలడం మొదలుపెడుతుంది. ఇది ఎలా జరుగుతుందో తెలుసా? నూనె ఎంత వీలైతే అంత మేర పరుచుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఎందుకంటే నూనె సాంద్రత నీటి సాంద్రత కన్నా తక్కువ. కాబట్టి చేప పొట్టలోకి నూనె చేరగానే ఎంత సాధ్యమైతే అంత పరుచుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ క్రమంలో తోక వైపు కత్తిరించిన భాగం నుంచి బయటకు వస్తుంది. నూనె చేపను ముందుకు నెట్టి, ఆహారం పెట్టాక చేప కదిలిన అనుభూతిని కలిగిస్తుంది.

## సరైన నీడను గుర్తించండి?






ఏది భిన్నం?

## దారి కనుక్కోండి?



## చుక్కలు కలపండి



## డైలీ సుడోకు - 177

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 4 | 9 | | | 1 | |
| 1 | | 5 | | | 7 | | | 3 |
| 2 | | | | | 5 | 6 | | |
| 3 | | 1 | | 6 | | | | |
| | 5 | | | | | | 9 | |
| | | | | 5 | | 3 | | 7 |
| | | 6 | 9 | | | | | 8 |
| 9 | | | 3 | | | 5 | | 2 |
| | 2 | | | 4 | 8 | | | |

**సుడోకు- 176 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 3 | 6 | 8 | 4 | 7 | 9 | 1 | 5 |
| 7 | 1 | 9 | 5 | 3 | 6 | 4 | 8 | 2 |
| 8 | 5 | 4 | 1 | 2 | 9 | 3 | 6 | 7 |
| 5 | 7 | 3 | 2 | 8 | 4 | 1 | 9 | 6 |
| 9 | 6 | 1 | 7 | 5 | 3 | 8 | 2 | 4 |
| 4 | 2 | 8 | 9 | 6 | 1 | 7 | 5 | 3 |
| 1 | 8 | 2 | 3 | 7 | 5 | 6 | 4 | 9 |
| 3 | 4 | 5 | 6 | 9 | 8 | 2 | 7 | 1 |
| 6 | 9 | 7 | 4 | 1 | 2 | 5 | 3 | 8 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 37.67 ↑ | 1.30 ↑ | 275 ↑ | 1240 ↑ | ↑ | ↓ |
| 39,058.06 | 11,583.90 | 38,725 | 46,775 | 70.90 | 61.59 |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | 12 పైసలు | |



# సంవత్ 2075 వాలా తుస్..

## చిన్న మదుపర్లకు కడగండ్లే

### ప్రధాన సూచీలు పర్వాలేదు.. తరిగిన స్మాల్, మిడ్‌క్యాప్‌లు

### గత దీపావళి నుంచి 11.6% పెరిగిన సెన్సెక్స్

### నిఫ్టీ వృద్ధి 10 శాతం.. 3 శాతం తగ్గిన మిడ్‌క్యాప్

### స్మాల్ క్యాప్ 9 శాతం డౌన్

*హిందూ సంప్రదాయ ఏడాది 'సంవత్ 2075' చిన్న మదుపరులకు నిరాశే మిగిల్చింది. వారి సంపదను హారతి కర్పూరంలా కరిగించేసింది. గడిచిన ఏడాది కాలంలో ఈక్విటీ పెట్టుబడులపై ప్రతిఫలాలు పొందిన వారికంటే చేతులు కాల్చుకున్నవారే అధికం. మార్కెట్ సంపద ఇంతలా ఆవిరైపోవడం గతంలో ఎన్నడూ చూడలేదని, ప్రపంచ ఆర్థిక మాంద్యం మొదలైన 2008లోనూ ఈ తరహా పరిస్థితులు చూడలేదని మార్కెట్ విశ్లేషకులంటున్నారు. ప్రధాన షేర్లు ఫర్వాలేదనిపించినా.. రిటైల్ మదుపర్లు ఎక్కువగా ట్రేడింగ్ జరిపే చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు మాత్రం పెట్టుబడులకు భారీ గండికొట్టాయి. గత దీపావళి రోజున (2018 నవంబరు 7) ప్రారంభమైన సంవత్ 2075 ఈ నెల 26 (శనివారం)తో ముగియనుంది. ఈ దీపావళి (27వ తేదీ) నుంచి సంవత్ 2076 మొదలవుతుంది.*



## ఝున్‌ఝున్‌వాలాకూ కలిసిరాలేదు

సంవత్ 2075లో చిన్న మదుపర్లకే కాదు మార్కెట్ బిగ్ బుల్‌గా పేరున్న రాకేశ్ ఝున్‌ఝున్‌వాలాకూ అంతగా కలిసి రాలేదు. అతని ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలోని డీహెచ్ఎఫ్ఎల్ సహా డజను కంపెనీల షేర్ల విలువ 20-90 శాతం మేర క్షీణించింది. అయితే, అయాన్ ఎక్స్ఛేంజ్ 90 శాతం పెరిగింది. ఎంసీఎక్స్ 66 శాతం, టైటాన్ 59 శాతం, స్పైస్‌జెట్ 43 శాతం ఎగబాకడం మొత్తంగా ఆయన పోర్ట్‌ఫోలియో విలువను నిలబెట్టింది.

## అనిల్ కంపెనీల షేర్లు బొక్కబోర్లా



- ఆర్‌కామ్ : 94.64%
- ఆర్‌క్యాప్: 94.61%
- ఆర్ ఇన్‌ఫ్రా: 93.9%
- ఆర్ పవర్ : 92.46%
- రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ : 92.56%

## గత ఏడాది కాలంలో ఇదీ స్టాక్ మార్కెట్ తీరు

- *బీఎస్ఈ బ్లూచిప్ షేర్ల సూచీ సెన్సెక్స్ 11.62 శాతం (4,066.15 పాయింట్లు) పెరగగా.. ఎన్ఎస్ఈ ప్రామాణిక సూచీ నిఫ్టీ-50 సైతం 10 శాతం (1,053.90 పాయింట్లు) ఎగబాకింది. కానీ, బీఎస్ఈ మిడ్‌క్యాప్ 3 శాతం, స్మాల్ క్యాప్ 9 శాతం క్షీణించాయి.*
- *బీఎస్ఈలో యాక్టివ్‌గా ట్రేడైన 2,688 కంపెనీల షేర్లలో 2012 స్టాకులు విలువను కోల్పోయాయి. గడిచిన ఏడాది కాలంలో మార్కెట్ బలహీన పడిందనడానికి ఇదే స్పష్టమైన నిదర్శనం.*
- *గడిచిన ఏడాది కాలంలో బీఎస్ఈలోని 32 కంపెనీలు తమ విలువలో 90 శాతం కోల్పోయాయి. మరో 99 కంపెనీల షేర్లు 80-90 శాతం మధ్య పతనమయ్యాయి. 632 కంపెనీల స్టాకులు 50 శాతం, అంతకుపైగా పడిపోయాయి.*
- *ట్రావెల్స్ అండ్ టూర్ ఆపరేటింగ్ సేవల సంస్థ కాక్స్ అండ్ కింగ్ షేరు విలువ అన్నింటికంటే అత్యధికంగా 98.5 శాతం పతనమైంది.*
- *టాల్‌వాకర్స్ హెల్త్‌క్లబ్, టాల్‌వాకర్స్ బెటర్ వేల్యూ ఫిట్‌నెస్, మెర్కటార్, మెక్ లాయిడ్ రసెల్, ఆర్‌కామ్, రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ ఇన్‌ఫ్రా, జెట్ ఎయిర్‌వేస్, మన్‌పసంద్ బెవరేజెస్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ పవర్, సింటెక్స్ ప్లాస్టిక్స్, సింటెక్స్ ఇండస్ట్రీస్, బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్, డిలిజెంట్ మీడియా కార్పొరేషన్, బినానీ ఇండస్ట్రీస్, దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (డీహెచ్ఎఫ్ఎల్), హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (హెచ్‌డీఐఎల్), పుంజ్‌లాయిడ్ తదితర కంపెనీలు తమ మార్కెట్ విలువలో 90 శాతం పైగా నష్టపోయాయి.*

## సంవత్ 2075కు బ్రోకర్ల రేటింగ్

- 6/10 — రెలిగేర్, మోతీలాల్ ఓస్వాల్, ఇండియా బుల్స్ వెంచర్స్, ఐసీఐసీఐ డైరెక్ట్
- 4/10 — సామ్కో సెక్యూరిటీస్, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్
- 3/10 — ఇండియా నివేశ్
- 2/10 — ఎడెల్‌వీజ్ సెక్యూరిటీస్

# స్వల్ప లాభంతో ముగింపు

'సంవత్ 2075'కు స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాలతో ముగింపు పలికాయి. శుక్రవారం ఇంట్రాడేలో 523 పాయింట్ల మధ్య కదలాడిన సెన్సెక్స్.. చివరికి 37.67 పాయింట్ల లాభంతో 39,058.06 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 1.30 పాయింట్లు పెరిగి 11,583.90 వద్దకు చేరుకుంది. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 240.32 పాయింట్లు, నిఫ్టీ 77.95 పాయింట్లు పెరిగాయి.

### మరిన్ని ముఖ్యాంశాలు

- బీఎస్ఈ బ్లూచిప్ కంపెనీల్లో యెస్ బ్యాంక్ షేరు 7.97 శాతం బలపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. త్రైమాసిక లాభాల దన్నుతో ఎస్‌బీఐ సైతం ఏడు శాతం పైగా పుంజుకుంది.
- ఐసీఐసీఐ బ్యాంక్ 3.18 శాతం లాభపడగా.. సన్‌ఫార్మా, టీసీఎస్ 2 శాతం పైగా వృద్ధి చెందాయి. టాటా మోటార్స్ 4.87 శాతం క్షీణించగా.. హెచ్‌డీఎఫ్‌సీ, వేదాంత లిమిటెడ్ 2 శాతంపైగా నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే, బీఎస్ఈ బ్యాంకెక్స్, ఐటీ, టెక్నాలజీ, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఫైనాన్స్, హెల్త్‌కేర్ సూచీలు 1.07 శాతం వరకు పెరిగాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, టెలికాం, ఇండస్ట్రియల్స్, పవర్, యుటిలిటీస్, క్యాపిటల్ గూడ్స్ సూచీలు 1.78 శాతం వరకు పడిపోయాయి.
- ప్రధాన షేర్లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.02 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.39 శాతం పెరిగాయి.
- వొడాఫోన్ ఐడియా షేర్లలో పతనం కొనసాగింది. గురువారం 23 శాతం పైగా క్షీణించిన షేరు వారాంతం ట్రేడింగ్‌లో మరో 5.08 శాతం నష్టపోయింది.
- సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1000 కోట్లకు పైగా నష్టం ప్రకటించడంతో ఇండిగో ఎయిర్‌లైన్స్ షేర్లు ఏకంగా 12 శాతం పడిపోయాయి. దాంతో కంపెనీ ఒక్క రోజులోనే రూ.7,600 కోట్లకు పైగా మార్కెట్ విలువను కోల్పోయింది.
- ఈ ధన్‌తేరస్‌కు బంగారం విక్రయాలు అంతంత మాత్రంగానే ఉండవచ్చన్న అంచనాల నేపథ్యంలో ఆభరణ విక్రయ కంపెనీల షేర్లు వారాంతంలో 6.6 శాతం వరకు నష్టపోయాయి.

### ఆ షేర్లపై నిఘా పెంపు

ప్రమోటర్ల వాటాలో అధిక శాతం తాకట్టులో ఉన్న కంపెనీ షేర్లపై నిఘా పెంచేందుకు అదనపు చర్యలు చేపట్టనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెల్లడించాయి. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీతో చర్చించాక స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఈ నిర్ణయం తీసుకున్నాయి. వచ్చే నెల 1 నుంచి అదనపు చర్యలు అమలులోకి రానున్నాయి.

### రంగాల వారీగా పనితీరు
**(2018 నవంబరు 6 2019 అక్టోబరు 22 )**

| | |
|---|---|
| కన్స్యూమర్ డ్యూరబుల్స్ | : 40.1% |
| రియల్టీ | : 15.8% |
| ఆయిల్ అండ్ గ్యాస్ | : 15.3% |
| బ్యాంకెక్స్ | : 15.0% |
| ఎఫ్ఎంసీజీ | : 8.1% |
| క్యాపిటల్ గూడ్స్ | : 2.5% |
| పవర్ | : 1.6% |
| ఐటీ | : 1.0% |
| హెల్త్‌కేర్ | : -11.1% |
| ఆటో | : -13.2% |
| మెటల్ | : -29.5% |

### గత దీపావళి నుంచి ఐపీఓకు వచ్చిన కంపెనీలు, ఇప్పటివరకు వాటి రిటర్నులు

| | |
|---|---|
| ఐఆర్‌సీటీసీ | : 181.38% |
| ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ | : 104.75% |
| అఫ్లే ఇండియా | : 87.62% |
| నియోజెన్ కెమికల్స్ | : 84.40% |
| మెట్రోపొలిస్ హెల్త్‌కేర్ | : 54.22% |
| పాలీకాబ్ ఇండియా | : 45.38% |
| ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్స్ | : 34.62% |
| స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ | : 25.91% |
| రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ | : 25.79% |
| చాలెట్ హోటల్స్ | : 21.79% |
| విశ్వరాజ్ షుగర్ ఇండస్ట్రీస్ | : 1.67% |
| ఎంఎస్‌టీసీ | : -19.21% |
| స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ | : -23.76% |

### 'సంవత్ 2076'లోనూ నిస్తేజమే!

దలాల్‌స్ట్రీట్ వర్గాలను సంవత్ 2076 కూడా నిరాశపర్చవచ్చని ఈక్విటీ విశ్లేషకులంటున్నారు. అంతర్జాతీయ, దేశీయంగా పలు అనిశ్చిత, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్ సూచీలు తీవ్ర ఊగిసలాటలకు లోనుకావచ్చని వారు హెచ్చరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ చేపట్టిన పలు చర్యలు ప్రతిఫలాలు పంచేందుకు మరింత సమయం పట్టవచ్చని, వచ్చే ఏడాది మార్చి వరకు మార్కెట్ నిస్తేజంగానే ఉండనుందని కొందరు అనలిస్టులు భావిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ 7-13 శాతం మేర పెరగవచ్చని.. వరుసగా రెండేళ్ల తగ్గుతూ వచ్చిన స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ మాత్రం ఈసారి బ్లూచిప్ సూచీల కంటే మెరుగైన వృద్ధి కనబర్చవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**సూచీలపై విశ్లేషకుల అంచనా**
44,000 సెన్సెక్స్
13,000 నిఫ్టీ

**మార్కెట్లకు ప్రతికూల అంశాలు**

➡ ఆర్థిక మందగమనం, జీడీపీ క్షీణత ➡ ద్రవ్య లోటు, కరెంట్ ఖాతా లోటు కట్టు తప్పే ప్రమాదం ➡ తరలిపోతున్న ఎఫ్ఐఐ, దేశీయ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ➡ వడ్డీ రేట్లు, ద్రవ్య కొరత సమస్య ➡ ప్రభుత్వ విధానపరమైన చర్యల్లో అనిశ్చితి అంతర్జాతీయం ➡ అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం ➡ ముడి చమురు ధరల పెరుగుదల ముప్పు.

## జియోఫోన్ కస్టమర్ల కోసం ఆల్ ఇన్ వన్ ప్లాన్లు

హైదరాబాద్: రిలయన్స్ జియో తన జియోఫోన్ కస్టమర్ల కోసం సరి కొత్త ప్లాన్లను శుక్రవారం విడుదల చేసింది. 'ఆల్ ఇన్ వన్' పేరుతో ఈ ప్లాన్లను తెచ్చింది. ఇందులో భాగంగా రూ.75తో రీచార్జ్ చేసుకుంటే 3జీబీ డేటా, రూ.125తో 14జీబీ డేటా, రూ.155తో 28 జీబీ డేటా, 185తో 56 జీబీ డేటా వస్తుంది. ఈ ప్లాన్ల కాలపరిమితి 28 రోజులు. కస్టమర్లు జియో నుంచి జియోకు ఉచితంగా కాల్స్ చేసుకోవచ్చు. ఇతర ఆపరేటర్లకు ఫోన్ చేసేందుకు 500 నిమిషాలు కూడా లభిస్తాయని జియో తెలిపింది. ఇప్పటికే అమల్లో ఉన్న ప్లాన్లను కొనసాగించనున్నట్టు తెలిపింది. కాగా ఇటీవలే జియో స్మార్ట్‌ఫోన్ల కస్టమర్ల కోసం ఆల్ ఇన్ వన్ ప్లాన్లను విడుదల చేసింది. వీటిలో రూ.222, రూ.333, రూ.444, రూ.555 ప్లాన్లున్నాయి. వీటిద్వారా మరింత ఎక్కువ డేటాను కంపెనీ ఆఫర్ చేస్తోంది.

## బిగ్ సి దసరావళి రెండో లక్కీడ్రా



లక్కీడ్రాను తీస్తున్న బాలు చౌదరి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దసరా, దీపావళి సందర్భంగా ప్రారంభించిన 'దసరావళి ధమాకా' ఆఫర్‌లో భాగంగా బిగ్ సి రెండో లక్కీడ్రా తీసింది. సెప్టెంబరు 30న ప్రారంభమైన ఈ ఆఫర్ అక్టోబరు 29 వరకూ ఉంటుంది. ఇందులో భాగంగా ప్రతి 10 రోజులకు లక్కీడ్రా తీసి 30 మారుతీ ఆల్టో 800, 30 బజాజ్ ప్లాటినా బైకులను బహుమతిగా ఇవ్వాలని బిగ్ సి నిర్ణయించింది. దసరావళి ధమాకాకు ఖాతాదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని బిగ్ సి సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపారు. ఆఫర్ కింద 10 శాతం వరకూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి క్యాష్ బ్యాక్, సులభ వాయిదాల్లో మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన వారికి ఒక ఈఎంఐ ఉచితం వంటి ఆఫర్లను కూడా బిగ్ సి ఇస్తోంది.

## బీఎస్ఎన్ఎల్ పండగ కానుక

హైదరాబాద్: బీఎస్ఎన్ఎల్ దీపావళి పండగ సందర్భంగా ఈ నెల 27, 28 తేదీల్లో లాండ్‌లైన్ నుంచి దేశంలోని ఏ లాండ్‌లైన్, మొబైల్‌కైనా అపరిమితంగా కాల్స్ చేసుకోవచ్చని ప్రకటించింది. దీపావళి రోజు మొదలుకొని తర్వాతి రోజు అర్ధరాత్రి 12 గంటల వరకూ 48 గంటల పాటు ఈ ఆఫర్ వర్తించనుంది. మరోవైపు బ్రాడ్‌బ్యాండ్ వినియోగాన్ని మరింతగా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని బీఎస్ఎన్ఎల్ పేర్కొంది. 2020 మార్చి నాటికల్లా దేశంలోని అన్నిగ్రామాలను బ్రాడ్ బ్యాండ్‌తో అనుసంధానిస్తామని తెలిపింది.

## యూనివర్సల్ సోంపోతో ఐఓబీ ఆరోగ్య బీమా పాలసీ

చెన్నై : యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ భాగస్వామ్యంలో ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు (ఐఓబీ) ఒక ఆన్‌లైన్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ఆవిష్కరించింది. రెండు సంస్థల టెక్నాలజీలను అనుసంధానం చేయడం ద్వారా ఈ పాలసీని ఐఓబీ బ్రాంచిల ద్వారా కస్టమర్లకు రియల్ టైమ్ ప్రాతిపదికన అందిస్తారు. ఈ పాలసీ కింద కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.15 లక్షలకు బీమా ప్రయోజనం కల్పిస్తారు. ఈ ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ కింద పాలసీదారుల వయసును బట్టి ప్రీమియంలో హెచ్చుతగ్గులుంటాయి. 50 సంవత్సరాల వయసు లోపు వారికి ఎలాంటి ఆరోగ్య పరీక్షలు అవసరం లేకుండానే పాలసీ ఇస్తారు. ఐఓబీ సీఈఓ కరణం శేఖర్, యూనివర్సల్ సోంపో చైర్మన్ ఓఎన్ సింగ్ సమక్షంలో ఈ పాలసీని ఆవిష్కరించారు.

# రాబడిలో బంగారం భేష్

## ఏడాదిలో 22 శాతం వృద్ధి.. ముున్ముందు మరింత పెరిగే చాన్స్!



బంగారంపై భారతీయులకు ఉన్నంత మోజు బహుశా ప్రపంచంలో మరెవరికీ ఉండదేమో. ఒక విధంగా చెప్పాలంటే భారతీయ మహిళల దగ్గర ఎంత ఎక్కువ బంగారు నగలు ఉంటే.. వారి ఆర్థిక స్థోమత అంత ఎక్కువ ఉన్నట్టు లెక్క. మారుతున్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇప్పుడు పసిడి పెట్టుబడి సాధనంగానూ మారింది. దీనికి తగ్గట్టే గత ఏడాది కాలంలో బంగారంలో పెట్టుబడులు సగటున 20 నుంచి 22 శాతం రాబడులు ఇచ్చాయి. గత ఏడాది సంవత్ నాటికి ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 1,312 డాలర్ల దగ్గర ఉంది. ఈ సంవత్సరం సెప్టెంబరు నాటికి ఒక దశలో అది 1,566 డాలర్లకు చేరింది. ఇదే సమయంలో దేశీయ మార్కెట్లోనూ 24 కేరట్ల 10 గ్రాముల మేలిమి బంగారం రూ.31,391 నుంచి రూ.39,885కు దూసుకుపోయింది. ఈక్విటీ, రియల్ ఎస్టేట్ వంటి మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటున్న ప్రస్తుత నేపథ్యంలో ఈ రాబడులు తక్కువేం కాదు.

**ధరల స్థాయి**

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ పసిడి 1,517 డాలర్ల దగ్గర ట్రేడవుతోంది. దేశీయంగా కొన్ని మార్కెట్లలో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.40,160 నుంచి రూ.40,200 మధ్య మధ్య ట్రేడవుతోంది. వచ్చే ఏడాది కాలంలోనూ దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.38,500కు తగ్గకపోవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. ఏ కారణంతోనైనా ధర రూ.37,100కి తగ్గితే దాన్ని మద్దతు ధరగా భావించి, దీర్ఘకాలిక లాభాల కోసం కొనుగోలు చేయవచ్చని బులియన్ పరిశ్రమ నిపుణులంటున్నారు.

**పెట్టుబడి ఎలా ?**

ప్రస్తుతం బంగారంలో పెట్టుబడికి అనేక అవకాశాలు ఉన్నాయి. నగా, నట్రాతో పాటు బంగారం బిస్కెట్లు, బార్లతో పాటు ఈటీఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బాండ్స్ రూపంలో మదుపు చేయవచ్చు. సావరిన్ గోల్డ్ బాండ్స్‌లో మదుపు చేస్తే ధరల పెరుగుదల లాభాలతో పాటు 2.5 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. చెల్లింపుల భద్రతకూ ఢోకా ఉండదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి మదుపరి తమ మొత్తం పెట్టుబడుల్లో 10-15 శాతం పసిడి మార్కెట్‌లో మదుపు చేయడం మంచిది.

### భవిష్యత్

ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో బంగారంలో పెట్టుబడులకు ఈ అంశాలు కలిసి వస్తాయని మార్కెట్ వర్గాలంటున్నాయి. అవేమిటంటే..

- ➡ అమెరికా-చైనా మధ్య ఇంకా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం
- ➡ కొత్తగా అమెరికా-ఈయూ మధ్య పొంచి ఉన్న వాణిజ్య యుద్ధం
- ➡ స్టాక్ మార్కెట్లు, రియల్టీ రంగాల్లో కొనసాగుతున్న ఆటుపోట్లు
- ➡ ఇంకా కొలిక్కిరాని బ్రెగ్జిట్ వివాదం
- ➡ భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా తగ్గిపోతున్న వడ్డీ రేట్లు
- ➡ అంతర్జాతీయ ఆర్థిక మందగమనం
- ➡ బంగారం నిల్వలు పెంచుకుంటున్న చైనా, రష్యా కేంద్ర బ్యాంకులు
- ➡ ఒకటి రెండేళ్లలో అమెరికాకు పొంచి ఉన్న ఆర్థిక మాంద్య ప్రమాదం
- ➡ ప్రభుత్వ రుణపత్రాలపై తగ్గిపోతున్న వడ్డీ రేట్లు
- ➡ పెరిగిపోతున్న ప్రభుత్వ/ప్రైవేటు రుణాలు
- ➡ వేతనాలు తగ్గడంతో పెరిగిన ఆర్థిక అసమానతలు

## పాల్యోమావైరస్ వ్యాక్సిన్ల అభివృద్ధికి
## ఎన్‌సీఐతో బీఐఓఈ హోల్డింగ్స్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పాల్యోమావైరస్ వ్యాక్సిన్ల అభివృద్ధికి నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌సీఐ)తో బయాలాజికల్ ఈ లిమిటెడ్ అనుబంధ సంస్థ బీఐఓఈ హోల్డింగ్స్ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్‌లో నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ భాగం. అవయవ/మూత్రపిండాల మార్పిడి, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, ప్రోగ్రెసివ్ మల్టీఫోకల్ లుకోఎన్సిఫాలోపతి (పీఎంఎల్)లో వచ్చే బీకేపాల్యోమా వైరస్ (బీకేవీ), జేసీవీ సంబంధ వ్యాధులను అడ్డుకోవడానికి ఈ వ్యాక్సిన్లు ఉపయోగపడతాయని బయాలాజికల్ ఈ తెలిపింది. పాల్యోమా వైరస్ వ్యాక్సిన్ వైరస్-లైక్ పార్టికల్ (వీఎల్‌పీ). ఎన్‌సీఐకి చెందిన క్రిస్టోఫర్ బి బక్ లేబొరేటరీలో ఈ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఎన్‌సీఐ కోసం పాల్యోమావైరస్ వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని బీఐఓఈ హోల్డింగ్స్ డైరెక్టర్ నరేంద్ర దేవ్ మంతెన తెలిపారు. కొత్తతరం వ్యాక్సిన్ల తయారీలో కంపెనీ మరింతగా ముందుకు పోతుందన్నారు. జనరిక్ వ్యాక్సిన్ల తయారు చేసే కంపెనీ స్థాయి నుంచి కొత్త వ్యాక్సిన్లను తయారు చేసే స్థాయికి కంపెనీ ఎదిగిందని బయాలాజికల్ ఈ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ జనరిక్ వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి తయారు చేస్తోంది.

## ఇన్ఫోసిస్‌పై దర్యాప్తులో
## సహకారానికి సెబీకి సెక్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ఇన్ఫోసిస్‌లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ప్రజావేగు ఒకరు చేసిన ఆరోపణలపై దర్యాప్తులో సహకరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని అమెరికన్ రెగ్యులేటర్ సెక్ కోరనుంది. కాగా ఈ దర్యాప్తులో సెక్‌కు కావలసిన సంపూర్ణ సహాయ సహకారాలను సెబీ అందిస్తుందని రెగ్యులేటరీ వర్గాలు తెలిపాయి. ఇన్ఫోసిస్ భారత, అమెరికా మార్కెట్లు రెండింటిలోనూ లిస్టింగ్ అయింది. సంస్థలో జరిగిన అక్రమాల కారణంగా సాధారణ ఇన్వెస్టర్లు నష్టపోయిన సొమ్ము రాబట్టేందుకు అమెరికాలో క్లాస్ యాక్షన్ సూట్ కూడా దాఖలయింది. కాగా తమపై వచ్చిన అభియోగాలపై విచారణ సమయంలో సెక్‌కు పూర్తిగా సహకరిస్తామని ఇన్ఫోసిస్ కూడా ప్రకటించింది. ప్రజావేగు ఆరోపణల విషయంలో సెక్‌తో తాము నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపింది. అలాగే సెబీ అభ్యర్థన మేరకు తాము అదనపు సమాచారం అందించడానికి కూడా సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది. అమెరికాలో దాఖలైన క్లాస్ యాక్షన్ సూట్ విచారణలో కూడా తమ వాదాన్ని గట్టిగా వినిపించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపింది.

## జాగ్వార్‌నుంచి తొలి విద్యుత్ కారు!



టోక్యో: లగ్జరీ కార్ల సంస్థ జాగ్వార్ తొలిసారిగా విద్యుత్ కారును ప్రవేశపెట్టనుంది. టోక్యోలో జరిగిన గ్రాండ్ టురిస్మో వరల్డ్ టూర్ ఈవెంట్‌లో కాన్సెప్ట్ కారు.. జాగ్వార్ విజన్ గ్రాన్ టురిస్మో కూపేను ఆవిష్కరించింది. అత్యంత ఆధునిక విద్యుత్ వాహనం (ఈవీ)గా జాగ్వార్ దీన్ని అభివర్ణిస్తోంది. తమ రేసింగ్ కార్ల ఆధారంగా విజన్‌ను రూపొందించామని, కేవలం 2 సెకన్లలోనే 100 కిలోమీటర్ల వేగం అందుకోవడం విజన్ ప్రత్యేకత అని జాగ్వార్ పేర్కొంది. నవంబరు నెలాఖ రు నుంచి దీన్ని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జాగ్వార్ తెలిపింది.



# ఎస్‌బీఐ లాభం రూ.3,375 కోట్లు

## రెండో త్రైమాసికంలో ఆరు రెట్ల వృద్ధి

### తగ్గిన ఎన్‌పీఏలు, పెరిగిన మార్జిన్

### కలిసి వచ్చిన ఎస్‌బీఐ లైఫ్ వాటాల విక్రయం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికానికి కళ్లు చెదిరే ఆర్థిక ఫలితాలను శుక్రవారం నాడు ప్రకటించింది. ఈ త్రైమాసికంలో బ్యాంకు కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు ఆరు రెట్లు పెరిగి రూ.3,375.40 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంకు రూ.576.46 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సమీక్షా కాలంలో మొత్తం ఎస్‌బీఐ గ్రూప్ ఆదాయం రూ.79,302.72 కోట్ల నుంచి రూ.89,347.91 కోట్లకు చేరుకుంది.

స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన చూస్తే.. సెప్టెంబరు త్రైమాసికంలో ఎస్‌బీఐ నికర లాభం దాదాపు మూడు రెట్లు (212 శాతం) పెరిగి రూ.3,011.73 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంకు లాభం రూ.944.87 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ.66,607.98 కోట్ల నుంచి రూ.72,850.78 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ ఆదాయం 17 శాతం పెరిగి రూ.24,600 కోట్లకు చేరుకుంది. ఇది అంచనాలకు మించి ఉండటం విశేషం.

- ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ వ్యాపారంలో వాటాను విక్రయించడం వల్ల బ్యాంకు లాభాలు పెరిగే అవకాశం ఏర్పడింది. ఈ అనుబంధ సంస్థలో వాటాను 62.10 శాతం నుంచి 57.60 శాతానికి తగ్గించుకుంది. వాటా విక్రయం ద్వారా ఎస్‌బీఐకి రూ.3,500 కోట్ల లాభం వచ్చింది.
- బ్యాంకు ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల రుణాల్లో స్థూల మొండి పద్దులు (ఎన్‌పీఏ) 9.95 శాతం (రూ.2.05 లక్షల కోట్లు) నుంచి 7.19 శాతానికి (రూ.1.61 లక్షల కోట్లు) తగ్గాయి. బ్యాంకు జారీ చేసిన రుణాలు 22.48 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- నికర ఎన్‌పీఏలు 4.84 శాతం నుంచి 2.79 శాతానికి దిగివచ్చాయి. మొండి పద్దుల కోసం కేటాయింపులు రూ.11,396.87 కోట్ల నుంచి రూ.10,725 కోట్లకు తగ్గాయి.
- నికర వడ్డీ మార్జిన్ 2.78 శాతం నుంచి 3.22 శాతానికి పెరిగింది.
- గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు 275 కొత్త శాఖలను ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 600 శాఖలు ప్రారంభించాలన్నది లక్ష్యం.

*ఆర్థిక వ్యవస్థ మందగమనం నేపథ్యంలో కొంత మంది కార్పొరేట్లు మంజూరు చేసిన నిర్వహణ మూలధన పరిమితులను తగ్గించుకున్నారు. రుణాల్లో వృద్ధి తక్కువ స్థాయికే పరిమితమైనందు వల్ల రిటైల్ రుణాలపై దృష్టి సారించాల్సి వచ్చింది. ఫలితంగా ఇంతకు ముందు 19 శాతంగా ఉన్న ఈ రుణాలు 60 శాతానికి పెరిగాయి. అయితే పరిస్థితులు మారిన తర్వాత కార్పొరేట్ రుణాల వాటా మళ్లీ పెరిగే అవకాశం ఉంది. రుణ మాఫీల కారణంగా మొత్తం పద్దులు రూ.16,000 కోట్లకు పెరిగాయి. అయితే మొండి పద్దులు అదుపులోనే ఉండే అవకాశం ఉంది. డీహెచ్ఎఫ్ఎల్‌కు ఎస్‌బీఐ రూ.7,000 కోట్ల రుణాలు ఇచ్చింది. మూడో త్రైమాసికంలో ఈ ఖాతా మొండిపద్దుగా మారవచ్చు.*

**- రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్**



### షేరు జోరు

సెప్టెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు జోరుగా పెరిగిన నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు పరుగులుపెట్టింది. బీఎస్ఈలో 7.19 శాతం పెరిగి రూ.281.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో షేరు 8.10 శాతం ఎగబాకింది. ఎన్ఎస్ఈలో 7.56 శాతం పెరిగి రూ.282.35 వద్ద క్లోజైంది. ఒక్క రోజులో బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.16,868 కోట్లు పెరిగి రూ.2,51,317 కోట్లకు చేరుకుంది. బీఎస్ఈలో 55.52 లక్షలు, ఎన్ఎస్ఈలో 10 కోట్లకు పైగా షేర్లు చేతులు మారాయి.

## బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఆస్తుల విక్రయానికి ఇన్విట్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఆస్తులను ఇటీవల విస్తరించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల (ఇన్విట్) బాటలో విక్రయించి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే జరిగితే ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఇన్విట్‌లను ఇంత భారీ ఎత్తున వినియోగించుకోవడం ఇదే ప్రథమం అవుతుంది. ఇన్విట్‌లలో ఇన్వెస్ట్ చేయడానికి బ్యాంకులను అనుమతిస్తున్నట్టు గత వారం ఆర్‌బీఐ చేసిన ప్రకటన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలో విలీనం కానున్న బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ రెండింటి రుణభారాన్ని తగ్గించుకునేందుకు ఆస్తులను విక్రయించనున్నట్టు టెలికాం మంత్రి రవిశంకర్ ప్రసాద్ గత వారం ప్రకటించిన విషయం విదితమే. నాలుగు సంవత్సరాల కాలవ్యవధిలో చేపట్టే ఈ ఆస్తుల విక్రయం ప్రక్రియ మొత్తం విలువ రూ.38 వేల కోట్లుంటుంది. ప్రస్తుతం దేశంలో ఇన్విట్ మార్కెట్ రూ.40 వేల కోట్లకు చేరింది. అయితే ఇప్పటివరకు ప్రైవేట్ కంపెనీల నుంచి మాత్రమే ఈ బాటలో నిధులు సమీకరించేందుకు అనుమతించారు. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి ఇన్విట్ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లకు చేరుతుందని అంచనా. అందులో బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఆస్తుల విక్రయం వాటానే అధికంగా ఉంటుందంటున్నారు. 2021 నాటికి దేశంలో ఇన్విట్ మార్కెట్ పరిమాణం రూ.2 లక్షల కోట్లకు చేరుతుందని ఇటీవల క్రిసిల్ అంచనా ప్రకటించింది. ఈ ఇన్విట్‌లు నేరుగా లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసే సంస్థల ద్వారా మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. వాటిపై వచ్చిన రాబడులను నిర్దిష్ట కాలపరిమితిలో డివిడెండ్లుగా యూనిట్ హోల్డర్లకు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం పని చేస్తున్న ఇన్విట్‌లు రికార్డు స్థాయిలో ఆరు విడతలుగా నిరంతరం డివిడెండ్లు ఇచ్చి మంచి రికార్డు నెలకొల్పడంతో వాటి నిధుల సేకరణ పరిమితిని 49 శాతం నుంచి 70 శాతానికి పెంచుతూ ఇటీవల ఇన్విట్ నిబంధనలను సెబీ సవరించింది.



ధన త్రయోదశి

# 40% తగ్గిన బంగారం విక్రయాలు

**» దెబ్బతీసిన మందగమనం, ధరల పెరుగుదల**

న్యూఢిల్లీ/ముంబై : ఆర్థిక వ్యవస్థలో మందగమన పరిస్థితులు ధనత్రయోదశి (ధన్‌తేరస్)ని దెబ్బకొట్టాయి. దీపావళికి ముందు ధన్‌తేరస్ నాడు బంగారం కొనుగోలు చేస్తే కలిసివస్తుందన్న సెంటిమెంట్‌ను కొనుగోలుదారులు ఈ ఏడాది పూర్తిగా విస్మరించారు. ధరలు భారీగా పెరగటం, కొనుగోలుకు ఆసక్తి చూపించకపోవటం వంటి అంశాలతో ఈ ధనత్రయోదశి (శుక్రవారం) నాడు బంగారం, పసిడి విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పడిపోయాయి. మొత్తంగా ఈ ఏడాది ధన్‌తేరస్ బులియన్ మార్కెట్‌ను పూర్తిగా నిరాశపరిచింది. ఆభరణాల విక్రయాలు మినహాయిస్తే బంగారం అమ్మకాలు భారీగా తగ్గాయి. గత ఏడాది ధనత్రయోదశి రోజున దేశవ్యాప్తంగా 17 టన్నులున్న పసిడి నాణేలు, బిస్కెట్ల విక్రయాలు ఈ సంవత్సరం ఏకంగా 64 శాతం తగ్గి 6 టన్నులకు పడిపోయాయి. కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరించటమే ఇందుకు కారణం. కాగా 2018 ధనతేరస్ నాడు రూ.32,690 పలికిన పది గ్రాముల మేలిమి బంగారం.. శుక్రవారం నాడు ఢిల్లీ మార్కెట్లో పసిడి ధర రూ.220 పెరిగి రూ.39,240కి చేరింది.

గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువ. ఇదేకాలంలో కిలో వెండి ధర కూడా రూ.38,650 నుంచి రూ.45,000 దాటిపోయింది. చెన్నై మార్కెట్లో అయితే శుక్రవారం కిలో వెండి రూ.50,600కు చేరింది. తెలుగు రాష్ట్రాల్లోనూ శుక్రవారం కిలో వెండి రూ.45,000 నుంచి రూ.48,600 మధ్య ట్రేడైంది. ధరల పెరుగుదలతో గత ఏడాదితో పోలిస్తే అమ్మకాల పరిమాణం 35 నుంచి 40 శాతం తగ్గిందని మార్కెట్ వర్గాలు చెప్పాయి.

### పదేళ్లలో అత్యధిక తగ్గుదల

గత పదేళ్లలో ధనత్రయోదశి అమ్మకాలు ఎన్నడూ బులియన్ మార్కెట్‌ను ఈ స్థాయిలో నిరాశ పరచలేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే ధరల పెరుగుదలతో అమ్మకాల విలువ మాత్రం గత ఏడాది స్థాయిలోనే ఉంది. ధనత్రయోదశి సెంటిమెంట్‌తో కొనుగోళ్లకు వచ్చిన కొద్ది మంది కూడా నామమాత్రపు కొనుగోళ్లతో సరిపెట్టారు. కార్పొరేట్ నగల దుకాణాలు మాత్రం అమ్మకాలు ఫరవాలేదని చెబుతున్నాయి. ధనత్రయోదశి, దీపావళి అమ్మకాలు నిరాశ పరచడంతో నగల వ్యాపారులు ఇప్పుడు వచ్చే పెళ్లిళ్ల సీజన్‌పైనే ఆశలు పెట్టుకున్నారు.

## అమ్మకాల్లో హ్యుందయ్, కియా, ఎంజీ జోరు..





ధన్‌తేరస్ పర్వదినం సందర్భంగా హ్యుందయ్, కియా, ఎంజీ సంస్థలు కార్ల విక్రయాల్లో రికార్డులు సృష్టించాయి. ఈ మూడు సంస్థలు శుక్రవారం ఒక్క రోజే ఏకంగా 15 వేల వాహనాలను వినియోగదారులకు డెలివరీ ఇచ్చాయి. ధనత్రయోదశిని కొత్త వాహనాల కొనుగోలుకు పర్వదినంగా భావించే చాలామంది వినియోగదారులు, తమకు ఆ రోజే కారు డెలివరీ కావాలని సదరు సంస్థల్ని కోరారు. దీంతో హ్యుందయ్ మోటార్ ఇండియా 12500 యూనిట్లు, కియా మోటార్స్ 2,184యూనిట్లు, ఎంజీ మోటార్ ఇండియా 700 యూనిట్లు డెలివరీ ఇచ్చాయి. ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్ రీజియన్‌లోనే 200 కార్లను డెలివరీ చేయటం గమనార్హం.

# రూ.1.08 లక్షల కోట్ల పెట్టుబడి

**» డిజిటల్ సేవల కోసం రిలయన్స్ ప్రత్యేక కంపెనీ**

**» ఆమోదం తెలిపిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు**

న్యూఢిల్లీ : డిజిటల్ సేవల్లోనూ సంచలనాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) సిద్ధమవుతోంది. ఇందుకోసం పూర్తి అనుబంధ కంపెనీ (డబ్ల్యుఓఎస్) ఏర్పాటు చేస్తోంది. రిలయన్స్ జియోలో తనతో పాటు ఇతర మదుపరులకు ఉన్న రూ.1.08 లక్షల కోట్ల రుణపత్రాల పెట్టుబడులను ఈ అనుబంధ సంస్థకు బదిలీ చేస్తోంది. రిలయన్స్ జియో కంపెనీలో ఆర్ఐఎల్ పెట్టుబడిగా పెట్టిన రూ.65,000 కోట్ల ఈక్విటీ పెట్టుబడులూ ఈ అనుబంధ కంపెనీకి బదిలీ అవుతాయని ఆర్ఐఎల్ శుక్రవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. రైట్స్ ఇష్యూ కింద ఆప్షనల్లీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లు (ఓసీపీఎస్) జారీ చేయడం ద్వారా ఈ రుణ పత్రాల పెట్టుబడిని కొత్తగా ఏర్పాటు చేస్తున్న పూర్తి అనుబంధ కంపెనీకి బదిలీ చేస్తారు. రెండు కంపెనీల డైరెక్టర్ల బోర్డులు ఇప్పటికే ఇందుకు ఆమోదం తెలిపాయి. దీంతో వచ్చే ఏడాది మార్చి నాటికి స్పెక్ట్రమ్‌కు సంబంధించిన కొద్ది రుణాలు మినహా రిలయన్స్ జియో అప్పుల నుంచి పూర్తిగా బయటపడుతుంది.

### పెట్టుబడుల కోసమే

జియో నెట్‌వర్క్ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్ లక్షల కోట్లు పెట్టుబడి పెట్టింది. దీంతో కంపెనీ ఖాతాల్లో అప్పుల భారమూ పెరిగింది. కంపెనీ ప్రస్తుతం ఈ భారాన్ని తగ్గించుకునే పనిలో ఉంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం మార్చిలో జియోకు చెందిన రూ.1.25 లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్స్ ట్రస్టు (ఇన్విట్స్)లకు బదిలీ చేసింది. దీంతో జియో ఆస్తుల విలువ రూ.2.37 లక్షల కోట్లకు తగ్గింది. జియో నెట్‌వర్క్ ద్వారా రిలయన్స్ అందించే డిజిటల్ సేవల్లో పెట్టుబడి పెట్టేందుకు ఇప్పటికే అనేక సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశారు.ఈ సంస్థల నుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకే రిలయన్స్ ఇప్పుడు జియో ఆస్తులను పూర్తి అనుబంధ కంపెనీకి బదిలీ చేస్తోందని భావిస్తున్నారు.

### సంచలనమే

జియో ద్వారా రిలయన్స్ ఇప్పటికే అనేక డిజిటల్ అందిస్తోంది. ప్రత్యేక అనుబంధ కంపెనీ ద్వారా ప్రత్యర్థి కంపెనీలకు దిమ్మతిరిగే రీతిలో డిజిటల్ సేవలు అందించాలని కంపెనీ అధినేత ముకేశ్ అంబానీ యోచిస్తున్నట్టు మార్కెట్ వర్గాల అంచనా వేస్తున్నాయి. జియో ప్రవేశంతో దేశ టెలికాం రంగంలో వచ్చిన మార్పులు అందరికీ తెలిసిందే. ఇప్పుడు డిజిటల్ సేవలు ద్వారా మార్కెట్లో మళ్లీ అదే అలజడి సృష్టించాలని భావిస్తున్నట్టు సమాచారం. తన డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా కిరాణా దుకాణాలు మొదలుకుని సమస్త సేవలను గుప్పిట్లో పట్టాలని అంబానీ భావిస్తున్నారు.

కొత్త కంపెనీ దేశంలో డిజిటల్ సేవలను సమూలంగా మార్చేస్తుంది. ఆ సేవలు ఇప్పుడున్న కంపెనీలు అందిస్తున్న సేవలకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ప్రతి భారతీయుడికి నిజమైన డిజిటల్ సమాజాన్ని ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం ప్రపంచంలో అందుబాటులో ఉన్న అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానాల్ని, డిజిటల్ యాప్‌లను దేశంలోనే అత్యధిక ఆదరణ ఉన్న జియో ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేస్తాం.

**- ముకేశ్ అంబానీ, సీఎండీ, ఆర్ఐఎల్**



దీపావళి వేడుకల్లో ముకేశ్ అంబానీ, నీతా అంబానీ

# రాష్ట్రంలో స్మార్ట్ పోర్టులు

**పారదర్శక కేటాయింపులపై విధివిధానాలు ఖరారు**

అమరావతి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సులభతరహా వాణిజ్య విధానంలో పారదర్శకమైన అనుమతులతో స్మార్ట్‌పోర్టుల స్థాపనకు శ్రీకారం చుట్టాలని పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ నిర్ణయించింది. పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ భార్గవ శుక్రవారం ఈ మేరకు విధివిధానాలు రూపొందించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఈ పరిధిలోకి ఓడరేవులనూ తీసుకొచ్చారు. ఓడరేవులలో ఎగుమతులు, దిగుమతుల వ్యవహారాల్లో సులభశైలి విధానంలో సంస్కరణలు తీసుకొస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సేవలు పొందేందుకు కాలపరిమితి లేనందున సర్వీసులలో జాప్యం జరుగుతోంది. ఓడరేవుల స్థాపన కార్యాచరణలో సహేతుకత లేదు. ఓడరేవు ఏర్పాటు చేసే సంస్థ వ్యక్తిగతంగా దరఖాస్తులను పరిశ్రమల శాఖకు అందజేస్తున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న పరిశ్రమలశాఖ... భారతీయ సముద్ర భాగంలోకి విదేశీ నౌకలు ప్రవేశించేందుకు అనుమతులు, కార్గో డిక్లరేషన్, బెర్తుల కోసం అభ్యర్థన/బెర్తింగ్ నంబరు, నౌకా ప్రవేశానికి అభ్యర్థన, ఆరోగ్య ధ్రువీకరణ అభ్యర్థన, ఎగుమతి/దిగుమతి ధ్రువీకరణ, బయటకు వెళ్లేందుకు క్లియరెన్సులు, నౌకలు బయలు దేరేందుకు అనుమతులు, గేట్‌పాసులు వంటి వాటిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించే దిశగా నూతన విధానాలు ఆన్‌లైన్‌లో అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో... ఏజెన్సీ రిజిస్ట్రేషన్/రెన్యువల్/సంస్థ; నౌకలకు ఆఫ్‌షోర్ సపోర్టు చార్జీలు; సముద్ర నీటి వినియోగ చార్జీలు, పైపులైన్ చార్జీలు; వార్షిక భూముల లీజులు, దీర్ఘకాలిక లీజులు; సర్వే సర్టిఫికెట్; బార్జ్ రిజిస్ట్రేషన్, ఓనర్‌షిప్, రెన్యువల్; ఫిషింగ్ హార్బర్ పర్మిషన్; తాగునీటి కోసం ఫీజుల చెల్లింపు.

## అనుబంధ కంపెనీల విలీనానికి అరబిందో వాటాదారుల సమావేశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏపీఎల్ రిసెర్చ్ సెంటర్, ఆరోజెమ్స్, సిలికాన్ లైఫ్ సైన్సెస్, క్యూర్‌ప్రో పేరెంటిరల్స్ తదితర అనుబంధ కంపెనీల విలీనానికి అరబిందో ఫార్మా వాటాదారుల ఆమోదం తీసుకోనుంది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ ఆదేశాల మేరకు నవంబరు 30న వాటాదారుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

### పారిశ్రామిక ప్రోత్సాహక సలహాదారుగా వీరారెడ్డి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రోత్సాహక సలహాదారుగా ఆర్. వీరారెడ్డిని నియమిస్తూ పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ భార్గవ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంపై వీరారెడ్డికి ఉన్న అనుభవాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు

**» కార్గో సర్వీసులు కూడా**



తిరుపతి (రవాణా): అంతర్జాతీయ విమానాశ్రయంగా తిరుపతి ఎయిర్‌పోర్టును విస్తరిస్తున్న నేపథ్యంలో మరో ఆరు నెలల్లో ఇక్కడి నుంచి అంతర్జాతీయ, కార్గో విమాన సర్వీసులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు తిరుపతి పార్లమెంటు సభ్యుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ బల్లి దుర్గాప్రసాద్ రావు తెలిపారు. శుక్రవారం నాడిక్కడ జరిగిన అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ 30 నాటికి అంతర్జాతీయ విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టినా, కొన్ని కారణాల వల్ల ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం రన్‌వేను పటిష్ఠం చేసే పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన వెంటనే మూడు నెలల్లో కార్గో, ఆరు నెలల్లో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇంకా రన్‌వే విస్తరణ, కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని, అందుకు అవసరమైన భూమిని ఇటీవలే ఎయిర్‌పోర్టుకు కేటాయించామని తెలిపారు.

## సంక్షిప్తంగా...

*__గెయిల్ :__ గెయిల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్‌గా మనోజ్ జైన్ నియమితులయ్యారు. ప్రస్తుతం డైరెక్టర్ (బిజినెస్ డెవలప్‌మెంట్)గా ఉన్న ఈయనను చైర్మన్ పదవికి ప్రభుత్వ రంగ సంస్థల సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) ఎంపిక చేసింది. 57 ఏళ్ల జైన్ 2022 ఆగస్టు వరకు ఈ పదవిలో కొనసాగుతారు.*

*__బెర్న్ యూనియన్ :__ ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ).. హైదరాబాద్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు బెర్న్ యూనియన్ 2019 వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించింది. స్థూల ఆర్థిక పరిస్థితులు, వాణిజ్య విధానంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ సమావేశంలో చర్చించారు. ఎక్స్‌పోర్ట్ క్రెడిట్, ఇన్వెస్ట్‌మెంట్ ఇన్సూరర్స్‌కు అంతర్జాతీయ సమాఖ్యగా బెర్న్ యూనియన్ వ్యవహరిస్తోంది.*

*__ఇసుజు మోటార్స్ :__ ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రిల్లో ఇసుజు షోరూమ్‌లు ఉన్నాయి.*

*__మేబాజ్:__ ఫ్యామిలీ ఇండియన్ వేర్ బ్రాండ్ మేబాజ్‌కు టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ, బాలీవుడ్ నటి కియరా అద్వానీలు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమితులయ్యారు. వీరిద్దరు సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్ ప్రచారాన్ని కూడా ప్రారంభించారు.*

## హైదరాబాద్ రియల్టీలో తగ్గిన పీఈ పెట్టుబడులు



బెంగళూరు: ఈ ఏడాది జనవరి-సెప్టెంబరు నెలల మధ్య కాలంలో హైదరాబాద్ రియల్టీకి ప్రైవేటు ఈక్విటీ (పీఈ) పెట్టుబడులు 76 శాతం తగ్గాయి. గత ఏడాదితో పోల్చితే పీఈ పెట్టుబడుల పరిమాణం 79 కోట్ల డాలర్ల (రూ.5530 కోట్లు) నుంచి 19 కోట్ల డాలర్లకు (రూ.1330 కోట్లు) పడిపోయింది. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం 159 కోట్ల డాలర్లు (రూ.11130 కోట్లు) ఆకర్షించి అగ్రస్థానంలో నిలిచింది. అనరాక్ ప్రాపర్టీస్ ఈ వివరాలు వెల్లడించింది. పుణె నగరం 200 శాతం అధిక పెట్టుబడులు ఆకర్షించింది.

దేశీయ రియల్టీకి పెట్టుబడుల వెల్లువ ఇదే కాలంలో భారత రియల్ ఎస్టేట్ మార్కెట్లోకి 380 కోట్ల డాలర్ల (రూ.26,600 కోట్లు) విలువ గల పీఈ పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది వచ్చిన 320 కోట్ల డాలర్ల (రూ.22,400 కోట్లు) పెట్టుబడులతో పోల్చితే ఇది 19 శాతం అధికం. పీఈ పెట్టుబడుల ఆకర్షణలో 79 శాతం వాటాతో వాణిజ్య ప్రాపర్టీల వి భాగం అగ్రస్థానంలో ఉంది.

ఈ ఒక్క విభాగమే 300 కోట్ల డాలర్ల (రూ.21,000 కోట్లు) పెట్టుబడులు ఆకర్షించిందని అనరాక్ ఎండీ శోభిత్ అగర్వాల్ తెలిపారు. పెట్టుబడులు పెట్టిన అగ్రశ్రేణి సంస్థల్లో బ్లాక్‌స్టోన్, ఫైన్స్, అసెండాస్, బ్రూక్‌ఫీల్డ్ ఉన్నాయి. విభాగాల వారీగా చూస్తే రెసిడెన్షియల్, రిటైల్, లాజిస్టిక్స్ అండ్ వేర్‌హౌసింగ్ పెట్టుబడుల ఆకర్షణలో తదుపరి స్థానాల్లో నిలిచాయి.

### 25న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.45 — నెక్ (100 గుడ్లు)

26వ తేదీకి..

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 386 | విశాఖపట్నం | 385 |
| బెంగళూరు | 405 | వరంగల్ | 389 |
| విజయవాడ | 385 | చెన్నై | 430 |
| గోదావరి | 385 | చిత్తూరు | 423 |
| నమక్కల్ | 410 | ముంబై | 441 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 79 | విజయవాడ | 80 |
| వరంగల్ | 79 | గుంటూరు | 81 |
| మహబూబ్‌నగర్ | 79 | ఒంగోలు | 82 |
| కరీంనగర్ | 79 | చిత్తూరు | 91 |
| కర్నూలు | 79 | నెల్లూరు | 91 |
| విశాఖపట్నం | 68 | అనంతపురం | 92 |
| గోదావరి | 76 | | |

### బులియన్

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,540 | 38,850 | 40,100 | 38,500 | 38,580 |
| క్రితం ముగింపు | 38,530 | 38,500 | 39,660 | 38,400 | 38,280 |
| 22 క్యారెట్లు | 36,670 | 36,000 | 36,890 | 35,910 | 36,930 |
| క్రితం ముగింపు | 36,680 | 35,700 | 36,480 | 35,670 | 36,630 |
| వెండి (కిలో) | 45,500 | 47,800 | 48,600 | 47,200 | 50,600 |
| క్రితం ముగింపు | 45,300 | 46,800 | 46,700 | 46,700 | 49,000 |

# అత్యాచార నిందితులను శిక్షించాలి

**బాధితుల తరపున పోరాడతాం: చంద్రబాబు**



గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం పెద్ద గార్లపాడులో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన మైనార్టీ నేత నసీర్ అహ్మద్ నేతృత్వంలో నూరుబాషా ముస్లిం నాయకులు శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చంద్రబాబును కలిసి అత్యాచార ఘటనపై వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా ముక్కు పచ్చలారని చిన్నారిపై ఇటువంటి ఘటనకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. సంఘటన జరిగి వారం గడుస్తున్నా నిందితులను అదుపులోకి తీసుకోకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఘటనను నీరుగార్చేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది అరాచకత్వాన్ని పెంచి పోషించటమేనన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం వారికి అండగా నిలబడటం హేయమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు టీడీపీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. నిందితులకు చట్టపరంగా శిక్షలు పడేంత వరకు పోరాడతామన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో నూరుబాషా, దూదేకుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఖాజావలి, ప్రధాన కార్యదర్శి ఖాజావలి, రాష్ట్ర దీన్ కమిటీ అధ్యక్షుడు కాటన్ వలి, యూత్ అధ్యక్షుడు షేక్ బాజీ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ**

నరసరావుపేట లీగల్, అక్టోబరు 25: గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం పెద్దగార్లపాడులో లైంగిక దాడి జరిగిన మైనర్ బాలిక కుటుంబ సభ్యులను, బాధితురాలిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ శుక్రవారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పూర్తిగా అండగా నిలుస్తామన్నారు. మీడియా, పోలీసులు, ప్రభుత్వ అధికారులు బాధిత కుటుంబానికి అన్ని వేళలా సహకరిస్తారన్నారు. స్థానిక వైద్యుల సూచన మేరకు బాధిత బాలికను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించనున్నట్టు తెలిపారు. పల్నాడులో ఈ విధమైన సంఘటనలు వరుసగా చోటు చేసుకోవటం బాధాకరమని... ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కలెక్టర్‌తో చర్చించి బాధితురాలికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారని.. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళా కమిషన్ కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు.

త్వరలో

# నైపుణ్యాభివృద్ధి వర్సిటీ

**లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో కాలేజీల ఏర్పాటు .. విద్యార్థులకు ఏడాది శిక్షణ తర్వాతే పరీక్షల నిర్వహణ**



అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు లభించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్‌ను అమలు చేయడంపై సచివాలయంలో సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కోసం యూనివర్సిటీని, ప్రతి లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో కాలేజీని ఏర్పాటు చేయాలని అధికారులను జగన్ ఆదేశించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, బీకాం సహా ఇతర కోర్సులు చదువుతున్నవారిని ఈ వర్సిటీకి అనుసంధానం చేయాలన్నారు. వారికి ఏడాది పాటు అవసరమనుకుంటే మరో ఆరు నెలలు అదనంగా శిక్షణ ఇవ్వాలని, ఆ తర్వాతే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వర్సిటీ ఏర్పాటుపై ఒక ఐఏఎస్ అధికారిని మూడు, నాలుగు రోజుల్లో కేటాయిస్తామని సీఎం పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వ శాఖలు విడివిడిగా ఖర్చు చేయడాన్ని నిలిపివేస్తూ ఇకపై ఒకే చోట నుంచి వ్యయం చేసేలా ఆర్థికశాఖకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వంలోని ప్రతిశాఖా నైపుణ్యాభివృద్ధి వర్సిటీతో అనుసంధానం కావాలని ఆదేశించారు. ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజీలన్నింటినీ డిజిటల్ ఎక్స్‌టెన్షన్ చేయడం కోసం ఓలా, ఉబర్ తరహాలో ఒక యాప్‌ను తయారు చేస్తామన్నారు. స్థానికంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను గ్రామ సచివాలయ స్థాయిలో మ్యాపింగ్ చేస్తామని వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వర్సిటీ, కాలేజీలు పని చేస్తాయని సీఎం వివరించారు. విద్యార్థులకు అందించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మారుతున్న సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా ఉండాలని సూచించారు. ప్రపంచం యావత్తూ రాష్ట్రంవైపు చూసేలా ఈ కార్యక్రమాలు ఉండాలన్నారు. నైపుణ్యాభివృద్ధి విషయంలో అన్ని శాఖల్లోనూ మంచి ఆలోచనలే ఉన్నప్పటికీ సమన్వయం కొరవడిందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేలా కొత్తగా నైపుణ్యాభివృద్ధి వర్సిటీని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నైపుణ్యాభివృద్ధి కాలేజీ ఏర్పాటుపై త్వరలోనే ఒక విధాన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ అంశంపై నెల రోజుల్లోనే కార్యాచరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థి బయటకు రాగానే ఉపాధి దక్కేలా విద్యావ్యవస్థ ఉండాలన్నారు. ఈ సమీక్షలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేశ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెగా సీడ్ పార్క్‌ప్రాజెక్టుకూ ‘రివర్స్’?

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా సీడ్ పార్క్ ప్రాజెక్టు డిజైన్‌ను మారనున్నది. గత ప్రభుత్వం రూపొందించిన ప్రాజెక్టు డిజైన్‌ను ప్రస్తుత ప్రభుత్వం మార్చాలని యోచిస్తున్నది. మెగా సీడ్ పార్క్‌కు రెండేళ్ల క్రితం శంకుస్థాపన జరిగినా, అందులో ఇంతవరకు విత్తనోత్పత్తి ప్రారంభం కాలేదు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం కర్నూలు జిల్లా తంగడంచలో మెగా సీడ్ పార్క్ ప్రాజెక్టు చేపట్టింది. 627 ఎకరాల్లో రూ.650 కోట్లతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో విత్తన తయారీని చేపట్టాలని, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో అత్యుత్తమ విత్తనాల రూపకల్పనకు పరిశోధనలు నిర్వహించాలని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సాంకేతిక సహకారం కోసం అమెరికాకు చెందిన ఐయోవా విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదిరింది. సీడ్ పార్క్‌లో విత్తన యూనిట్లు ఏర్పాటుచేసే సంస్థలకు అనేక ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో అప్పటి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వం మెగా సీడ్ పార్క్ ప్రాజెక్ట్‌ను రీ డిజైన్ చేస్తోంది. వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు ఈ విషయం చెప్పారు. ప్రాజెక్టు డిజైన్ మార్చాలని ప్రభుత్వం భావిస్తుండడంతో ప్రాజెక్టు కార్యరూపం దాల్చడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

## ఏపీటీఎస్‌లో ‘రివర్స్’.. రూ.65.48 కోట్ల ఆదా

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రివర్స్ టెండరింగ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాలకు కంప్యూటర్లు కొనుగోలు ద్వారా రూ.65.48 కోట్లు ఆదా చేయగలిగామని ఏపీటీఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీటీఎస్ గ్రామ సచివాలయాల కోసం 30 వేల కంప్యూటర్లు, 1500 యూపీఎస్ సిస్టమ్స్, 15 వేలు మల్టీఫంక్షన్ ప్రింటర్ల కోసం టెండర్లను ఆహ్వానించింది. ఫైనాన్సియల్ బిడ్‌ను ఈ నెల 22న పరిశీలించగా, గురువారం రివర్స్ వేలం నిర్వహించారు. రివర్స్ టెండరింగ్ ద్వారా కంప్యూటర్లు, యూపీఎస్ సిస్టమ్స్ కొనుగోళ్లలో రూ.51.15 కోట్లు, ప్రింటర్స్ కొనుగోళ్లలో రూ.14.33 కోట్లు ఆదా అయినట్లు తెలిపారు.

# డిస్టిలరీలకు 152 కోట్లు విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం కొరత ఏర్పడుతున్న తరుణంలో ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు దిగింది. బకాయిలు పేరుకుపోయినందున మద్యం సరఫరా చేయలేమని చేతులెత్తేసిన డిస్టిలరీలకు కొంత నిధులు విడుదల చేసి, సరఫరా పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టింది. ‘మద్యం బంద్?’ శీర్షికన శుక్రవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. డిస్టిలరీలకు మొత్తం రూ.1700కోట్లు చెల్లించాల్సి ఉండగా వెంటనే రూ.152కోట్లు నిధులు విడుదల చేసింది. మిగిలినవి దశలవారీగా విడుదల చేస్తామన్న హామీతో మద్యం సరఫరా పునరుద్ధరణకు యాజమాన్యాలు అంగీకరించాయి.

## రూ.20వేల లోపు అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం

రూ.10వేల నుంచి రూ.20వేల మధ్య డిపాజిట్ చేసిన అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2019-20లో అగ్రిగోల్డ్ బాధితుల కోసం కేటాయించిన రూ.1150 కోట్ల బడ్జెట్ నుంచి వీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే రూ.10 వేల లోపు డిపాజిట్ చేసిన వారికి కోసం తొలి విడతలో రూ.264కోట్లు మంజూరుచేసింది.

## రేపు సాయంత్రం దుర్గమ్మ ఆలయం మూసివేత

విజయవాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దీపావళి రోజు అమావాస్య సందర్భంగా ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ ముగిసిన తర్వాత రాత్రి 7 గంటలకు కనకదుర్గమ్మ ఆలయాన్ని మూసివేయనున్నారు. మర్నాడు ఉదయం తెల్లవారుజామున యథావిధిగా దేవస్థానాన్ని తెరుస్తారు.

## ఐటీడీసీ చైర్మన్‌గా కమలవర్ధనరావు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐటీడీసీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి గంజి కమలవర్ధనరావును నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ కేబినెట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్ పీకే త్రిపాఠి ఆదేశాలు జారీచేశారు. కృష్ణా జిల్లాకు చెందిన కమలవర్ధనరావు గుంటూరులో టుబాకో బోర్డు చైర్మన్‌గా రెండేళ్లు పనిచేశారు.

## గోదావరి బోర్డు చైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి బోర్డు చైర్మన్‌గా జె.చంద్రశేఖర్ అయ్యర్‌ను నియమించారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటి వరకు బోర్డు చైర్మన్‌గా కొనసాగిన ఆర్కే జైన్‌ను సీడబ్ల్యూసీకి బదిలీ చేశారు. కొత్తగా బోర్డు చైర్మన్‌గా నియమితమైన చంద్రశేఖర్ అయ్యర్ ఇప్పటి వరకు సీడబ్ల్యూసీలో పనిచేశారు.

## కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రంగారావు

ఏపీ కౌలు రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సంఘం ద్వితీయ మహాసభలు గుంటూరు జిల్లా పేరేచర్లలో జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాగబోయిన రంగారావు, ప్రధాన కార్యదర్శిగా పి.జమలయ్యను ఎన్నుకున్నారు.

## శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా జయరాజ్

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌చాన్సెలర్(ఎఫ్ఏసీ)గా ప్రొఫెసర్ ఎం.జయరాజ్ నియమితులయ్యారు.

## డిసెంబరు 10న ‘ఎండోమెంట్స్’ ఇంటర్వ్యూలు

ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు డిసెంబరు 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్‌బాబు

## ‘ఎలక్ట్రోఫిజియాలజీ’తో హార్ట్ ఫెయిల్యూర్‌కి చెక్

**రమేశ్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఆధునిక చికిత్స**

విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హార్ట్ ఫెయిల్యూర్‌ని ఆధునిక ఎలక్ట్రోఫిజియాలజీ చికిత్సతో నియంత్రించవచ్చని విజయవాడలోని రమేశ్ హాస్పటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేశ్‌బాబు చెప్పారు. ఈ అత్యాధునిక చికిత్స ద్వారా తమ ఆస్పత్రిలో సుమారు 500 మంది హృద్రోగులకు రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చికిత్స అందించామని, 1500 మందికి పేస్ మేకర్లు అమర్చామని ఆయన వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేశ్‌బాబు ఈ చికిత్స గురించి వివరించారు. ‘కొంతమందిలో 70 సార్లు కొట్టుకోవలసిన గుండె ఒక్కోసారి 100, 120 సార్లు కొట్టుకుంటుంది. కొన్నిసార్లు గుండె కండరం నార్మల్‌గా పని చేస్తున్నప్పటికీ 150 నుంచి 250 సార్లు కొట్టుకుంటుంది. దీనినే టకీ కార్డియా అంటారు. గతంతో పోలిస్తే ఇలాంటి కేసులు ఎక్కువయ్యాయి. రక్తాన్ని పంప్ చేసే ప్రక్రియలో జనరేట్ అయిన విద్యుత్ గుండె గదులకు చేరే సమయంలో ఏదైనా షార్ట్ సర్క్యూట్ వంటి ఆటంకం ఎదురైనపుడు గుండె వేగంగా లేదంటే నెమ్మదిగా కొట్టుకోవచ్చు. గుండె పంపింగ్ 35 శాతం కంటే తక్కువగా ఉన్నవాళ్లకు ఇంప్లాంటబుల్ కార్డియో వెర్టర్ డిఫిబ్రిలేటర్‌ను ఛాతి కింది భాగంలో అమరుస్తారు. ఇది నిరంతరం గుండె వేగాన్ని నియంత్రిస్తుంది. ఎక్కువగా కొట్టుకుంటే షాక్ ఇవ్వడం ద్వారా వేగాన్ని నియంత్రిస్తుంది’ అని రమేశ్‌బాబు వివరించారు. తమ హాస్పిటల్స్‌లో ఎలక్ట్రోఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్లు కీర్తిక, హరిత, సెంథిల్ కుమార్ మెరుగైన చికిత్స అందిస్తున్నారని తెలిపారు.

**బీసీ రిజర్వేషన్లపై వైఖరి ఏమిటి?: ఆర్.కృష్ణయ్య**

విజయవాడ(గవర్నర్‌పేట),అక్టోబరు 25: బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లపై దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన బీసీల ఆత్మగౌరవ సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ పార్లమెంటులో వైసీపీ బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బిల్లు పార్లమెంటు ఆమోదం పొందేందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలవాలని కోరారు. బిల్లుపై మద్దతు కోరేందుకు దేశవ్యాప్తంగా వివిధ పార్టీల నేతల్ని కలవనున్నట్టు వెల్లడించారు.

**వైసీపీలోనే బీసీలకు గుర్తింపు: ఎంపీ గోరంట్ల**

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 25: బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా కులవృత్తుల్లో కొనసాగించేందుకు చంద్రబాబు ప్రయత్నించారని.. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ బీసీలకు పదవులిచ్చి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూల్లో గొర్రెల పెంపకందారుల సంఘం 5వ మహాసభలో మాధవ్ మాట్లాడుతూ జగన్ బీసీలకు ప్రతి ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తున్నారని చెప్పారు.

**‘తూర్పు’ డీసీసీబీ మాజీ చైర్మన్‌పై కేసు**

ఏలేశ్వరం, అక్టోబరు 25: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి తనఖా పెట్టిన ఆస్తులను తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ వరుపుల జోగిరాజు(రాజా) అన్యాక్రాంతం చేసారంటూ అందిన ఫిర్యాదుతో ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదుచేశారు. వరుపుల రాజా పెదశంకర్లపూడి గ్రామంలోని 9.99 ఎకరాల భూమిని తన ఆస్తిగా పేర్కొంటూ ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణానికి సంబంధించిన రూ.8,61,480 తీర్చకుండానే తనఖా పెట్టిన భూమిని అన్యాక్రాంతం చేశారని సంఘం సీఈవో పోలీసులకు ఫిర్యాదుచేశారు.

**భార్య మరణాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య**

ఏలూరు క్రైం, అక్టోబరు 25 : భార్య మృతితో మనోవేదనకు గురైన ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పవరుపేట మోతేవారి వీధికి చెందిన మొలుగు మల్లికార్జునరావు(39) 2004లో నిర్మలాదేవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి లోహిత్‌చరణ్, పవన్‌కుమార్ పిల్లలున్నారు. నిర్మలాదేవి డెంగీబారిన పడి చికిత్స పొందుతూ ఈనెల 6న మృతిచెందింది. భార్యమరణాన్ని మల్లికార్జునరావు తట్టుకోలేకపోయాడు. కుమిలి కుమిలి ఏడుస్తున్న ఆయనను ఓదార్చడం ఎవరితరం కాలేదు. రెండు రోజుల నుంచి పచ్చి మంచినీళ్లూ ముట్టలేదు. శుక్రవారం మధ్యాహ్నం షాపు నుంచి ఇంటికి వెళ్లిన మల్లికార్జునరావు ఎంతకీ రాకపోవడంతో షాపుగుమస్తా వెళ్లి చూడగా ఇంట్లో సీలింగ్‌ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు.

# ఆశనిరాశల్లో రమణదీక్షితులు!

- తిరుమలలోకి రీఎంట్రీపై తర్జనభర్జన
- నిర్ణయం తీసుకోలేక పోతున్న వైసీపీ ప్రభుత్వం
- టీటీడీ పాలక మండలి పరిస్థితీ ఇంతే
- గత విమర్శలే దీక్షితులుకి అవరోధం?



తిరుమల, అక్టోబరు 25: తిరుమల ఆలయంలోకి తిరిగి అడుగుపెట్టాలన్న పట్టుదలతో ఉన్న ఒకప్పటి ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు ప్రయత్నం ఆశనిరాశల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పదవీ విరమణతో ఆలయ ప్రధాన అర్చకత్వానికి దూరమై, టీటీడీ మీద తీవ్ర ఆరోపణలు చేసి వార్తల్లోకి ఎక్కిన ఆయనను ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు గట్టిగా సమర్థించారు. దీంతో వైసీపీ అధికారంలోకి రాగానే రమణ దీక్షితులు తిరిగి బాధ్యతలు స్వీకరిస్తారనే ప్రచారం జరిగింది. ముఖ్యమంత్రి హోదాలో జగన్ తిరుమలకు వచ్చినపుడు రమణదీక్షితులు ఆయనను కలిసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లో కూడా జగన్‌ని కలిశారు. ఈ నేపథ్యంలో రమణదీక్షితులుకు లైన్ క్లియరైనట్టేనని అంతా భావించారు. టీటీడీ కొత్త పాలకమండలి ఏర్పడగానే తొలి సమావేశంలోనే ఆయనను తిరిగి తీసుకుంటూ తీర్మానం చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, పాలకవర్గం రెండు సమావేశాలు నిర్వహించినా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఈలోగా ఆలయ అర్చకుల వారసత్వ హక్కులను సమర్థిస్తూ, వారికి రిటైర్మెంట్ ఉండదని ప్రభుత్వం ప్రకటించడంతో రమణదీక్షితులకు లైన్ క్లియర్ అవబోతోందని మరోసారి అందరూ భావించారు. కానీ, టీటీడీ మినహా మిగిలిన ఆలయాలకే ఈ నిర్ణయం వర్తిస్తుందని ప్రభుత్వం మెలిక పెట్టడంతో మళ్లీ నిరాశ తప్పలేదు. తాజాగా బుధవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి రమణ దీక్షితులుకు కొత్త ఆశలు రేపాయి. టీటీడీలో పదవీ విరమణ పొందిన అర్చకులను మళ్లీ తీసుకుంటామని, విశ్రాంత అర్చకులను ఎలా ఉపయోగించుకోవాలో సూచించడానికి కమిటీని ఏర్పాటు చేస్తామని అన్నారు. అయితే, ప్రధాన అర్చకులుగా కాదని, ప్రస్తుతం ఉన్న ప్రధాన అర్చకులకు స్థానచలనం ఉండబోదని సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. కాగా, టీటీడీ వ్యవస్థ మీదే తీవ్రదాడి చేస్తూ, అధికారుల మీద ఆరోపణలు చేస్తూ, విలువైన వజ్రం ఏమైందనే ప్రశ్నలు సంధిస్తూ రమణ దీక్షితులు ఢిల్లీ సహా ప్రధాన నగరాల్లో మీడియా సమావేశాలు పెట్టి మరీ విరుచుకుపడ్డారు. కేంద్రంలో కీలక నేతలుగా ఉన్న అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, సుబ్రహ్మణ్యస్వామి వంటి వారిని కలిసి ఫిర్యాదులు చేశారు. వైసీపీ నాయకులు సైతం ఆయనకు సంఘీభావం తెలుపుతూ గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అయితే, గత విషయాల నేపథ్యంలో జగన్ సర్కారు ఏ నిర్ణయమూ తీసుకోలేక సతమతం అవుతున్నట్లు తెలుస్తోంది. దీక్షితులును తిరిగి తీసుకుంటే, టీటీడీలో అవకతవకలన్నీ నిజమేనని అంగీకరించినట్లు అవుతుంది. కోట్ల రూపాయల విలువైన వజ్రాభరణాల గురించి ప్రజల్లో ఉన్న అనుమానాలకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది. భక్తుల విశ్వాసాలతో ముడిపడ్డ ఈ అంశాల జోలికి వెళ్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోననే ఆందోళనతోనే రమణ దీక్షితులును తిరిగి తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నట్టు భావిస్తున్నారు.

# మాచర్ల రూరల్ సీఐపై కేసు

గుంటూరు, అక్టోబరు 25: గుంటూరు జిల్లా గురజాల కోర్టు ఆదేశాలతో మాచర్ల రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డిపై మాచర్ల టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఐపీసీ 353, 34, సీఆర్‌పీసీ 156 (3) సెక్షన్ల కింద గత నెల 30నే కేసు నమోదు కాగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం గంగలగుంటకు చెందిన ఆవుల శ్రీనివాసరావు.. తన స్నేహితుడైన బత్తుల శ్రీరాములుతో కలిసి ద్విచక్ర వాహనంపై శిరిగిరిపాడు వెళ్తుండగా ఆగస్టు 8న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జేసీబీ ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో శ్రీనివాసరావు మృతి చెందాడని శ్రీరాములు వెల్లడించాడు. దీనిపై శ్రీనివాసరావు భార్య వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే మాచర్ల రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి రాములుతోపాటు మేకల రమణయ్య, బత్తుల శ్రీనులను 14 రోజుల పాటు వెల్దుర్తి, దుర్గి, మాచర్ల రూరల్, విజయపురి సౌత్ తదితర నాలుగు పోలీసు స్టేషన్లలో మార్చి మార్చి చిత్రహింసలు పెట్టారని అనుమానితుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. మేకల రమణయ్య భార్య రమణ దీనిపై కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసి అక్రమంగా నిర్బంధించి ఉంటే వారిని కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. అదే రోజు అడ్వకేట్ కమిషన్ బృందం శ్రీరాములు కుటుంబ సభ్యులతో కలిసి మాచర్ల రూరల్ స్టేషన్‌ను తనిఖీ చేయగా అక్కడ రమణయ్యను గుర్తించారు. అతడిని కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో సీఐ భక్తవత్సలరెడ్డి వారి వాహనానికి తన వాహనం అడ్డుపెట్టి మరికొందరు సిబ్బందితో కలిసి అడ్వకేట్ కమిషనర్ రమానాయక్, జూనియర్ అసిస్టెంట్ బి.శ్రీనివాసరావులను నెట్టివేసి వారి అధీనంలో ఉన్న రమణయ్యను బలవంతంగా తన వెంట లాక్కువెళ్లాడు. జరిగిన విషయాన్ని అడ్వకేట్ కమిషన్ కోర్టు దృష్టికి తీసుకురాగా దీనిపై న్యాయమూర్తి జిల్లా జడ్జికి లేఖ రాశారు. స్పందించిన జిల్లా జడ్జి విచారణ జరపాలని రూరల్ ఎస్పీని ఆదేశించారు. ఇదిలా ఉంటే అనుమానాస్పద మృతి కేసును అదే రోజు హత్యకేసుగా మార్చి తన అదుపులో ఉన్న రమణయ్య, శ్రీరాములు, బత్తుల శ్రీనులను నిందితులుగా పేర్కొంటూ సీఐ తర్వాతి రోజు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి 14 రోజులు రిమాండ్ విధించింది. అయితే ఈ కేసులో తాను ఇరుక్కుంటాననే భయంతో భక్తవత్సలరెడ్డి నాలుగు రోజుల తర్వాత గురజాల జైలుకు వచ్చి తమను బెదిరించినట్టు రిమాండ్ ముగిశాక ముగ్గురు నిందితులు బయటపెట్టారు. సీఐ తమ నుంచి ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు కూడా తీసుకున్నారని తెలిపారు.

**చంద్రబాబుకు బాధితుల ఫిర్యాదు**

ఈ పరిస్థితుల్లో మేకల రమణయ్య భార్య రమణ, కుటుంబ సభ్యులు భూలక్ష్మి, వెంకటమ్మ, రత్నకుమారి, రంగయ్య తదితరులు గుంటూరులోని టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. స్టేషన్‌కు వెళ్లిన వృద్ధుడు బత్తుల రంగయ్య చెంపపై కొట్టి బయటకు నెట్టారని.. 20 ఎకరాల పొలాన్ని నాశనం చేశారని, చివరకు మాచర్లలో న్యాయవాదిని కూడా పెట్టుకోనివ్వకుండా బెదిరించారని వాపోయారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. ఆ పోలీసు అధికారిపై ప్రైవేటు కేసు దాఖలు చేయాలని టీడీపీ లీగల్‌సెల్ ప్రతినిధులను ఆదేశించారు. ఈ మేరకు సీఐ భక్తవత్సలరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు కోరుతూ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు అడ్వకేట్ కమిషనర్, జూనియర్ అసిస్టెంట్ విధులకు ఆటంకం కలిగించినందుకు గత నెల 30న భక్తవత్సలరెడ్డి, ఆయనకు సహకరించిన వారిపై కేసు నమోదు చేశారు.

## ఇద్దరు రైతుల ఆత్మహత్య

బి.కోడూరు/ప్రత్తిపాడు, అక్టోబరు 25 : రుణపాశం మరో ఇద్దరు రైతులను బలితీసుకుంది. కడప జిల్లా బి.కోడూరు మండలం ఐత్రంపేట గ్రామానికి చెందిన కొండా నారాయణరెడ్డి (29) రెండెకరాల పొలం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదు సంవత్సరాలుగా పంటల సాగు కోసం పలువురి వద్ద దాదాపు 3 లక్షల రూపాయల మేరకు అప్పులు తీసుకున్నట్టు గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపారు. వడ్డీ పెరిగిపోవడం, అప్పులిచ్చినవారు ఒత్తిడి తేవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈనేపథ్యంలో శుక్రవారం తూర్పు కొండకు బర్రెలు మేపుకునేందుకు వెళ్లిన వారు అక్కడ నారాయణ రెడ్డి మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. పోలీసులు పంచనామా నిర్వహించి 5 రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తెలిపారు. కాగా, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడుకు చెందిన దాసు గురవయ్య (43) తనకున్న ఎకరం పొలంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గతంలో సరిగా పంటలు పండక పోవడంతో 5 లక్షల రూపాయలు అప్పులు చేశాడు. తీర్చే మార్గం లేక, వడ్డీలు పెరిగి పోతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం పొలం వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన గురవయ్య పొలంలోనే పురుగు మందు తాగి మరణించాడు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. హైదరాబాద్‌లోని హాస్టల్‌లో గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 2016లో బీటెక్ పూర్తిచేసిన లక్ష్మణ్‌రావు (25) ఉద్యోగ నిమిత్తం నగరానికొచ్చి కేపీహెచ్‌బీ ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-1లోని వెంగమాంబ బాయ్స్ హాస్టల్లో ఉంటున్నాడు. రైజ్ ఎన్ షైన్ ఇన్‌స్టిట్యూట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మానసిక ఒత్తిడి అధికం కావడంతో ఇటీవల చికిత్స తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 8 గంటలకు హాస్టల్ బాత్‌రూమ్‌లోని రాడ్డుకు టవల్‌తో ఉరేసుకుని మృతిచెందాడు. లక్ష్మణ్ గదిలో ఉంటున్న అశోక్ కుమార్ ఈ విషయం గమనించి కూకట్‌పల్లి పోలీసులకు, మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. మానసిక ఒత్తిడి వల్లే లక్ష్మణ్‌రావు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.


**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

EDP శాఖ, టి.టి.డి., తిరుపతి

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

Adv No. 21/TTD-11021(58)/1/2019-IT-TTD, తేది: 24.10.2019

దిగువ NIT నం.తో పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పై ఆన్‌లైన్ బహిరంగ టెండర్లు కోరుచున్నది. EDP మేనేజర్, టి.టి.డి., తిరుపతి: 63 నుండి 65/EDPM/టి.టి.డి/టి.పి.టి/2019-20 టెండరు నోటీస్ కొరకు దర్శించండి: http://www.tirumala.org. ఇ-టెండరులో పాల్గొనుట కొరకు https://tender.ape-procurement.gov.in లేదా https://www.apeprocurement.gov.in కు లాగాన్ అవ్వండి.

సం/- కార్యనిర్వహణాధికారి

ROC No.PR4/13911/Adv-281/PRO/2019 తేది : 25.10.2019

**GREATER VISAKHAPATNAM SMART CITY CORPORATION LIMITED**

Ref.No:GVSCCL/Projects/150(ILL-COC)/2019-20, Dt:23/10/2019

REQUEST FOR QUOTATION (RFQ)

GVSCCL desires to invite RFQ for the work "Providing the 200 MBPS internet leased connectivity at City Operations Centre at GVMC Main Office for system Integrator Project under Smart City Mission". The detailed RFQ including EMD, TOR, Eligibility criteria etc can be downloaded from website of from 24 Oct' 2019 onwards. The last date for online submission of bids is 8 Nov'2019 upto 5.00 PM

For more details contact:
E-mail: prabhu.sheelavantha@aecom.com
Cc: visakhapatnamsmartcity@gmail.com,
Mobile No :09901472092, 07729995934

MD & CEO GVSCCL

**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**

'e' Procurement Short Tender Notice No. Rc. E12-102973/2019/VMC-Engg/PD-1, Dt. 25-10-2019

| Sl. No. | Name of Work | Estimate Amount Rs. in Lakhs |
| --- | --- | --- |
| 1 | Refurbishment & replacement of door shutters, Water supply, Sanitary items in Package-3 (16 Blocks-512 DUs) under JnNURM-BSUP Housing in New RR peta (3rd Call) and Providing hardscape (Civil) works for open Gym Court in GVS Sastry Park & Refurbishment of green House & Providing Pathway in APIIC colony nursery (2nd Call), Operation & maintenance of Central median greenery to Eluru Road and Bandar Road (1st Call) | 43.66 |

Contact : Executive Engineer, PD-I, VMC, Vijayawada - 520 001.
Further details can be seen@ 'e'procurement market place @ www.tender.apeprocurement.gov.in
Download of bid documents starts from 26-10-2019 @ 03-30 P.M.
Last date / time for receipt of tenders 02-11-2019 upto 4.00 P.M

Sd/- V. SRINVIAS for Commissioner

**TUNGABHADRA BOARD : TB DAM**

e-Procurement Notice IFB Nos:16/2019-20 Dt: 25-10-2019

Tender for total 11 Nos. of works i.e. 08 Nos. of Works costing below Rs. 50.00 Lakh and 03 No. of works costing above Rs.50.00 Lakh in respect of HW & HLC Division, TB Dam are invited throuth "e-Procurement".

| | |
| --- | --- |
| Bid Document downloading Start Date & Time | : 26/10/2019 11.00 AM |
| Bid Document downloading End Date & Time | : 08/11/2019 3.00 PM |
| Last Date & Time for submission of Bids | : 08/11/2019 5.00 PM |
| Date of opening of Technical Bids (for work costing above Rs.50.00 lakh) | : 08/11/2019 5.30 PM |
| Date of opening of Price Bids (for works costing below Rs.50.00 lakh) | : 08/11/2019 5.30 PM |
| Date of opening Price Bids (for works costing below Rs.50.00 lakh) | : 11/11/2019 11.00 AM |

Further details can be seen @ https://tender.apeprocurement.gov.in

Ph: 08394 - 259114 9480842031 Fax: 08394 - 259167

Sd/- K.V.Ramana, Superintending Engineer, I.B, TB Board, TM Dam

**ప్రజాప్రకటన**

రెగ్యులేషన్స్ (31)2 యొక్క ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్ రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016

మెస్సర్స్ బైనర్స్ ఇండియా లిమిటెడ్ యొక్క హక్కుదారులకు విజ్ఞప్తి

| | | |
| --- | --- | --- |
| 1 | కార్పొరేట్ డెబ్టార్ పేరు మరియు చిరునామా | మెస్సర్స్ బైనర్స్ ఇండియా లిమిటెడ్, CIN NO.U99999AP1986PLC006402 R.S.NO. 205/2ఎ,కానూరు,7వ క్రాస్ రోడ్డు, జవహర్ ఆటోనగర్, విజయవాడ-520007. |
| 2 | లిక్విడేషన్ తేది | 27.08.2019 |
| 3 | వాటాదారుల లిస్టు | గౌరవనీయులైన యన్.సి.ఎల్.టి., అమరావతి, హైదరాబాద్ మరియు లిక్విడేటర్ గారి వద్ద ఉన్నది కావలసిన వివరములు ఈ మెయిల్ కు: pnandiraju26@gmail.com పంపించగలరు. |

గమనిక: మెస్సర్స్ బైనర్స్ ఇండియా లిమిటెడ్ వారి యొక్క వాటాదారులు అందరూ తేది. 29.10.2019 న జరిగే షేర్ హోల్డర్ మీటింగ్‌కు ఉదయం 10 గంటలకు మెస్సర్స్ బైనర్స్ ఇండియా లిమిటెడ్ ఆర్ ఎస్ నెం. 205/2ఎ కానూరు, 7వక్రాస్ రోడ్డు, జవహర్ ఆటో నగర్, విజయవాడ-7,ఆం.ప్ర,వద్ద హాజరు కావలసినదిగా కోరుచున్నము. ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్ రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్ 2016 లోని 31ఎ రెగ్యులేషన్ ప్రకారం, షేర్ హోల్డర్స్ కన్సల్టేషన్ కమిటీ నందు వారి యొక్క ప్రతినిధులు నియమించబడెను. వ్యక్తిగతంగా సమాచారం, పోస్టు ద్వారా బట్వాడా చేయబడినది.

ఎస్.ప్రభాకర్ (లిక్విడేటర్ మెస్సర్స్ బైనర్స్ ఇండియా లిమిటెడ్)





విశాఖలో ఇసుక దండలతో పార్టీ నాయకులు అయ్యన్నపాత్రుడు తదితరులు, కళ్యాణదుర్గంలో మాజీ మంత్రి కాలవ తదితరుల దీక్ష



రాజంపేటలో ఇసుకను తూకం వేస్తూ నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల

# ప్రభుత్వానిదే ఈ పాపం!

- ధ్వజమెత్తిన టీడీపీ శ్రేణులు
- ఇసుక మాఫియాపై కదంతొక్కిన తమ్ముళ్లు
- పలు జిల్లాల్లో ఎమ్మెల్యేలు, నేతల ర్యాలీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

"చంద్రబాబు పాలనలో ఉచితంగా లభించిన ఇసుక ఇప్పుడు బంగారంగా మారిపోయింది. దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఆకలి కేకలు పెడుతున్నారు. అయినా ప్రభుత్వం కనికరించడం లేదు. కార్మికుల కష్టాలకు ప్రభుత్వానిదే బాధ్యత" అంటూ.. ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ప్రతిపక్ష టీడీపీ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించారు. ఇసుక విధాన వైఫల్యం, కొరత, కార్మికుల కష్టాలపై శుక్రవారం భారీ నిరసనలకు దిగారు. పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు అన్ని జిల్లాల్లోనూ టీడీపీ నాయకులు, శ్రేణులు రోడ్ల మీదకి వచ్చి ప్రభుత్వ ఇసుక విధానాన్ని దుయ్యబట్టారు. కార్మికుల సమస్యలను వినిపించారు. పలు జిల్లాల్లో నాయకులు దీక్షలు చేశారు. అయితే, పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించి టీడీపీ నేతలను అడ్డగించారు. పలువురిని అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లాలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒంగోలు, కనిగిరిల్లో ర్యాలీలు నిర్వహించగా, మార్కాపురంలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. ఒంగోలులో పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఇసుక మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కనిగిరిలో టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పశ్చిమ గోదావరిలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో దీక్ష నిర్వహించారు. పాలకొల్లు నుంచి నరసాపురం వరకు 'ఆకలి కేకలు' పేరిట ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ రామ్మోహన్ పాదయాత్ర నిర్వహించారు. నరసాపురం నిరసన దీక్షల్లో పార్టీ జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు పాల్గొన్నారు. ఏలూరులో మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి, గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను దీక్షకు దిగారు. కడపలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అమీర్‌బాబు నిరసనకు దిగారు. రాజంపేటలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు 'ఇసుక కిలో రూ.5 వేలు' అంటూ ఇసుకను తూకం వేసి అమ్ముతూ వినూత్న నిరసన తెలిపారు. వైసీపీ నేతలు ఇసుకను కొల్లగొట్టి చెన్నై, బెంగళూరుకు తరలించి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. జమ్మలమడుగులో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, ముక్తియార్‌లు ర్యాలీ నిర్వహించారు. 'కావాలి ఉచిత ఇసుక.. పోవాలి ఇసుక మాఫియా' నినాదంతో విశాఖ, అనకాపల్లి, పాడేరుల్లో టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలో టీడీపీ నేతలు ఇసుకతో కూడిన దండలు మెడలో వేసుకుని కూర్చున్నారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పల్లా శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వంటా-వార్పు నిర్వహించారు. పాడేరులో నిర్వహించిన ఆందోళనలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు. సీఎం జగన్ తన అనుచరులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా పెట్టుకున్నారని కర్నూలు టీడీపీ నేతలు విమర్శించారు. కర్నూలు నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, డోన్ పార్టీ ఇన్‌చార్జి కేఈ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని మాజీ మంత్రి అఖిలప్రియ విమర్శించారు. శుక్రవారం ఆళ్లగడ్డలోని 4 రోడ్ల కూడలిలో ధర్నా చేశారు. రాష్ట్రంలో రివర్స్ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. అనంతపురం జిల్లాలో టీడీపీ నేతలు ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కళ్యాణదుర్గంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, పెనుకొండలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ తిప్పేస్వామి, కదిరిలో మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాష్‌నాయుడు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

### గుంటూరులో నేతల హౌస్ అరెస్ట్

గుంటూరు జిల్లాలో చేపట్టిన దీక్షల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. గురజాలలో దీక్షను పోలీసులు భగ్నం చేశారు. గుంటూరు నుంచి వెళ్తున్న మా జీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును సత్తెనపల్లి మండలం నందిగం అడ్డరోడ్డు వద్ద అడ్డుకుని దీక్షకు అనుమతి లేదంటూ వెనక్కి పంపారు. భవన నిర్మాణ కార్మికులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ నాయకులను హౌస్ అరెస్టులు చేశారు.

## ఉసురు తీసిన 'ఇసుక'

(మొదటి పేజీ తరువాయి)

పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఐదు నెలలుగా ఇసుక కొరతతో పనులు దొరకడంలేదు. కుటుంబాన్ని పోషించటానికి అప్పులు చేయాల్సి వచ్చింది. వాటిని తీర్చలేక, కొత్తగా అప్పులు పుట్టక నాగబ్రహ్మాజీ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అప్పటిదాకా ఇంటి దగ్గరే ఉండి పిల్లల పోషణ చూసుకునే భార్య లక్ష్మీతిరుపతమ్మ రెండు నెలలుగా స్పిన్నింగ్ మిల్లులో పనికి వెళ్లి కుటుంబాన్ని నడపాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక పరిస్థితి దిగజారడం, భార్యతో పని చేయించాల్సి వచ్చిందనే బాధతో బ్రహ్మాజీ గత పదిరోజులుగా ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రెండు నెలలుగా తమ సంపాదనతోనే ఇల్లు గడుస్తోందని, అది బ్రహ్మాజీని బాధపెట్టిందని ఆయన భార్య లక్ష్మీ తిరుపతమ్మ, అత్త శివలీల తెలిపారు. ఇసుక సమస్య పరిష్కారమవుతుందనే ఎదురు చూపులు ఫలించకపోవడం... భవన నిర్మాణానికి తప్ప మరో పనికి వెళ్లలేకపోవడంతో చావే పరిష్కారమని తనను, ఇద్దరు పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడని లక్ష్మీ తిరుపతమ్మ కన్నీరు మున్నీరయ్యారు.

### గుంటూరులో మరొకరు...

గుంటూరు నగరంలో కోదండరామయ్యనగర్ 1వ లైనుకు చెందిన బేల్దారి మేస్త్రీ పడతాపు వెంకట్రావు (40) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య జ్యోతి, ఇరువురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొద్ది నెలలుగా ఇసుక కొరత నేపథ్యంలో పనులు లేకపోవడంతో ఉపాధి లేక వెంకట్రావు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు. తరచూ మద్యం సేవించడం మొదలుపెట్టాడు. శుక్రవారం మధ్యాహ్నం కూడా మద్యం తాగి రావడంతో ఎందుకిలా చేస్తున్నావంటూ భార్య జ్యోతి ప్రశ్నించింది. ఆ తర్వాత తాను పనికి వెళ్లిపోయింది. 3 గంటల సమయంలో ఇంటికి రాగా లోపల గడియ పెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా వెంకట్రావు ఉరి వేసుకుని కనిపించాడు. భవన నిర్మాణ కార్మికుడైన తన భర్త ఉపాధి లేక, కుటుంబాన్ని పోషించలేక, మానసికంగా బాధపడుతూ మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు జ్యోతి ఫిర్యాదు చేశారు.

### ధైర్యం చెప్పినా...

"ఇసుక లేకపోవడంతో పనులు లేకుండా పోయాయి. అప్పుకోసం వెళితే ఇసుక వచ్చేదెప్పుడు, అప్పు తీర్చేదెప్పుడంటూ హేళనగా మాట్లాడారని బాధపడ్డాడు. మరో పనికి వెళ్లలేకపోతున్నానని.. భార్య, పిల్లలను చూసుకోలేని నేను బతికి ఏమి ప్రయోజనమని అనేవాడు. నేను పనికి వెళతానని ధైర్యం చెప్పాను. రెండు నెలల నుంచి స్పిన్నింగ్ మిల్లులో కూలీకి వెళ్తున్నాను. పసిపిల్ల తల్లితో పనిచేయిస్తున్న కసాయివాడినంటూ ఆవేదన చెందాడు. ఇప్పుడు పసిపిల్లలను అనాథలను చేసి వెళ్లిపోయాడు"

- లక్ష్మీ తిరుపతమ్మ, నాగ బ్రహ్మాజీ భార్య

### పిల్లలను చూసుకోవాలని చెప్పాడు!

ఇసుకలేక పనులు ఆగిపోయి, ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. మా పిల్లలను మీరే చూసుకోవాలని రెండు రోజుల క్రితం చెప్పాడు. నిజంగా అన్నంత పని చేస్తాడనుకోలేదు.

- శివలీల, నాగ బ్రహ్మాజీ అత్త

### సర్కారుదే బాధ్యత: టీడీపీ

నాగ బ్రహ్మాజీ మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత అని టీడీపీ నేతలు నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా రైతుల ఆత్మహత్యలు చూసిన రాష్ట్రంలో కొత్తగా జగన్ సర్కారు అసమర్థత వల్ల భవననిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇసుక కొరతకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

### ఇకనైనా కన్ను తెరవాలి: జనసేన

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్యపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నిర్మాణ రంగాన్ని కుదేలు చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని, దీనివల్ల లక్షల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం బ్రహ్మాజీ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### జ్వరంతో ఉన్నా.. బుద్దా అరెస్టు

విజయవాడతోపాటు కృష్ణా జిల్లాలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలు నిర్వహించారు. భవానీపురంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న టీడీపీ నేత, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతోపాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. బుద్దా వెంకన్న గత వారం రోజులుగా జ్వరం(టైఫాయిడ్)తో బాధపడుతున్నారు. ఇసుక సమస్యపై ధర్నాలు నిర్వహించాలని చంద్రబాబు పిలుపునివ్వడంతో వెంకన్న అనారోగ్యంతో ఉన్నప్పటికీ ధర్నాలో పాల్గొన్నారు. ఆయనతోపాటు పలువురిని పోలీసులు అరెస్టు చేయడంపై బుద్దా మండిపడ్డారు. విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో నిర్వహించిన నిరసన దీక్షలో మాజీమంత్రి దేవినేని ఉమా, ఎంపీ కనకమేడల రవీంద్ర, మాజీ ఎమ్మెల్యేలు బొండా ఉమా, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



### బంగి వినూత్న నిరసన

ఇసుక కొరత కారణంగా లక్షల మంది కార్మికుల కుటుంబాల్లో చీకటి నెలకొందని, వారు పస్తులుంటున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కర్నూలు నగర మాజీ మేయర్ బంగి అనంతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యకు నిరసనగా బంగి గుండు గీయించుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు.

## సీఎంతో వంశీ భేటీ



సీఎం నివాసం వద్ద మంత్రులతో వంశీ

- మంత్రులు కొడాలి, పేర్ని నానితో కలిసి వెళ్లిన గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే
- అరగంటకుపైగా మంతనాలు
- పార్టీ మారతారంటూ ప్రచారం
- దీపావళి తర్వాత చెప్తా: ఎమ్మెల్యే

విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలవడం రాజకీయంగా సంచలనం రేపింది. ఆయన పార్టీ మారతారన్న ప్రచారం ఒక్కసారిగా జోరందుకుంది. దీనిపై దీపావళి తర్వాత స్పష్టత ఇస్తానని ఆయన ప్రకటన చేయడంతో పార్టీ మార్పు తథ్యమని రాజకీయ వర్గాలు అంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో కృష్ణా జిల్లాలో టీడీపీ గెలిచిన రెండు స్థానాల్లో గన్నవరం కూడా ఒకటి. సుజనా చౌదరితో వంశీకి బంధుత్వం ఉంది. సుజనా టీడీపీకి రాజీనామా చేసి బీజేపీలోకి వెళ్లినప్పటికీ వంశీ ఆయనతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం కూడా ఆయనతో కలిసి గుంటూరు వెళ్లిన వంశీ.. మధ్యాహ్నం విజయవాడలో ప్రత్యక్షమయ్యారు. చిరకాల మిత్రుడు, మంత్రి కొడాలి నాని, మరో మంత్రి పేర్ని నానితో కలిసి మధ్యాహ్నం 3గంటలకు తాడేపల్లిలోని సీఎం నివాసానికి వెళ్లారు. సుమారు అరగంటకుపైగా జగన్‌తో చర్చలు జరిపారు. ఇటీవల వంశీపై నకిలీ ఇళ్ల పట్టాల కేసు నమోదైంది. ఆ కేసులో పలువురు టీడీపీ నేతలతోపాటు ఆయన్ను 10వ నిందితుడిగా చేర్చారు. తనపై అక్రమంగా కేసు పెట్టారని, దీనిపై ఆధారాలతో గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి ఫిర్యాదు చేస్తామని కూడా ప్రకటించారు. గురువారమే వంశీ నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మారడంపైనా చర్చ జరిగినట్లు చెబుతున్నారు. కాగా.. శుక్రవారం టీడీపీ అధిష్ఠానం ఇసుక కొరతపై రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో వంశీ పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో వంశీ పార్టీ మారడం ఖాయమని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిని వంశీ ఖండించలేదు సరికదా.. శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. తాను 2006 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, ఎప్పుడూ ఇంత స్థాయిలో తన మద్దతుదారులపైన, అనుచరులపైన దాడులు గానీ, ఆస్తులకు నష్టం గానీ జరగలేదని పేర్కొన్నారు. ఈ అంశాలను సీఎంకు వివరించానని చెప్పారు. పార్టీ మారే అంశంపై దీపావళి తర్వాత స్పష్టత ఇస్తానని పేర్కొన్నారు.

### రాజీనామా చేసి వస్తేనే..!

ప్రభుత్వంతో కలసి పనిచేస్తానని సీఎంను కలిసిన సందర్భంగా వంశీ అన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారని వైసీపీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే టీడీపీ ఎమ్మెల్యేలెవరైనా వైసీపీలో చేరాలంటే ముందుగా పదవులకు రాజీనామా చేసి రావాలన్న జగన్ నిర్ణయంలో మార్పు లేదని స్పష్టం చేశాయి. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాకే వంశీ మెడలో జగన్ పార్టీ కండువా వేస్తారని తేల్చిచెప్పాయి.

### సుజనాతో బలరాం భేటీ

ఒంగోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నాయకుడు సుజనా చౌదరితో టీడీపీ సీనియర్ నాయకుడు, చీరాల శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి భేటీ అయ్యారు. కొద్దిసేపు ఏకాంతంగా చర్చించుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలులో చోటుచేసుకున్న ఈ సంఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే బలరాంను బీజేపీలో చేరాలని సుజనా ఆహ్వానించారా? లేదా? అనే విషయం స్పష్టం కాలేదు. భేటీ అనంతరం బలరాం.. తాను మర్యాదపూర్వకంగానే సుజనాను కలిశాననీ, తమ భేటీలో ప్రత్యేకతేమీ లేదని తెలిపారు.

### మాజీ మంత్రి అచ్చెన్నాయుడికి బెయిల్

మంగళగిరి, అక్టోబరు 25: మాజీ మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే కె.అచ్చెన్నాయుడికి మంగళగిరి కోర్టులో బెయిల్ మంజూరైంది. సెప్టెంబరు 11న జరిగిన 'చలో ఆత్మకూరు' ఆందోళన సందర్భంగా విధుల నిర్వహణలో ఉన్న పోలీసుల పట్ల అచ్చెన్నాయుడు దురుసుగా వ్యవహరించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో ఆయనకు ఈ బెయిల్ వచ్చింది.




## ఇసుక ముసుగులో పిండేస్తున్నారు!



- కృష్ణా జిల్లాలో పోలీసు మార్కు దోపిడీ
- ట్రాన్సిట్ పాసులున్నా కాసులు ఇచ్చుకోవాల్సిందే
- లేదంటే కేసులు బనాయించి లారీలు సీజ్
- పోలీసు కష్టంతో సామాన్యులు బెంబేలు

విజయవాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇసుక తరలింపు నిబంధనల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని పోలీసులు చెలరేగిపోతున్నారు. సామాన్య ప్రజల నుంచి కాసులు కాజేస్తున్నారు. అన్నీ సక్రమంగానే ఉన్నా బెదిరించి మరీ డబ్బులు వసూలు చేస్తున్న కృష్ణాజిల్లా పోలీసుల తీరు చర్చనీయాంశంగా మారింది. సుమారు 10 నెలలుగా నెలకొన్న ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ రంగం కుదేలైంది. వేలాది కార్మికుల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. సామాన్యులు ఇళ్ల నిర్మాణం చేసుకోలేక అప్పులపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సెప్టెంబరు 5 నుంచి నూతన ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. కానీ సామాన్యులకు ఊరట కలగలేదు. జిల్లాలోని ఇసుక రీచ్‌లలో వరద కారణంగా ఇసుక లభ్యత లేదు. దీంతో పొరుగున ఉన్న జిల్లాల నుంచి ఇసుకను తెచ్చుకునేందుకు చాలామంది సిద్ధమవుతున్నారు. ఇళ్ల నిర్మాణం సగంలో నిలిచిపోయిన వారు వాటిని పూర్తి చేసుకునేందుకు కాస్త ఎక్కువ ధర చెల్లించైనా ఇసుకను తెచ్చుకునేందుకు సిద్ధపడుతున్నారు.

### ఇలా దోచేస్తున్నారు..!

ఈ నెల 23న మైలవరానికి చెందిన ఓ వ్యక్తి గుంటూరు జిల్లాలోని తాళ్లాయపాలెం రీచ్ నుంచి 20 టన్నుల ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. అదే రోజు తెల్లవారుజామున లారీలో ఇసుకను లోడ్ చేసుకుని ట్రాన్సిట్ పాస్ తీసుకుని మైలవరం బయలుదేరారు. అయితే మార్గమధ్యలో లారీ ఆగిపోవడంతో దానిని బాగుచేయించుకునేందుకు రెండు గంటల పాటు విజయవాడలో ఆగారు. అనంతరం మైలవరం బయలుదేరిన లారీని ఆగిరిపల్లి వద్ద 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసులు నిలిపారు. ఇసుకను బుక్ చేసుకున్న యజమాని అన్ని ఆధారాలూ చూపినా పోలీసులు తమకు మామూలు ఇస్తే కానీ లారీ వదలబోమని భీష్మించుకుని కూర్చున్నారు. రూ.7వేలు ఇసుకకు కట్టానని, తన వద్ద డబ్బులు లేవని యజమాని సమాధానం ఇవ్వడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నించిన యజమానికి పోలీసుల నుంచి మొరటు సమాధానమే ఎదురైంది. ఇళ్లు కట్టుకుందామని ఇసుక తీసుకెళుతుంటే ఏదో నేరం చేసిన వాడిలా తనపై 420 కేసు నమోదు చేయడం ఏమిటని యజమాని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక లారీలపై పోలీసులు ఇదే రకమైన దందా సాగిస్తున్నారు.

### నిబంధనల్లో లొసుగులే ఆధారం

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇసుక అవసరం ఉన్న వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న తర్వాత ఆ రశీదును పట్టుకుని రీచ్ వద్దకు వెళితే అక్కడ సమీపంలోని లోడింగ్ పాయింట్ వద్ద లారీలోకి ఇసుక లోడ్ చేసి ట్రాన్సిట్ పాస్ ఇస్తారు. ఈ ట్రాన్సిట్ పాస్‌లో ఎప్పుడు లోడింగ్ జరిగిందో తేదీ.. సమయం.. ఉంటాయి. లారీ నిర్దేశిత గమ్యానికి చేరడానికి పట్టే సమయం ఆధారంగా ఎంత సమయంలోగా అన్‌లోడ్ కావాలో లెక్కిస్తారు. ఉదాహరణకు గుంటూరుజిల్లా తాళ్లాయపాలెంలో 23న తెల్లవారుజామున 2 గంటలకు లారీ లోడ్ అయితే అక్కడి నుంచి మైలవరానికి చేరేందుకు సుమారు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందనుకుంటే 23 ఉదయం 5 నుంచి 6 గంటల్లోగా లారీ మైలవరంలో అన్‌లోడ్ కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత లారీ రోడ్డుపై ఉంటే దానిని అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న లారీగా గుర్తించి సీజ్ చేస్తారు. ఈ నిబంధనే పోలీసులకు వరంగా మారింది. లారీ మధ్యలో మరమ్మతులకు గురైనా.. ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యమైనా దాన్ని పరిగణనలోకి తీసుకోరు. యజమాని చెప్పే మాటలను పట్టించుకోరు. డబ్బులు ఇచ్చే లారీల విషయంలో ఓ రకంగా, ఇవ్వని లారీల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తున్నారు. కేసులు పెట్టి వేధిస్తున్నారు.

### నాయకుల లారీలు రైయ్.. రైయ్..

జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని రీచ్‌ల నుంచి భారీ ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. అలాగే గుంటుపల్లి, సూరాయపాలెం, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం ఇసుక రీచ్‌లలో అధికారికంగా తవ్వకాలను నిలిపివేసినా అనధికారికంగా అక్కడి నుంచీ ఇసుక తరలిస్తున్నారు. వీటన్నిటి వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉంది. రోజూ వందల సంఖ్యలో లారీలు ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నా పట్టించుకోని అధికారులు... సామాన్యులు లారీ ఇసుకను తీసుకెళుతుంటే కేసులు పెట్టి వేధిస్తుండటంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## పిచ్చోడి పాలనే మెరుగు

- ఏ అంశంపైనా అవగాహన లేని సీఎం
- రాజధాని కమిటీలో ముఖ్యమంత్రి బంధువు
- రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే వీడియో గేమ్సా!
- ప్రభుత్వ తీరుపై మండిపడిన టీడీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ముఖ్యమంత్రి జగన్ పాలనా తీరుపై, మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలపై బుధవారం తెలుగుదేశం పార్టీ నేతలు పలువురు విరుచుకుపడ్డారు. విశాఖ జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఇసుక కొరతపై టీడీపీ నిరాహార దీక్ష చేపట్టింది. దానికి హాజరైన మాజీ మంత్రి అయ్యన్న.. ఓ పిచ్చివాడిని సీఎం కుర్చీలో కూర్చోపెడితే జగన్ కంటే బాగా పాలన చేస్తాడని విమర్శించారు. రాజధాని అమరావతి, పోలవరం, ఇసుక.. ఏ అంశంపైనా ఆయనకు అవగాహన, స్పష్టత లేదని అన్నారు. తన 37 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇసుక కోసం ఆందోళన చేయాల్సి రావడం ఇప్పుడే చూస్తున్నానని అన్నారు. జలాశయాల్లో ఇసుక తవ్వుకోవాలని సీఎం ఇచ్చిన ఆదేశాలతో అనేక అనర్థాలు జరుగుతాయని అన్నారు. రాజధాని కమిటీలో ముఖ్యమంత్రి తన బంధువును వేసుకొన్నారని ఆరోపించారు. అమరావతికి ఇప్పటి వరకూ రూ.9వేల కోట్లు ఖర్చు అయితే రూ.35 వేల కోట్లు చంద్రబాబు దుర్వినియోగం చేశారని బొత్స సత్యన్నారాయణ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సీఎం మాత్రం రాత్రి 7 గంటల తరువాత వీడియో గేమ్స్ ఆడుకుంటున్నారని ఆరోపించారు. సచివాలయాలకు రూ.1300కోట్లు పెట్టి వైసీపీ రంగులు వేయడానికి డబ్బులు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీసులు అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. గుంటూరులో మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మీడియాతో మాట్లాడారు. ఇసుక మాఫియాకి, వైసీపీ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన ప్రదర్శనలతో ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత బయటపడిందన్నారు. గోదావరిలో పడవ తీయడం చేతకాని ప్రభుత్వం ప్రతిపక్ష నేతను తప్పుపడుతోందని ఎద్దేవా చేశారు. ధర్మాడి సత్యం బృందాన్ని సన్మానించడాన్ని రాజకీయం చేయడంపై మండిపడ్డారు. పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య.. ఢిల్లీ దీక్షకు రూ.10కోట్లు ఖర్చు పెట్టారంటూ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను తప్పు పట్టారు. దానికి రూ.1.60 కోట్లు మాత్రమే ఖర్చయ్యిందన్నారు. సోమవారం తనను పిలిస్తే.. సచివాలయంలో ఫైనాన్స్ సెక్రటరీ వద్దకు వచ్చి బాబు దీక్షకు అయిన ఖర్చు ఎంతో నిరూపిస్తానని సవాల్ చేశారు. సీఎం ఇంట్లో బాత్‌రూంకి రూ.48 లక్షలు, క్యాంపు కార్యాలయానికి రూ.15 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. సీఎం పదవి పోయిన తర్వాత దాన్ని కొత్తగా వచ్చే సీఎంకు ఇస్తారా? అని వర్ల నిలదీశారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో జరిగిన దీక్షలో మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు మాట్లాడారు. వైసీపీది రివర్స్ పాలనలా తయారైందన్నారు. అధికారం చేపట్టిన 100 రోజులకే ప్రజలు తమ సమస్యలపై రోడ్డెక్కుతున్నారని అన్నారు. రాజమహేంద్రవరంలో గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ.. సీఎం జగన్ అమరావతిపై ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాలని మీడియా ఎదుట కోరారు. ప్రజారాజధాని రావాలనుకునే వారంతా బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలను ఖండించాలన్నారు.

## ఇసుక సమస్యను పరిష్కరించకపోతే పతనమే!

- ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలి : సీపీఐ



భిక్షాటన చేస్తున్న సీపీఐ రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25: రాష్ట్రంలో బంగారం, వెండి దొరుకుతుందేమో కానీ ఇసుక దొరకడం లేదని, ఈ నెలాఖరులోగా ఇసుక సమస్యను పరిష్కరించకపోతే జగన్ ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. ఇసుక సమస్యను తక్షణం పరిష్కరించాలని, నిర్మాణరంగ కార్మికులకు రూ.20 వేలు కరవుభత్యం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజమహేంద్రవరంలో సీపీఐ భిక్షాటన చేపట్టింది. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?.. లేక ఇసుక మాఫియా రాజ్యమేలుతోందా అని ప్రశ్నించారు. ఇసుక లేకపోవడంతో 22 లక్షల మంది భవన నిర్మాణరంగ కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. వీరితో పాటు అనుబంధ రంగాల కార్మికులైన ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు కూడా ఉపాధి కోల్పోయారన్నారు. ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని, అందరికీ అందుబాటులో ఉండేలా కొత్త రీచ్‌లు తెరిచి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎల్‌అండ్‌టీ ఇసుకపై స్టేటస్‌కో!

- హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎల్‌అండ్‌టీ సంస్థకు చెందిన ఇసుక నిల్వలను ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించిన వ్యవహారంపై హైకోర్టు స్పందించింది. ఇసుక నిల్వల తరలింపులో యథాతథ స్థితి పాటించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించింది. అదేవిధంగా, ఈ వ్యవహారానికి సంబంధించి గనుల శాఖ డైరెక్టర్ జారీచేసిన మెమోను 4 వారాల పాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్‌అండ్‌టీ సంస్థ గతంలో 'ఉచిత ఇసుక పథకం' మేరకు తెచ్చుకున్న ఇసుకను గుంటూరు జిల్లా తుళ్లూరు మండలానికి చెందిన నేలపాడు, నెక్కల్లు తదితర ప్రాంతాల్లో నిల్వ చేసింది. ఈ ఇసుకను ప్రభుత్వ ఆస్తిగా ప్రకటిస్తూ గనుల శాఖ డైరెక్టర్ మెమో జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ ఎల్‌అండ్‌టీ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. పిటిషన్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. భవన నిర్మాణాల నిమిత్తం 'ఉచిత ఇసుక పథకం'లో ఎల్‌అండ్‌టీ సంస్థ 94 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేసుకుందని తెలిపారు. కనీస సమాచారం లేకుండానే తమ ఇసుకను ఇతరులకు విక్రయిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్మోహనరెడ్డి వాదిస్తూ.. నూతన ఇసుక విధానం మేరకు పిటిషనర్ ఫీజు చెల్లించి ఇసుకను తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. పైవిధంగా ఉత్తర్వులు ఇచ్చారు.

# డే/నైట్ టెస్టులకు కోహ్లీ సిద్ధమే!




ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన గంగూలీ సన్మాన కార్యక్రమంలో వీవీఎస్ లక్ష్మణ్, అజరుద్దీన్

**కోల్‌కతా:** సమీప భవిష్యత్‌లో భారత జట్టు డే అండ్ నైట్ టెస్టులు ఆడడం ఖాయమని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ స్పష్టం చేశాడు. ఈ తరహా టెస్టులను ఆడేందుకు భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ఆసక్తిగా ఉన్నాడని తెలిపాడు. 'పింక్ బాల్ టెస్టులు ఆడేందుకు కోహ్లీ కూడా ఇష్టపడుతున్నాడు. డే అండ్ నైట్ టెస్టులపై కోహ్లీ విముఖత చూపుతున్నట్టు గతంలో వచ్చిన కథనాలన్నీ అబద్ధం. కెప్టెన్ నుంచి సానుకూలత వ్యక్తమైతే ఈ తరహా టెస్టులకు మార్గం మరింత సులువైనట్టే. భారత జట్టు గులాబీ టెస్టు ఎప్పుడు ఆడుతుందనేది కచ్చితంగా చెప్పలేను కానీ నేను పదవిలో ఉన్న సమయంలోనే గట్టిగా కృషి చేస్తా' అని ఈడెన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో గంగూలీ వివరించాడు. అయితే భారత జట్టు స్వదేశంలో టెస్టు సిరీస్ వచ్చే ఏడాది చివర్లో ఆడే అవకాశం ఉంది. కానీ అప్పటికి దాదా పదవీకాలం ముగియనుంది.

### ఎన్‌సీఏను పునరుద్ధరించాలి: లక్ష్మణ్

వర్ధమాన క్రికెటర్లను రాటుదేల్చేలా జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)ని పునరుద్ధరించాలని బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీని లక్ష్మణ్ కోరాడు. కొన్నేళ్లుగా గాయపడిన ఆటగాళ్లకు పునరావాస శిబిరంగానే ఎన్‌సీఏ ఉపయోగపడుతోంది. 'ఎన్‌సీఏను తిరిగి ట్రాక్‌పైకి తీసుకురాగల సామర్థ్యం గంగూలీకి ఉంది. ప్రస్తుత భారత జట్టు పటిష్ఠంగా ఉండడానికి కారణం రిజర్వ్ బెంచ్. ఇటీవల దక్షిణాఫ్రికా చిత్తుగా ఓడడానికి అక్కడి దేశవాళీ నిర్మాణం సరిగా లేకపోవడమే. కానీ భారత్‌లో అలా కాదు. ఇక ఎన్‌సీఏ ద్వారా సుదీర్ఘ కాలం భవిష్యత్ చాంపియన్లను తయారు చేసుకోవచ్చు' అని లక్ష్మణ్ అన్నాడు.

# హజారే విజేత కర్ణాటక



## అభిమన్యు హ్యాట్రిక్

కర్ణాటక మీడియం పేసర్ అభిమన్యు మిథున్ తమిళనాడు బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించాడు. ఆరంభ ఓవర్లోనే ఓపెనర్ మురళీ విజయ్‌ను మిథున్ డకౌట్ చేశాడు. తర్వాత జోరుమీదున్న విజయ్ శంకర్‌ను వెనక్కి పంపాడు. ఇక ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో అతను వరుస బంతుల్లో మసూద్ షారుఖ్ ఖాన్ (27), మహ్మద్ (10), మురుగన్ అశ్విన్ (0)లను అవుట్ చేసి.. హ్యాట్రిక్ నమోదు చేశాడు. తద్వారా పుట్టినరోజున ఈ టోర్నీలో హ్యాట్రిక్ సాధించిన తొలి కర్ణాటక బౌలర్‌గా నిలిచాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో 30 ఏళ్ల అభిమన్యుకు ఇదే తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కావడం విశేషం.

## ఫైనల్లో తమిళనాడు ఓటమి



**బెంగళూరు:** డిఫెండింగ్ చాంపియన్ కర్ణాటక విజయ్ హజారే ట్రోఫీని నిలబెట్టుకుంది. బర్త్‌డే బాయ్ అభిమన్యు మిథున్ (5/34) హ్యాట్రిక్‌తో చెలరేగడంతో పాటు మయాంక్ అగర్వాల్ (55 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 69 నాటౌట్), కేఎల్ రాహుల్ (72 బంతుల్లో 5 ఫోర్లతో 52 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీలతో రాణించారు. దీంతో కర్ణాటక నాలుగోసారి టైటిల్ కైవసం చేసుకుంది. గురువారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన వర్ష ప్రభావిత ఫైనల్లో కర్ణాటక 60 పరుగుల తేడాతో ఐదుసార్లు విజేత తమిళనాడుపై గెలిచింది. అంతకుముందు 2013-14, 2014-15, 2017-18 సీజన్లలో కర్ణాటక ఈ టోర్నీలో విజేతగా నిలిచింది. తొలుత అభినవ్ ముకుంద్ (110 బంతుల్లో 9 ఫోర్లతో 85), బాబా అపరాజిత్ (84 బంతుల్లో 7 ఫోర్లతో 66) అర్ధ సెంచరీలతో సత్తా చాటడంతో.. తమిళనాడు 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. మురళీ విజయ్ (0) డకౌట్‌కాగా.. రవిచంద్రన్ అశ్విన్ (8) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరాడు. ఈ దశలో అభినవ్-అపరాజిత్ మూడో వికెట్‌కు 124 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆదుకున్నారు. అభిమన్యు 5 వికెట్లు పడగొట్టగా.. ప్రతీక్ జైన్, కృష్ణప్ప గౌతమ్ చెరో వికెట్ తీశారు. ఛేదనలో కర్ణాటక 23 ఓవర్లలో 146/1 స్కోరు వద్ద ఉండగా.. వర్షంతో ఆటను నిలిపేశారు. దేవ్‌దత్ పడిక్కాల్ (11) విఫలమైనా..మయాంక్-రాహుల్ రెండో వికెట్‌కు 112 రన్స్ జోడించారు. తర్వాత మ్యాచ్‌ను కొనసాగించే వీలు లేకపోవడంతో వీజేడీ పద్ధతి (దేశవాళీ టోర్నీల్లో వర్ష ప్రభావిత మ్యాచ్‌లకు)లో కర్ణాటకను విజేతగా ప్రకటించారు.

**సంక్షిప్త స్కోర్లు**

**తమిళనాడు: 252 ఆలౌట్** (అభినవ్ ముకుంద్ 85, బాబా అపరాజిత్ 66, విజయ్ శంకర్ 38, షారూఖ్ ఖాన్ 27; అభిమన్యు మిథున్ 5/34, కౌశిక్ 2/39).

**కర్ణాటక: 146/1** (మయాంక్ అగర్వాల్ 69 నాటౌట్, కేఎల్ రాహుల్ 52 నాటౌట్, దేవ్‌దత్ 11; వాషింగ్టన్ సుందర్ 1/51).

## బాక్సింగ్ ఫైనల్లో దీపక్

**ప్రపంచ మిలిటరీ క్రీడలు**

**వుహాన్ (చైనా):** ప్రపంచ మిలిటరీ క్రీడల్లో భారత బాక్సర్ దీపక్ 49 కిలోల విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లి కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నాడు. సెమీస్‌లో దీపక్ 5-0తో అలిజదా సల్మాన్ (అజర్‌బైజాన్)ను చిత్తుచేశాడు. శనివారం జరిగే టైటిల్‌ఫైట్‌లో జుసుపోవ్ టెమిర్తాస్ (కజకిస్థాన్)తో దీపక్ తలపడనున్నాడు. ఇక.. 20 కిలో మీటర్ల రేస్ వాక్‌లో భారత అథ్లెట్ కేటీ ఇర్ఫాన్ త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు. ఇర్ఫాన్ గంటా 25 నిమిషాల సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని నాలుగోస్థానంలో నిలిచాడు.

## తొలిసారి ట్రయల్స్‌లో నిరాశే ఎదురైంది



**ముంబై:** ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజ బ్యాట్స్‌మన్‌గా పేరు తెచ్చుకున్న సచిన్ టెండూల్కర్‌ను తొలిసారి సెలెక్షన్ ట్రయల్స్‌కు వెళ్లినప్పుడు ఎవరూ ఎంపిక చేయలేదట. దీంతో మరింతగా కష్టపడి అనుకున్నది సాధించానని తెలిపాడు. 'నేను విద్యార్థిగా ఉన్నప్పుడు ఎలాగైనా భారత జట్టుకు ఆడాలని పరితపించేవాడిని. 11 ఏళ్ల వయస్సులో నా క్రికెట్ ప్రయాణం ప్రారంభమైంది. అయితే మొదటిసారి సెలెక్షన్ ట్రయల్స్‌కు వెళ్లినప్పుడు నన్ను సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. అంతేకాకుండా మరింత కష్టపడి ఆటను మెరుగుపర్చుకోవాలని సలహా ఇచ్చారు. అప్పుడు నేను మెరుగ్గానే బ్యాటింగ్ చేసినప్పటికీ ఎంపిక కానందుకు చాలా నిరాశపడ్డా. అయితే ఆ కసితో క్రికెట్‌పై అంకితభావం మరింతగా పెరిగింది' అని ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సచిన్ తెలిపాడు. అలాగే తన సక్సెస్‌కు కోచ్ అచ్రేకర్‌తో పాటు కుటుంబసభ్యుల సహకారం కారణమని చెప్పాడు. తన సోదరి తొలిసారిగా క్రికెట్ బ్యాట్ కొనిచ్చిందని గుర్తుచేసుకున్నాడు. సచిన్ రాజ్యసభ ఎంపీగా ఉన్నప్పుడు అతను ఈ స్కూల్‌కు మంజూరు చేసిన నిధులతో మూడు తరగతి గదులను నిర్మించారు.



## బుమ్రా, మంధానాకు విజ్డన్ పురస్కారాలు

**బెంగళూరు:** భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధానా ప్రతిష్ఠాత్మక విజ్డన్ పురస్కారాలకు ఎంపికయ్యారు. విజ్డన్ ఇండియా అల్మనాక్ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'ను బుమ్రా, స్మృతి గెలుచుకున్నారు. ఈ అవార్డు కోసం శుక్రవారం ప్రకటించిన ఐదుగురు ఆసియా విజేతల్లో ఇద్దరు మనోళ్లే ఉండడం విశేషం. మిగతా ముగ్గురు పాకిస్థాన్ క్రికెటర్ ఫఖర్ జమాన్, శ్రీలంకకు చెందిన దిముత్ కరుణరత్నె, అఫ్ఘానిస్థాన్ సంచలనం రషీద్ ఖాన్. కాగా.. భారత యువ క్రికెటర్ మయాంక్ అగర్వాల్ పేరు కూడా విజ్డన్ సంచికకెక్కింది. 2019, 2020కి గాను ఏడో ఎడిషన్ వార్షిక క్రికెట్ సంచికల్లో మయాంక్ అగర్వాల్‌కు సంబంధించి ప్రత్యేక కథనం ముద్రించారు. దక్షిణాఫ్రికాతో ఇటీవలే ముగిసిన టెస్టు సిరీస్‌లో మయాంక్ డబుల్ సెంచరీతో విజృంభించిన సంగతి తెలిసిందే. కాగా.. మిథాలీ రాజ్, దీప్తి శర్మ తర్వాత విజ్డన్ అవార్డుకు ఎంపికైన మూడో భారత మహిళా క్రికెటర్ స్మృతి. భారత మాజీలు గుండప్ప విశ్వనాథ్, లాలా అమర్‌నాథ్ విజ్డన్ ఇండియా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు.

# సౌరవ్‌దే 'సెలెక్షన్'!

**ఎమ్మెస్కే భవిత దాదా చేతిలో!**



కెప్టెన్‌గా టీమిండియాను సౌరవ్ గంగూలీ కొత్త పుంతలు తొక్కించాడు.. దూకుడైన నాయకత్వంతో ప్రపంచ క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని జట్టుగా నిలిపాడు.. యువ ఆటగాళ్లను వెన్నుతట్టి వారు తమ ప్రతిభను వందశాతం ప్రదర్శించేలా ప్రోత్సహించాడు.. అలాంటి గంగూలీ ఇప్పుడు బీసీసీఐ బాస్‌గా కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు..పరిపాలకుడిగా అతడు తీసుకొనే తొలి పెద్ద నిర్ణయం జాతీయ సెలెక్షన్ కమిటీపైనే కానుంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

**టీ**మిండియా కెప్టెన్‌గా భారత క్రికెట్ పరిపాలనను సౌరవ్ గంగూలీ చాలా దగ్గరగా గమనించాడు. క్రికెట్‌ను మతంగా భావించే సువిశాల భారతంలో అభిమానుల అంచనాలకు అనుగుణంగా బోర్డును నడిపించడం ఎలానో అతడు గుర్తించే ఉంటాడు. లోధా సంస్కరణల నేపథ్యంలో బీసీసీఐకి కొత్త రాజ్యాంగం ఏర్పడింది. దానిపై బోర్డు కార్యవర్గంతోపాటు అనుబంధ సంఘాలూ పూర్తిగా అవగాహనకు రావాల్సి ఉంది. ఇకపోతే.. అధ్యక్షుడిగా సౌరవ్ తీసుకొనే మొట్టమొదటి ప్రధాన నిర్ణయం జాతీయ సెలెక్షన్ కమిటీపైనే. అంటే.. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని టీమిండియా సెలెక్షన్ కమిటీ భవితవ్యం గంగూలీ చేతిలో ఉందన్నమాట. రాజ్యాంగం ప్రకారం ప్రస్తుత సెలెక్షన్ కమిటీ పదవీ కాలం ముగిసేందుకు ఇంకా చాలా సమయమే ఉంది. వాస్తవంగా బోర్డు పాత రాజ్యాంగం ప్రకారం సెలెక్టర్ల పదవీ కాలం నాలుగేళ్లే. కానీ సవరణల అనంతరం దాన్ని గరిష్ఠంగా ఐదేళ్లకు పెంచారు. బీసీసీఐ రాజ్యాంగంలోని క్లాజ్ 26(3) ప్రకారం ఏ క్రికెట్ కమిటీలోనూ ఐదేళ్లపాటు సభ్యుడిగా కొనసాగని వారు.. ఏ క్రికెట్ కమిటీకైనా ఎంపిక య్యేందుకు అర్హులు. ఎమ్మెస్కే ప్రసాద్ (సౌత్‌జోన్), గగన్ ఖోడా (సెంట్రల్‌జోన్) 2015లో జరిగిన బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ద్వారా సెలెక్టర్లుగా నియమితులయ్యారు. సాంకేతికంగా వారి పదవీ కాలం 2020 సెప్టెంబరుతో ముగుస్తుంది. మిగతా సభ్యులు జతిన్ పరాంజపే (వెస్ట్‌జోన్), శరణ్‌దీప్ సింగ్ (నార్త్‌జోన్), దేవంగ్ గాంధీ (ఈస్ట్‌జోన్) 2016లో నియమితులు కావడంతో వారి పదవీ కాలం మరో రెండేళ్లు ఉంది.

**ఏమవుతుంది..?**

అయితే కమిటీలో మార్పులు చేర్పుల గురించి సెలెక్టర్లతో సమావేశంలో గంగూలీ చర్చించే అవకాశం ఉంది. మరోవైపు సెలెక్టర్ల కాంట్రాక్ట్‌లను ప్రతి ఏజీఎంలో పునరుద్ధరించాలన్న క్లాజ్ కూడా చర్చకు వస్తోంది. కానీ, 2017, 18లలో బీసీసీఐ పాలన సీవోఏ చేతిలో ఉండడంతో ఆ రెండు సంవత్సరాల్లో ఏజీఎం జరగలేదు. ఎమ్మెస్కే, ఖోడా స్థానాలను మరొకరితో భర్తీ చేస్తామని గంగూలీ ఈపాటికే సంకేతాలిచ్చాడు. పరాంజపే, గాంధీ, శరణ్‌దీప్‌లకు మరో ఏడాది మిగిలి ఉంది. కానీ, పాత రాజ్యాంగం ప్రకారం దాదా అలా అని ఉండొచ్చని భావిస్తున్నారు. 'ముగ్గురు సెలెక్టర్లను అలాగే కొనసాగిస్తూ.. మరో ఇద్దరిని మార్చే అధికారం అధ్యక్షుడికి ఉంది. లేకపోతే కొత్తగా ఐదుగురు సెలెక్టర్ల ప్యానెల్‌ను ఎంపిక చేయాలని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)ని గంగూలీ కోరే అవకాశం ఉంద'ని బోర్డు సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. నిబంధనల ప్రకారం సెలెక్టర్ల పదవీకాలం పూర్తికాలేదనే విషయాన్ని సంబంధిత వ్యవహారాలు పర్యవేక్షించే వారు బోర్డు అధ్యక్షుడికి వివరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సెలెక్షన్ కమిటీని ఎంపిక చేసేది సీఏసీ. త్వరలో జరగబోయే ఏజీఎంలో ఈ క్రికెట్ సలహా కమిటినీ నియమించే అవకాశం ఉంది.

**స్పందించేందుకు ఎమ్మెస్కే నిరాకరణ**

జాతీయ సెలెక్షన్ కమిటీపై చర్చలు జరుగుతున్న తరుణంలో..ఈ విషయమై స్పందించేందుకు చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ నిరాకరించాడు. అన్ని ఫార్మాట్లలో అన్ని విభాగాలలో పటిష్ఠమైన రిజర్వ్ బెంచ్‌ను తయారు చేసినందుకు ఈ సెలెక్షన్ కమిటీ గర్విస్తోందని మాత్రమే ఆతడు చెప్పాడు.

## ప్రపంచ స్క్వాష్‌లో జోష్న బోణీ

**కైరో:** భారత స్టార్ జోష్న చినప్ప ప్రపంచ మహిళల స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో ముందంజ వేసింది. మహిళల సింగిల్స్ తొలిరౌండ్లో 12వ సీడ్ జోష్న 9-11, 12-10, 8-11, 11-6, 11-6తో అన్‌సీడెడ్ హేలీ మెండెజ్ (అమెరికా)పై విజయం సాధించింది. మరో భారత అమ్మాయి సునయన కురువిల్లా 11-8, 7-11, 4-11, 5-11తో నెలె గిలిస్ (బెల్జియం) చేతిలో ఓడి ఇంటిబాట పట్టింది. కాగా.. ఇక్కడే జరుగుతున్న పురుషుల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత నెంబర్‌వన్ ఆటగాడు సౌరవ్ ఘోషల్‌కు తొలిరౌండ్లో బై లభించింది. దీంతో అతను నేరుగా రెండోరౌండ్ ఆడనున్నాడు.

## సెమీస్‌లో సాత్విక్ జోడీ




**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు కుర్రాడు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జంట జోరు కొనసాగుతోంది. గతరౌండ్లో ప్రపంచ చాంపియన్ జోడీకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఈ యువ ద్వయం క్వార్టర్స్‌లోనూ విజయఢంకా మోగించింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్ జంట 21-13, 22-20తో డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ 8వ ర్యాంకర్ కిమ్ ఆస్ట్రప్-ఆండ్రెస్ స్కారప్ రస్‌ముస్సెన్ జోడీని కంగుతినిపించి సెమీఫైనల్ చేరింది. మూడోసీడ్ లి జున్ హూ-లూ యు చెన్, ఐదోసీడ్ హిరోయుకి ఎన్‌డో-యుటా వటానబె జోడీల మధ్య జరిగే క్వార్టర్స్ విజేతతో సాత్విక్ జంట ఫైనల్ బెర్త్ కోసం తలపడనుంది. ఇటీవల వరుస టోర్నమెంట్లలో విఫలమవుతున్న సైనా నెహ్వాల్‌కు ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ చుక్కెదురైంది. తొలి రెండురౌండ్లను సునాయాసంగా అధిగమించిన ఈ ఏస్ షట్లర్ క్వార్టర్స్‌ను మాత్రం దాటలేకపోయింది. హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సైనా 20-22, 21-23తో ప్రపంచ 16వ ర్యాంకర్ అన్ సె యంగ్ చేతిలో పరాజయంపాలై ఇంటిబాట పట్టింది. 49 నిమిషాల పాటు జరిగిన థ్రిల్లింగ్ ఫైట్‌లో సైనా దీటుగా పోరాడినా, ఆఖర్లో ప్రత్యర్థి షాట్లకు బదులివ్వడంలో విఫలమై మూల్యం చెల్లించుకుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్ తర్వాత సైనా క్వార్టర్స్ చేరిన తొలి టోర్నీ ఇదే. గత చివరి మూడు టోర్నీలైన చైనా, కొరియా, డెన్మార్క్ ఓపెన్‌లలో సైనా ఆరంభరౌండ్‌లోనే వెనుదిరిగింది.

# ఓటమితో మొదలెట్టారు



**కోల్‌కతా చేతిలో హైదరాబాద్ చిత్తు**

**కోల్‌కతా:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)-6లో నూతన జట్టు హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌లోనే అభిమానులను నిరాశపర్చింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఏటీకే (కోల్‌కతా) చేతిలో 0-5తో పరాజయం పాలైంది. ఆట తొలి అర్ధభాగంలోనే మూడు గోల్స్ నమోదు చేసిన కోల్‌కతా సెకండాఫ్ చివర్లో మరో రెండు గోల్స్ కొట్టి ఘన విజయం సాధించింది. డేవిడ్ జోయల్ విలియమ్స్ (25వ ని., 44వ ని.,) గార్సియా మార్టిన్ (88వ ని., 90వ ని.,) చెరో రెండో గోల్స్ సాధించగా.. రాయ్ కృష్ణ (27వ ని.) ఓ గోల్ చేశాడు. హైదరాబాద్ స్టార్ ఆటగాళ్లు మార్సిలిన్హో, గైల్స్, రాబిన్ సింగ్ ఘోరంగా విఫలమయ్యారు. తొలి అర్ధభాగంలో ఏటీకే దూకుడు ముందు పూర్తిగా తేలిపోయిన హైదరాబాద్ సెకండాఫ్‌లో కాస్త పుంజుకుంది. అయితే, చివర్లో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన మార్టిన్ రెండు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి హైదరాబాద్‌ను దెబ్బకొట్టాడు.





ముంబైలో అంబానీ కుటుంబం శుక్రవారం ఏర్పాటు చేసిన దీపావళి పార్టీకి సతీసమేతంగా హాజరైన రోహిత్ శర్మ, యువరాజ్ సింగ్, జహీర్ ఖాన్.



## 'మహాత్ముడితో మోదీ' పెయింటింగ్‌కు రూ. 25 లక్షలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ప్రధాని మోదీకి వివిధ సందర్భాల్లో ఇతర దేశాధినేతలు, రాజకీయ నాయకులు ఇచ్చిన జ్ఞాపికలు, బహుమతుల ఈ-వేలం శుక్రవారం ముగిసింది. మహాత్మా గాంధీతో మోదీ ఉన్న పెయింటింగ్ అత్యధికంగా రూ. 25 లక్షలకు శుక్రవారమే అమ్ముడుపోయింది. వేలం ద్వారా వచ్చిన డబ్బునంతా నమామి గంగే మిషన్‌కు విరాళంగా ఇవ్వనున్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సెప్టెంబరు 14 నుంచి వేలాన్ని ప్రారంభించింది. మొత్తం 2,772 బహుమతులను వేలం వేశారు. మోదీ తన మాతృమూర్తి వద్ద ఆశీర్వాదం తీసుకొంటున్న ఫొటో రూ. 20 లక్షలకు అమ్ముడుపోయింది.



## రొమ్ము కేన్సర్‌ను గుర్తించిన మ్యూజియం కెమెరా

లండన్, అక్టోబరు 25: బాల్‌గిల్ (41).. యూకేలోని బెర్క్‌షైర్‌కు చెందిన ఈ మహిళ ఎడింబర్గ్‌లోని ఓ మ్యూజియంకు వెళ్లకపోయి ఉంటే తనకు రొమ్ము కేన్సర్ ఉన్న విషయాన్ని చాలా ఆలస్యంగా తెలుసుకొనేది! ఆ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఒక థర్మల్ ఇమేజింగ్ కెమెరా వల్ల కేన్సర్ విషయాన్ని తొలిదశలోనే తెలుసుకోగలిగింది. మనుషుల శరీరాల్లో వేడిగా ఉండే ప్రదేశాలను గుర్తించే కెమెరా అది. అక్కడికి వెళ్లిన బాల్‌గిల్.. థెర్మల్ ఇమేజింగ్ కెమెరా ముందు పోజు ఇచ్చినప్పుడు తన ఎడమ రొమ్ములో కొంత భాగం ఎర్రగా ఉండటాన్ని గుర్తించింది. బ్రెస్ట్ కేన్సర్ తొలిదశలో ఉన్నట్టు గుర్తించిన వైద్యులు ఆమెకు చికిత్స చేస్తున్నారు.



## అకస్మాత్తుగా అపరకుబేరుడు!

న్యూయార్క్, అక్టోబరు 25: అమ్మానాన్న ఇచ్చిన బహుమతితో అకస్మాత్తుగా అపర కుబేరుడైపోయాడీ కుర్రాడు. పేరు ఎరిక్ సే. వయసు 24. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ 'సినో బయోఫార్మా' ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సే పింగ్ దంపతుల ముద్దు బిడ్డ. కంపెనీ షేర్లలో ఐదో వంతు వాటాను వారు అతడికి బహుమతిగా ఇచ్చారు. వాటి విలువ.. దాదాపు రూ.27 వేల కోట్లు! అంతే.. రాత్రికిరాత్రి అతడు ఆసియాలోనే అత్యంత ధనవంతుల్లో ఒకడుగా, ప్రపంచంలోనే 550 మంది అత్యంత సంపన్నుల్లో ఒకడుగా నిలిచాడు.

## రెండు పత్రికలపై ట్రంప్ కన్నెర్ర

వాషింగ్టన్, అక్టోబరు 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాయన్న కారణంతో రెండు పత్రికలపై కన్నెర్రజేశారు. వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ పత్రికలు వైట్‌హౌస్‌లో కనిపించవద్దంటూ హుకుం జారీ చేశారు. అవి 'నకిలీ' పత్రికలు అని, వాటిని ఇతర శాఖల్లోనూ రద్దు చేయాలని ఆదేశించారు.

## మహా వినాశనానికి దక్కన్ ట్రాప్స్ మందు

డెన్వర్, అక్టోబరు 25: దాదాపు 66 మిలియన్ సంవత్సరాల క్రితం.. భూమ్మీద ఉన్న రాక్షసబల్లుల అంతానికి కారణమైన గ్రహశకలం తాకిడికి భూమ్మీద ఉన్న జీవాల్లో 75 శాతం మేర అంతరించిపోయాయి. పరిమాణంలో.. ఎలుకలకు మించిన క్షీరదాలు ఒక్కటి కూడా బతకలేదు. వృక్షజాతుల్లో దాదాపు 50 శాతం తుడిచిపెట్టుకుపోయాయి. కానీ, ఆశ్చర్యకరంగా భూమ్మీద పర్యావరణ వ్యవస్థ ఊహించిన దానికన్నా వేగంగా పూర్వస్థితికి చేరుకుంది. అలా చేరుకోవడంలో మన దక్కన్‌ట్రాప్స్ పాత్ర కూడా ఉందని శాస్త్రజ్ఞులు విశ్లేషిస్తున్నారు. ఆ గ్రహశకలం తాకిడి తర్వాత కొన్నాళ్లకే ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల సెల్సియస్ మేర పెరగడం దీనికి కారణమని వారి అంచనా. ఆ సమయంలో మనదేశంలోని దక్కన్‌ట్రాప్స్‌లో అగ్నిపర్వతాల పేలుడు సంభవించడం వల్ల కార్బన్‌డయాక్సైడ్ విడుదలై భూమిని వెచ్చగా ఉంచాయని వారు వివరించారు. ఆ వేడి వృక్షజాతుల్లో, తద్వారా క్షీరదాల్లో మార్పులకు కారణమైందని విశ్లేషించారు. దక్కన్ ట్రాప్స్ అంటే.. పశ్చిమ మధ్య భారతదేశంలోని దక్కను పీఠభూమిలో ఉన్న అగ్నిపర్వత ప్రాంతాలు.



పలై రాయల్.. దేశంలోనే ఎత్తైన నివాస సముదాయ కట్టడం. వర్లీ నాకాలోని 56 అంతస్తులతో దీని నిర్మాణం చేపట్టగా.. ఉల్లంఘనల ఆరోపణలతో పదేళ్లుగా న్యాయవివాదాల్లో చిక్కుకుంది. ఎట్టకేలకు ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం పచ్చజెండా ఊపింది.

# జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ముర్ము

### లద్దాఖ్‌కు మాథుర్, సత్యపాల్ గోవాకు బదిలీ.. మిజోరం గవర్నర్‌గా కేరళ బీజేపీ చీఫ్ పిళ్లై

న్యూఢిల్లీ, అక్టోబరు 25: జమ్మూకశ్మీరు, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త లెఫ్టినెంట్ గవర్నర్లు నియమితులయ్యారు. జమ్మూకశ్మీరు యూటీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కేంద్ర వ్యయవిభాగ కార్యదర్శి గిరీశ్ చంద్ర ముర్ము, లద్దాఖ్‌కు రక్షణ శాఖ మాజీ కార్యదర్శి రాధాకృష్ణ మాథుర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ శుక్రవారం ప్రకటన చేసింది. జమ్మూకశ్మీరు ప్రస్తుత గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను గోవాకు బదిలీ చేశారు. గిరీశ్ చంద్ర గుజరాత్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆర్థిక శాఖలో వ్యయ విభాగ కార్యదర్శిగా ఉన్న ఆయన వచ్చే నెలలో రిటైర్ కానున్నారు. మాథుర్ త్రిపుర కేడర్ ఐఏఎస్. ఆయన గతంలో రక్షణ శాఖ కార్యదర్శిగా, ముఖ్య సమాచార కమిషనర్‌గా పని చేశారు. జమ్మూకశ్మీరులో పార్టీలు, సంస్థలతో చర్చలు జరిపే ఇంటర్‌లొక్యూటర్‌గా ఉన్న దినేశ్వర్ శర్మను లక్షదీవులకు అడ్మినిస్ట్రేటర్‌గా నియమితులయ్యారు. మిజోరం గవర్నర్‌గా బీజేపీ కేరళ అధ్యక్షుడు శ్రీధరన్ పిళ్లై నియమితులయ్యారు.



గిరీశ్ చంద్ర ముర్ము



రాధాకృష్ణ మాథుర్



సత్యపాల్ మాలిక్

# గెలిచినా గుంభనమే!

### చర్చలు జరపని బీజేపీ, శివసేన.. ప్రభుత్వ ఏర్పాటుపై ఇరువురి మౌనం



సంజయ్ రౌత్ ట్వీట్ చేసిన కార్టూన్ ఇదే

ముంబై, అక్టోబరు 25: బీజేపీ-శివసేన కూటమి గెలిచింది. కానీ... ప్రభుత్వ ఏర్పాటుపై ఇరుపక్షాల మధ్య ఎలాంటి అధికారిక చర్చలు జరగలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కూటమి తరఫున సంసిద్ధత వ్యక్తం చేయలేదు. ఇరు వైపులా గుంభనమే. మరోవైపు... బీజేపీపై శివసేన విమర్శలు, చురకలు కొనసాగుతున్నాయి. శివసేన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకుడు సంజయ్ రౌత్ శుక్రవారం ఒక కార్టూన్ ట్వీట్ చేశారు. అందులో... కమలం పువ్వు వాసన చూస్తున్న పెద్ద పులి! ఆ పులి మెడలో వేలాడుతున్న 'గడియారం'! పెద్ద పులి... శివసేన చిహ్నం. కమలం బీజేపీ, గడియారం ఎన్సీపీ ఎన్నికల గుర్తులు. అంటే... కమలం(బీజేపీ)తో కలిసి సాగుతూనే... అవసరమైతే ఎన్సీపీతో దోస్తీ చేస్తామని శివసేన చెప్పకనే చెప్పిందా? కూటమిగా విజయం సాధించినప్పటికీ... అనుకున్నన్ని సీట్లు రాకపోవడంతో శివసేన స్వరం పెంచిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి పీఠాన్ని చెరోసగం పంచుకోవాలని కూడా డిమాండ్ చేసింది. అయితే... 15 మందికిపైగా రెబల్స్ తమతోనే ఉన్నారని, తానే మళ్లీ సీఎంను అని దేవేంద్ర ఫడణవీస్ తేల్చిచెప్పారు. నిజానికి... ఆరుగురు రెబల్స్, ఐఎన్‌ఎల్‌డీ సభ్యుడొకరు బీజేపీకి మద్దతు పలికే అవకాశముంది. ఇక... శనివారం కొత్త ఎమ్మెల్యేలతో శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే సమావేశం కానున్నారు. 'మిత్రుల' మధ్య సాగుతున్న అంతర్గత పోరును ఎన్సీపీ పరిశీలిస్తోంది. శివసేనకు ఎన్సీపీ మద్దతిచ్చే అవకాశాలపైనా వార్తలు వచ్చాయి. అయితే... తాము విపక్షానికే పరిమితమవుతామని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ కూడా ఇదే విషయం చెప్పింది.

**విపక్ష హోదా ఎవరిది?**

అధికార పక్షం సంగతి సరేసరి! మరి... మహారాష్ట్రలో విపక్ష హోదా ఎవరిది? దీనిపైనా చర్చ జరుగుతోంది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కంటే ఎన్సీపీకి ఒక్కస్థానం ఎక్కువ వచ్చింది. అయినా... విపక్ష హోదాను కాంగ్రెస్‌కే వదిలేసింది. ఈసారి కాంగ్రెస్ 44 స్థానాలకు పరిమితంకాగా, ఎన్సీపీ 54 సీట్లు దక్కించుకుంది. ఈ నేపథ్యంలో విపక్ష హోదా ఎన్సీపీకే దక్కుతుందని భావిస్తున్నారు.

**అహంకారానికి చెంపపెట్టు!**

మిత్రపక్షం బీజేపీపై 'పులి' గర్జిస్తూనే ఉంది. కమలం పార్టీకి అనుకున్నన్ని సీట్లు రాకపోవడంతో... 'సీఎం పదవిని కలిసి పంచుకోవాలి' అని షరతు విధించిన శివసేన... తాజాగా విపక్ష ఎన్సీపీ నేత శరద్ పవార్‌ను ఆకాశానికి ఎత్తేసింది. బీజేపీకి బాగా చురకలు అంటించింది. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ శివసేన అధికార పత్రిక 'సామ్నా' ప్రత్యేక సంపాదకీయం రాసింది. "మహా జనాదేశ్ పేరిట సీఎం ఫడణవీస్ ఎన్నికల ముందు 200 నియోజకవర్గాల్లో పర్యటించారు. కానీ... ప్రజా తీర్పు భిన్నంగా వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీని బీజేపీ మట్టి కరిపించింది. ఇక... ఎన్సీపీ కథ ముగిసినట్లే అని అంతా అనుకున్నారు. కానీ.. నెలల్లోనే పవార్ సత్తా చూపించారు. నాయకుడేలేని కాంగ్రెస్ కూడా 33 స్థానాలు గెలుచుకుంది. అధికారంలో ఉన్నవారి అహంకారానికి ఈ తీర్పు ఒక చెంపపెట్టు" అని సామ్నా పేర్కొంది.




మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఆదిత్య ఠాక్రే అని తలపించేలా పోస్టర్లు వెలిశాయి. 'మహారాష్ట్ర భావి సీఎం' అంటూ వర్లి నియోజకవర్గం అంతటా తాజాగా పోస్టర్లు కనిపిస్తున్నాయి.

## బీజేపీని ఎలా ఎదుర్కొందాం?

### కాంగ్రెస్ మేధోమథనం... సీనియర్ నేతల బృందంతో సోనియా భేటీ



న్యూఢిల్లీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకోవడం కాంగ్రెస్‌కు కొంత ఊరట కలిగించింది. ఈ క్రమంలో బీజేపీని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కాంగ్రెస్ మేధోమథనం చేపట్టింది. పార్టీ అధినేత్రి సోనియా గాంధీతో 17 మంది కాంగ్రెస్ సీనియర్ నేతల బృందం శుక్రవారం సమావేశమైంది. విధానపరమైన అంశాలపై అధ్యయనం చేసి, ప్రణాళిక రూపొందించడానికి ఈ బృందాన్ని సోనియా నియమించారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాలతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. మహారాష్ట్ర, హరియాణా ఫలితాలను విశ్లేషించడంతో పాటు భవిష్యత్తు ప్రణాళిక, వచ్చే నెల 18న మొదలయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు సమాచారం. రైతులు, వర్తకులు, పరిశ్రమ వర్గాల సమస్యలపై చర్చించామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా తెలిపారు. నాయకుల బృందంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తదితరులున్నారు. హరియాణాలో బీజేపీని ప్రభుత్వం ఏర్పాటు చేయనివ్వకుండా ప్రయత్నాలు ముమ్మరం చేసే అంశంపైనా చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే, సాయంత్రానికి పలువురు స్వతంత్రులు బీజేపీకి మద్దతు ప్రకటించడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయి.

## 'కంద'రగోళం!



- హరియాణాలో ప్రభుత్వ ఏర్పాటుకు గోపాల్ కందా మద్దతు
- అధికారం కోసం రేపిస్టుల మద్దతా: కాంగ్రెస్

చండీగఢ్, అక్టోబరు 25: హరియాణాలో అధికారంలోకి రావాలంటే బీజేపీకి ఇంకా ఆరుగురు ఎమ్మెల్యేలు కావాలి. వివాదాస్పద రాజకీయ నాయకుడు, హరియాణా లోక్‌హిత్ పార్టీ ఎమ్మెల్యే గోపాల్ కందాతోపాటు మరో ఐదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇస్తున్నారని శుక్రవారం బీజేపీ ప్రకటించింది. బీజేపీకి బేషరతుగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు కందా కూడా ప్రకటించారు. ఈ అంశం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. కాంగ్రెస్, సీపీఎంతోపాటు బీజేపీ సీనియర్ నేత ఉమాభారతి కూడా ఆయన మద్దతు తీసుకోవడాన్ని తప్పుబడుతున్నారు. గోపాల్ కందా 2012లో కాంగ్రెస్ ప్రభుత్వంలో హోం మంత్రిగా పని చేశారు. అప్పట్లో తన ఏవియేషన్ కంపెనీలో పని చేసిన ఎయిర్ హోస్టెస్ ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని ఆయనపై కేసు నమోదైంది. ఆ తర్వాత ఆరు నెలలకు గీతికా శర్మ తల్లి కూడా ఆత్మహత్య చేసుకున్నారు. అందుకు కందానే కారణమని ఆరోపణలు వచ్చాయి. కందాకు వ్యతిరేకంగా అప్పట్లో బీజేపీ ఆందోళనలు చేసింది. అలాగే, గీతికా శర్మపై అత్యాచారం చేశారనే ఆరోపణలపైనా ఆయనపై కేసు నమోదైంది. అయితే, రెండేళ్ల తర్వాత ఢిల్లీ హైకోర్టు ఆ ఆరోపణను కొట్టివేసింది. ఈ నేపథ్యంలోనే, కందా మద్దతు తీసుకుంటే మోదీ, సీఎం ఖట్టర్ క్లీన్ ఇమేజ్ దెబ్బతింటుందని ఉమా భారతి అన్నారు. కందాపై గతంలో మోదీ, అమిత్ షా ఆరోపణలు చేశారని, దాంతో, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించామని, ఇప్పుడు ఆయన మద్దతు ఎలా తీసుకుంటారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా నిలదీశారు.

# హరియాణాలో సంకీర్ణం

### కూటమిగా బీజేపీ-జేజేపీ ప్రభుత్వం



విజయసంకేతం చూపుతున్న అమిత్‌షా, నడ్డా, ఖట్టర్, దుష్యంత్

న్యూఢిల్లీ, అక్టోబరు 25: హరియాణాలో బీజేపీ-జేజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరబోతోంది. 90 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో అతిపెద్ద పార్టీ బీజేపీకి కేవలం 40 సీట్లు రావడంతో సంకీర్ణం తప్పలేదు. సాధారణ మెజారిటీ సాధించడానికి మరో ఆరు ఎమ్మెల్యే సీట్లు అవసరం కాగా ఎనిమిది మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతిస్తామని ముందుకొచ్చారు. బీజేపీ అధినాయకత్వం మాత్రం చిన్న వయస్సులో సొంత పార్టీ- జననాయక్ జనతా పార్టీ(జేజేపీ)- స్థాపించి, రాష్ట్రంలో దిగ్గజాలను ఢీకొన్న దుష్యంత్‌తోనే జట్టు కట్టాలని నిర్ణయించింది. ఆ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆయన్ను ఢిల్లీకి పిలిపించి సంప్రదింపులు జరిపారు. ఉప ముఖ్యమంత్రి పదవిని ఇవ్వచూపారు. ఈ సమావేశం తర్వాత అమిత్‌షా మీడియాతో మాట్లాడుతూ, మనోహర్‌లాల్ ఖట్టరే తదుపరి ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి జేజేపీ నుంచే వస్తారని చెప్పారు. హరియాణా ఫలితాలు వెలువడగానే బీజేపీకి చెందిన ముఖ్యమంత్రి ఖట్టర్ హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. అధినాయకత్వంతో చర్చలు జరిపారు. శనివారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై ఖట్టర్‌ను తమ నేతగా ఎన్నుకోనుంది. శనివారమే ఖట్టర్ గవర్నర్‌ను కలిసి, ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని కోరనున్నారు. దీపావళి తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. బీజేపీకి మద్దతు ఇస్తామన్న ఎనిమిది మంది స్వతంత్ర ఎమ్మెల్యేల్లో వివాదాస్పద నేత గోపాల్ కందా ఉన్నారు. ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసినపుడు తన ఎయిర్‌లైన్ కంపెనీ యువతిని ప్రేమ పేరుతో వేధించి, ఆత్మహత్య చేసుకొనేలా ప్రేరేపించారంటూ బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేసింది. ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించే వరకు పోరాటం చేసింది. అప్పట్లో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ లేకపోవడంతో గోపాల్ కందాయే స్వతంత్రులను పోగేసి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలబెట్టారు. ఇప్పుడాయనే మళ్లీ స్వతంత్రులను పోగేసి, బీజేపీకి మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. కందా మద్దతును బీజేపీ తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఆయన మద్దతు తీసుకోకపోవచ్చని తెలుస్తోంది.

**కనీస ఉమ్మడి కార్యక్రమానికి ఎస్ అంటేనే**

తమ రాజకీయాలను గౌరవించే పార్టీకే మద్దతు ఇస్తామని జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) అధినేత దుష్యంత్ చౌటాలా ప్రకటించారు. శుక్రవారం ఆయన పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. తమకు కాంగ్రెస్, బీజేపీల్లో ఎవరూ శత్రువులు కాదన్నారు. కనీస ఉమ్మడి కార్యక్రమంతో ముందుకు వచ్చే ఏ పార్టీతోనైనా కలిసి పని చేయడానికి సిదమేనని ప్రకటించారు. కాగా, దుష్యంత్ చౌటాలా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలుస్తోంది.

# 1008 మంది భారతీయుల జన్యుక్రమం ఆవిష్కరణ

### ఉద్దానం కిడ్నీ బాధితులు సహా 55 జాతులు/తెగల రక్తనమూనాల సేకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 25: దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ జాతులు, తెగలకు చెందిన ప్రజలను పట్టిపీడిస్తున్న వ్యాధులపై భారత ప్రభుత్వం పూరించిన సమరశంఖం.. 'ఇండిజెన్ జీనోమ్ ప్రాజెక్ట్'. ఇందులో భాగంగా దేశంలోని అన్ని ప్రాంతాలకూ చెందిన 55 జాతుల/తెగల ప్రజల 1008 మంది భారతీయుల సంపూర్ణ జన్యుపటాన్ని సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్) రూపొందించింది. దీని వల్ల ఆయా వ్యాధులకు కచ్చితంగా, సమర్థంగా పని చేసే మందులను కనుగొనడం, ఏయే మందులు ఎవరిపై ఎలా పనిచేస్తాయనే విషయం తెలుసుకోవడం సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి హర్షవర్ధన్, సీఎస్ఐఆర్ డైరెక్టర్ శేఖర్ మండే తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును ఢిల్లీలోని సీఎస్ఐఆర్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ (ఐజీఐబీ), హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) విభాగాలు నిర్వహించాయి. ప్రాజెక్టులో భాగంగా శాస్త్రజ్ఞులు.. దక్షిణ కర్ణాటకలోని శివమొగ్గ ప్రాంతంలో 'హండిగోడు సిండ్రోమ్'తో బాధపడుతున్న ప్రజల నుంచి దాదాపు 100 నమూనాలు సేకరించారు. హండిగోడు సిండ్రోమ్ అనేది ఒకరకమైన ఆస్టియోఆర్థరైటిస్. శివమొగ్గలో 35 నుంచి 40 శాతం మంది ప్రజలు దీంతో బాధపడుతుంటారు. దీని బారిన పడినవారు మూడు-మూడున్నర అడుగులకు మించి ఎత్తు ఎదగరు. మోకాళ్లు వంగిపోయి ఉంటాయి. వారికి ఈ వ్యాధి ఎందుకు వస్తోందో ఎవరికీ అంతుచిక్కలేదు. వారి జన్యుక్రమాన్ని సంపూర్ణంగా తెలుసుకోగలిగితే ఈ సమస్యను పరిష్కరించే అవకాశం ఉందన్నది శాస్త్రజ్ఞుల భావన. అలాగే.. ఏపీలోని ఉద్దానంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నవారి నుంచి కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా రక్త నమూనాలు సేకరించారు. ఇంకా.. ఎక్కువ కాలం బతికే రహస్యం తెలుసుకునేందుకు 90 ఏళ్లకు పైబడిన వయసున్నవారి నుంచి కూడా నమూనాలు సేకరించారు. ఇంకా.. సిస్టిక్ ఫైబ్రోసిస్, బీటా తలసీమియా, హంటర్ సిండ్రోమ్ తదితర 55 రకాల సమస్యలతో బాధపడుతున్నవారి రక్తనమూనాలను సేకరించారు. భారత ప్రజల్లోని జన్యు వైవిధ్యాన్ని అధ్యయనం చేయడానికే కాక.. జన్యువ్యాధులను నిరోధించే, నివారించే, నియంత్రించే ఔషధాల తయారీకి 'ఇండిజెన్' ప్రాజెక్టు ఫలితాలు ఉపయోగపడతాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

## కశ్మీర్ బీడీసీ ఎన్నికల్లో 98 శాతం పోలింగ్

### 370 రద్దు వల్లే.. భారత్‌కు గర్వకారణం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 25: జమ్ము కశ్మీర్‌లో తొలిసారిగా నిర్వహించిన బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (బీడీసీ) ఎన్నికల్లో భారీస్థాయిలో 98.3 శాతం పోలింగ్ నమోదైంది. పంచాయతీరాజ్ వ్యవస్థలో రెండో అంచె అయిన ఈ ఎన్నికల్లో 310 బ్లాక్‌లకుగాను 1080 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో బీజేపీ అభ్యర్థులు 22 మంది సహా మొత్తం 27 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఏడాది తొలి అంచె ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన 26,629 మంది ఓటర్లుగా ఈ ఎన్నికల్లో ఓటు వేశారు. కాగా జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం వల్లే బీడీసీ ఎన్నికల్లో ఇంత భారీగా పోలింగ్ నమోదైందని ప్రధాని మోదీ అన్నారు. 'జమ్ము కశ్మీర్‌లో బీడీసీ ఎన్నికలు జరిగిన తీరు ఎంతో సంతోషం కలిగిస్తోంది. ప్రజలు ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనేందుకు ఎంతగా ఉత్సాహంగా ఉన్నారో, ప్రజాస్వామ్యంపై ఎంతటి విశ్వాసం కలిగి ఉన్నారో తెలిపేందుకు ఈ ఎన్నికలే నిదర్శనం. ఆర్టికల్ 370 రద్దు వల్లే ఇది సాధ్యమైంది' అని ప్రధాని ట్వీట్ చేశారు.



స్మారకోపన్యాసం చేస్తున్న బిపిన్ రావత్

# పీవోకే మనదే

### గిల్గిట్, బాల్టిస్థాన్ కూడా భారత్‌లో భాగమే

- వాటిని పాక్ అక్రమంగా ఆక్రమించుకుంది
- ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25: పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిట్ బాల్టిస్థాన్ సహా.. యావత్ జమ్మూకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని ఆర్మీచీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్పష్టం చేశారు. ఆ రెండు ప్రాంతాలనూ మనకు పశ్చిమాన ఉన్న పొరుగుదేశం అక్రమంగా ఆక్రమించుకుందని.. ఇప్పుడు పీవోకే పాక్ అధీనంలో లేదని, అది ఉగ్రవాదుల చెరలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీవోకేను.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నియంత్రిత భాగంగా అభివర్ణించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఫీల్డ్ మార్షల్ కేఎం కరియప్ప స్మారకోపన్యాసం కార్యక్రమంలో బిపిన్ రావత్ పాల్గొని ప్రసంగించారు. భారత్‌పై ఎలాంటి దుస్సాహసానికీ దిగొద్దని పాక్‌ను హెచ్చరించారు. ఒకవేళ అలాంటిపనేదైనా చేస్తే తగిన బుద్ధి చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని దాయాది దేశానికి స్పష్టం చేశారు. "జమ్మూకశ్మీర్‌లో ఏం జరుగుతోందనే ఆందోళన మనందరికీ ఉంది. జమ్మూకశ్మీర్ ఎప్పుడూ మన దేశంలో భాగమే. (1947) అక్టోబరు 26న మహరాజా హరిసింగ్ విలీన ఒప్పందంపై సంతకం చేసినప్పుడు రక్షణ, విదేశాంగ, కమ్యూనికేషన్స్ అనే మూడు అంశాలు మాత్రమే భారత ప్రభుత్వ నియంత్రణలో ఉంటాయి. కానీ, మన రాజ్యాంగంలోని మొదటి అధికరణంలోని ఒక సెక్షన్.. జమ్మూకశ్మీర్ భారత్‌లో భాగమని స్పష్టంగా చెప్పింది. జమ్మూకశ్మీర్ అంటే.. పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిట్ బాల్టిస్థాన్‌తో సహా అని అర్థం. అంటే.. పీవోకే, గిల్గిట్ బాల్టిస్థాన్‌లు ఆక్రమిత ప్రాంతాలు. మనకు పశ్చిమాన ఉన్న పొరుగుదేశం ఆ ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకుంది" అని వ్యాఖ్యానించారు. అటు అరుణాచల్‌ప్రదేశ్‌లో సేలాలోని వాస్తవాధీన రేఖ వద్ద సైనికుల యుద్ధవిన్యాసాలను రావత్ సమీక్షించారు.

# పవనిజమంటే ఇదేనా?

- టీడీపీతో లాలూచీ, జగన్‌తో పేచీనా?: పేర్ని

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): "జనసేన అధినేత పవన్ కల్యాణ్, చంద్రబాబుతో చేతులు కలిపి సీఎం జగన్‌ని విమర్శిస్తున్నారు. పవనిజం అంటే అదేదో సిద్ధాంతం అనుకున్నాం. కానీ జగన్‌ని వ్యతిరేకించడం, విమర్శించడం, తప్పుపట్టడం, దూషించడమే పవనిజమని తెలిసింది. పవనిజమంటే టీడీపీతో లాలూచీ, జగన్‌తో పేచీనేనా?" అని మంత్రి పేర్ని నాని నిలదీశారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు పవన్, ప్రతిపక్షంలో ఉన్న జగన్‌ని ప్రశ్నించారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉంటే.. ప్రతిపక్షంలోని చంద్రబాబుకు వంతపాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాన్ని ప్రశ్నించడమే పవనిజమైతే ఇప్పుడూ ప్రతిపక్షాన్ని ప్రశ్నించాలి కదా? అని నిలదీశారు. జగన్‌పై ఉన్న కేసులన్నీ రాజకీయ ప్రేరేపిత కేసులేనని ప్రజలు గుర్తించారన్నారు. బీజేపీ, టీడీపీతో కలిసి ఉన్నప్పుడు పవన్ ఏం సాధించారని ప్రశ్నించారు. కేఏ పాల్ అమాయకుడు కాబట్టి ఐలాపురం హోటల్‌లో ఒప్పందం కుదుర్చుకున్నాడని.. పవన్ తెలివైనవాడు కాబట్టి అమెరికాలో సెటిల్ చేసుకున్నారని విమర్శించారు. పవన్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ తరుపున కోవర్ట్ ఆపరేషన్ కోసమే సుజనా చౌదరి బీజేపీకి వెళ్లారని, బీజేపీ ముసుగేసుకున్న సుజనా... జగన్‌కి అమిత్ షా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని మాట్లాడం దారుణమన్నారు. ధర్మసూక్తులు చెప్పే చంద్రబాబు ఢిల్లీలో ఒక రోజు దీక్షకు రూ.10 కోట్లు ఖర్చు చేయడాన్ని సమర్థిస్తామా? అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అమిత్‌షాకు పుట్టిన రోజు పేరుతో చంద్రబాబు, లోకేశ్ లవ్ లెటర్లు ఎందుకు రాస్తున్నారని మంత్రి ప్రశ్నించారు.

## బాబుకు చదవేస్తే ఉన్న మతి పోయింది

- ఇసుక ఎక్కడ దొరికితే అక్కడ తవ్వేస్తాం: మంత్రి కన్నబాబు

కరప, అక్టోబరు 25: "చదవేస్తే ఉన్న మతి పోయింది అన్న చందాన.. మాజీ సీఎం చంద్రబాబును చూస్తే నవ్వొస్తుంది. ఎన్ని లక్షలైనా ఫర్వాలేదని బోటు వెలికితీతను ధర్మాడికి అప్పగించింది మా ప్రభుత్వమే. ఆ విషయాన్ని చంద్రబాబు మరిచి ఏదేదో మాట్లాడుతున్నారు" అని మంత్రి కన్నబాబు మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా కరపలో భారీ వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కచ్చులూరు వద్ద మునిగిన బోటును ధర్మాడి సత్యం వెలికితీసినందుకు అభినందిస్తూ చంద్రబాబు లేఖ రాయడం, వారి నాయకులు సత్యాన్ని సన్మానించడాన్ని స్వాగతిస్తామన్నారు. అయితే ఆ లేఖలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోయినా ధర్మాడి సత్యం బోటును వెలికితీశారనడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఇలా అయితే రాజధాని, హైటెక్‌సిటీ తానే కట్టించానని ఇకపై చంద్రబాబు ప్రగల్భాలు పలకరాదని, వాటిని కట్టించింది తాపీ మేస్త్రిలు, కాంట్రాక్టర్లని భావించాల్సి ఉంటుందన్నారు.

## ముగ్గురు టీడీపీ నేతలకు హైకోర్టు నోటీసులు

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై హైకోర్టు టీడీపీకి చెందిన ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ఎన్నికను సవాలు చేస్తూ ఆయన ప్రత్యర్థి మోదుగుల వేణుగోపాలరెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై వైసీపీ అభ్యర్థి సత్యనారాయణమూర్తి తరపు ఎన్నికల ఏజెంట్ వాసుదేవరావు, విజయవాడ తూర్పుఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావుపై వైసీపీ అభ్యర్థి భవకుమార్ తరపు ఎన్నికల ఏజెంట్ శ్రీనివాసరెడ్డి పిటీషన్లు దాఖలు చేశారు.

Printed and published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at "Aamoda Press" at Sy.No.239-2A, Bypass Road, Anantapur-515 001, Ph.No.248980/82, Fax:274711 Editor: K.SRINIVAS.
RNI No: APTEL/2003/10031 Managing Director : Vemuri Radha Krishna Founder : K.L.N.Prasad